

చైతన్యం
సంకల్ప బలం
నవంబర్ 2019
రూ. 20
బ్రహ్మపుత్ర పుష్కరాలు నవంబర్ 5- 16



శ్రీశైలం మల్లికార్జునస్వామి వారి ఆలయం



# చైతన్యం

సంకల్ప బలం


సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -9 నవంబర్ 2019 సంచిక - 2



వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**


## ఈ సంచికలో

### ధారావాహికములు:


| | |
|---|---|
| మానసరోవర యాత్ర | 6 |
| పూరి జగన్నాధస్వామి వైభవం | 9 |
| ప్రేమంటే ఇంతే | 26 |
| గడిలో దాగిన వైజ్ఞానిక నుడి | 34 |
| తెలుగు పద్య రత్నాలు | 35 |
| మా ఊరి నందుల కథ | 40 |
| హాస్యపు జల్లు - అల్లు | 41 |
| మలుపులు | 42 |
| ప్రహేళిక | 50 |


### ప్రత్యేక ఆకర్షణలు


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| వ్రత సమాహారం-కార్తీక మాసం | 13 |
| నేను గేటెడ్-నువ్వు ఎల్ ఐ జి | 17 |
| కలియుగ నరకాసుర | 18 |
| మూడవ రాష్ట్రపతి జాకీర్ హుసేన్ | 19 |
| అంకెలు,సంఖ్యలు: అయిదు | 23 |
| అసలైన సంపద | 36 |
| నీరు - విలువ | 46 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# ట్రింగ్ ట్రింగ్ ------ హలో హలో

ట్రింగ్ ట్రింగ్ అని ఫోన్ శబ్దం రాగానే పూర్వం ఇంటిల్లిపాది లేచి ఫోన్ దగ్గరకు ఆత్రుతగా వచ్చేవారు. ఒకప్పుడు ఫోన్ అంటే ఎంతో ధనవంతుల ఇంట్లో మాత్రమే ఉండేది. అందరూవాళ్ళ ఇంట్లో ఫోన్ వుంది అని ఎంతో  గొప్పగా చెప్పుకునే వారు. క్రమేపి అత్యవసరానికి మాట్లాడుకుందుకు ట్రంకాల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఆ తరువాత మెల్లగా బిఎస్ఎన్ఎల్ వారి ల్యాండ్ లైన్ కొద్దిగా కాస్ట్లీ అయినా ఫరవాలేదు భరించవచ్చు అనేటట్టుగా అందుబాటులోకి వచ్చింది. అలాగే బయట టెలిఫోన్ బూత్ ల ద్వారా మనదేశంలో ఉన్న వారితోనే  కాక విదేశాలలో ఉన్నవారితో కూడా మాట్లాడుకుందుకు అందుబాటులోకి వచ్చాయి. కాల క్రమేణా మధ్య తరగతివారు ల్యాండ్ లైన్ ఇంటిలోనే వినియోగించుకునే స్థితికి వచ్చి, రానురాను సెల్ ఫోన్ లు తయారయ్యి ప్రజల వినియోగం లోకి వచ్చాయి. ప్రజలకు సెల్ ఫోన్ లు అందుబాటు లోకి వచ్చాక ఆ ఫోను ప్రజలకు జీవన వ్యవస్థలో ఒక భాగంగా తయారయ్యింది. ఎంత అంటే అది లేకపోతే ఊపిరి ఆడనంతగా తయారయ్యి, పేదవారు కూడా వినియోగించగలిగిన ధరలకు అందుబాటులోకి వచ్చాయి. చివరకు ఎలా అయ్యిందంటే ఎంతసేపు మాట్లాడినా మనం భరించగలిగే అతి స్వల్ప ధరలలోకి ఫోనులు, బిల్లులు కూడా చేతికి రావడంతో ప్రజల ఆనందానికి హద్దులు లేవు.  ఇంత వరకూ బానే ఉంది. కానీ .... ఏదైనా అతి సర్వత్రా పనికి రాదు కదా! ఈ సెల్ ఫోనులు అందరూ వినియోగించుకునే ధరలలోకి అందుబాటులోకి రావడంతో సద్వినియోగం కన్నా దుర్వినియోగం ఎక్కువగా అవుతోంది. చిన్న పిల్లల దగ్గరనుండి పెద్దవారి వరకు ఎవరి చేతిలో చూసినా ఫోన్. అందులోనూ రకరకాల సైజులలో రకరకాల ఆకర్షణలతో రక రకాల ఫీచర్స్ తో ఎవరి స్తోమతు కి తగ్గట్టు వారికి అందుబాటులో ఉన్నాయి. ఇక ప్రతీవారికి ఫోన్ సందడే. ప్రొద్దుట లేచి బ్రష్ చేసుకోవడం దగ్గర నుండి పడుకునే వరకు రోజు వారీ జరిగే కార్యక్రమాలన్నీ వెళ్ళబోసుకోవడంలో ఎవరికి వారే సాటి .. టైం ఉండాలే కానీ ప్రేమికుల దగ్గరనుండి ఆడవాళ్ళ వంటల కబుర్లు. సీరియల్స్ తో సహా అన్నీ ఫోన్ లోనే. బస్సులో నిలబడినా సరే క్రికెట్ దగ్గరనుండి రాజకీయాల వరకు అన్నీ ఫోన్ లోనే చూస్తున్నారు. ఇక టైం లేని వాళ్ళు మెస్సేజ్ లు ఇచ్చుకుంటూ పనులు కానిచ్చుకుంటున్నారు. ప్రజల అవసరాలు, వాడకం ఫోన్ ల కంపెనీల దృష్టిలో పడడంతో, ప్రభుత్వానికి ధీటుగా ప్రైవేటు కంపెనీలు వచ్చి ప్రజలకు ఆఫర్ల మీద ఆఫర్లు అనౌన్సు చేస్తూ ప్రజలను ఇంకా ఊరిస్తున్నాయి. అదే సందుగా ప్రతీ అడ్వర్ టైజ్ మెంట్ వారు క్షణ క్షణానికీ ఫోన్ చేసి కూర్చుంటే ఫోను, నిలబడితే ఫోన్ అన్నట్లు విసిగిస్తున్నారు. ఇక గూగుల్ లో ఏ ప్రకటననైనా చూసామో! ఆ క్షణం నుండీ వాళ్ళ చేతికి మనం చిక్కినట్లే. మీకది అవసరం కదా! అని ఫోన్ చేసి విసి గిస్తూ ఉంటారు. చివరికి ఈ ఫోన్ ఎలా తయారయ్యింది? అంటే ఇన్ని ఫోన్లు ఉండడం వల్ల వాడకం విపరీతంగా పెరిగి, సిగ్నల్స్ అందుబాటులో ఉండక, అత్యవసరమైన ఫోన్ కుడా రిసీవ్ చేసుకుంటే ఫోన్ విన్పించక నానా ఇబ్బంది పడే పరిస్థితి వచ్చింది. ఎంతో ముఖ్యమైన పనుల్లో ఉన్నప్పుడు, ఎప్పుడు పడితే అప్పుడు అంటే మంచి నిద్రలో ఉన్నప్పుడు కూడా ఫోన్ చేసి, మా దగ్గర స్థలాలు ఉన్నాయి కావాలా? అని, మా కంపెనీలో ఈ ఆఫర్లు ఉన్నాయి కావాలా? అనీ ఫోన్ చేసి మరీ విసిగిస్తున్నారు. ఇక స్కూల్స్ లోను కాలేజీల్లోనూ అయితే అసలు చెప్పక్కరనే లేదు,చదువంతా అందులోనే కానిచ్చేస్తున్నారు. ఇక యువతీ యువకులైతే చెప్పక్కరనే లేదు. వారి దృష్టి చెడు వాటి మీద గా ఎక్కువ ఆకర్షిస్తోంది. అది అక్కడితో ఆగక  యువతీ యువకులు  రకరకాల వీడియోలు చూసి,వారి మనసు చెడువాటిమీద పడి, ప్రేమ అనే ఆకర్షణకు లోనై వివాహాలకు దారితీస్తున్నారు. ఈ ఫోన్లు పిల్లల చేతుల్లో చూసినప్పుడల్లా తల్లితండ్రులు నలిగిపోతున్నారు. చివరికి ఇది ఎలా తయారయ్యిందంటే నిప్పుని ఎక్కడ అవసరమో అక్కడ వాడకుండా అంతటా మనల్ని మనమే కాల్చుకుందుకు వినియోగించుకోవడంలా తయారయ్యింది.

అతి సర్వత్రా వర్జయేత్ .

తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

9 వ జన్మదిన సంచిక జరుపుకున్న చైతన్యం పత్రికకు శుభాకాంక్షలు, అభినందనలు. విలువలతో కూడుకున్న పత్రికను ఈ రోజుల్లో కుడా ఇంత అద్భుతంగా తీసుకువస్తున్నారు. పత్రికలోని ప్రతీ రచయిత, ఎవరని చెప్పను ఎవరికీ వారే సాటి, అన్నట్లుగా చాలా బాగా వ్రాస్తున్నారు. ప్రతీ ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు.
**శ్రీ రాంబడుగుల కృష్ణ, శ్రీమతి వనిత, --- అనంతపూర్. జయ రామారావు, శ్రీ జనార్ధన కృష్ణ, శ్రీమతి లక్ష్మి --- రావుల పాలెం.**

ఎడిటోరియల్ చాలా బాగా వ్రాస్తున్నారు అప్ టు డేట్ గా. మానస సరోవర యాత్ర మాకు దగ్గరుండి మీరు చూపించారా ? అనిపించింది. చాలా చాలా ఆనందపడుతున్నాము. ఎంతో వివరంగా చెబుతూ మాకు వీడియో కూడా చూపించారు. నిజంగా అద్భుతం. మా అదృష్టం.
**శ్రీ రంగా రావు, శ్రీ గోపాలం, శ్రీమతి ఉష ---- రాజమండ్రి. శ్రీ కేశవ రావు, శ్రీ మధుసూదన రావు, శ్రీమతి అనసూయ --- కర్నూలు.**

డా. పోచిన పెద్ది మురళీకృష్ణ వ్రాసిన 'బాబా చరిత్ర సంస్కారాలు, కాశీ ఖండము ఇలా మంచి మంచి రచనలు చేసి, మాకు ఎన్నెన్నో విషయాలు తెలియజేసారు. అలాగే పూరీ జగన్నాద్ గురించి మాకు తెలియ జెప్పడం ఆనందాన్ని కలిగిస్తోంది. వారి నుండి ఎన్నో తెలుసుకున్నాము. అలాగే 'కొత్త రామానందం' గారు ప్రతీ నెలా ప్రతీ పండుగని గూర్చి ఎంతో వివరంగా వ్రాసారు. మాకు తెలియని ఎన్నో పండుగల విశేషాలు, పండుగలు ఎలా జరుపుకోవాలి? వంటి ఎన్నో విషయాలు తెలియజేసారు. అందరికీ మా ధన్యవాదాలు.
**శ్రీమతి సుజాత, శ్రీమతి మణి,శ్రీ కామేశ్వర రావు ----- కాకినాడ. శ్రీమతి సుబ్బలక్ష్మి , శ్రీ రమేష్ , శ్రీమతి పల్లవి ---- రావుల పాలెం.**

'శ్రీ భువన చంద్ర గారు' కందరికీ ఎంతో ఇష్టమైన పాటలు సినిమాలలో అందివ్వడమే కాక, చైతన్యం పత్రికలో కుడా 8 సంవత్సరాలు మనసుకు హత్తుకునే ఆధ్యాత్మిక స్వామీజీ కథలతో పాటు ఎన్నో అద్భుతమైన కథలను మాకందించారు. ఇంత గొప్ప రచయితల కథలను చదివే అదృష్టం మాకు కలిగింది. శ్రీ వేమూరి వెంకటేశ్వర రావు గారు విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన ఎన్నెన్నో విషయాలను తెలియజేసారు. అమెరికాలో ఉంటూ మాకు తెలియని ఎన్నో విషయాలను ఎంచుకుని వ్రాసారు. చాలా స్టాండర్డ్ గా ఉంటున్నాయి వారు వ్రాసినవి.
**శ్రీ సురేష్, శ్రీ మధుసూదన రావు --- పూనా , శ్రీమతి పల్లవి , శ్రీమతి రాధ --- మార్కాపురం. శ్రీప్రసాద శ్రీ పభాకర రావు --- ఏలూరు.**

ఇన్ని అవార్డులు తెచ్చుకున్న పోడూరి శ్రీనివాస రావు గారు 60 మంది జీవిత చరిత్రలు, 60 వరకు చిన్నారులకు, కవితలు అందివ్వడం లోనే వారి రచనా చాతుర్యం తెలుస్తోంది. ప్రతీ రచనలోను వారి చాతుర్యం తెలుస్తోంది. శ్రీ పాలెపు బుచ్చిరాజు 4 సంవత్సరాలుగా చైతన్యం పత్రికకు బొమ్మలు చెప్పిన కథలతో పాటు నసీరుద్దీన్ కథలు, మన రాష్ట్ర పతుల జీవిత విశేషాలను కుడా చాలా చక్కగా వ్రాస్తున్నారు.
**శ్రీమతి అనుపమ, శ్రీ రవి కుమార్ , సుబ్బారావు -- హైదరాబాదు. శ్రీ వెంకట్, శ్రీ లక్షణ రావు, శ్రీమతి సుశీల --- వరంగల్.**

'మా ఊరి నందుల కథ' ధారా వాహికంగా 'నందుల ప్రభాకర శాస్త్రి గారు పల్లెలను గుర్తు చేస్తూ చాలా వివరంగా వ్రాస్తున్నారు. అలాగే పింగళి వెంకట రమణ రావు గారు 'ఎలక్ట్రాన్' అనే కలం పేరుతొ వారు వ్రాసినవి మాకు సుపరిచయమే. అలాగే చైతన్యం లో కుడా అనేక సామాజిక అంశాలను తీసుకుని వ్రాయడంలో వారిలో ఉన్న సామాజిక ధృకృధం తెలుస్తోంది.
**శ్రీమతి సౌజన్య, శ్రీమతి కాంతి , శ్రీ రామారావు ---- పితాపురం. శ్రీ అప్పారావు , శ్రీ కుమార్, శ్రీమతి రమణి ----- మండపేట.**

శ్రీ వేదుల సుబ్రహ్మణ్యం వ్రాస్తున్న పద్యాలు చాలా బావుంటున్నాయి. చిన్నప్పుడు పద్యాలు చదువుకున్న రోజులు గుర్తుకు వస్తున్నాయి. అన్ని అవార్డులు మెడల్స్ తెచ్చుకుని, ఇంత సామాజిక, ఆధ్యాత్మిక విశ్లేషణ ఉండడం మెచ్చుకోతగింది అనిపిస్తోంది. శ్రీమతి ఆదూరిహైమవతి గారు 40 సంవత్సరాలు ప్రధానోపాధ్యాయురాలిగా చేసి వారి అనుభవంతో బాలల కథలు చాలా అద్భుతంగా వ్రాస్తున్నారు. వారి జీవితాన్ని స్వామి సేవఅంకితం చేయడం గర్వకారణం.
**శ్రీ శ్రీధర్, శ్రీ మోహన్, శ్రీమతి కవిత ---- సిద్ధిపేట. శ్రీ రామ చంద్ర మూర్తి, శ్రీ సుబ్బారావు, శ్రీమతి మంజుల - విజయవాడ.**

తుమ్మూరి రామ్మోహన్ రావు గారు వ్రాస్తున్న "తెలంగాణా ప్రముఖులు" చాలా గొప్ప టాపిక్ ఎంచుకున్నారు. వారి వలన ఎందరో ప్రముఖులు, వారి వివరాలు తెలుస్తున్నాయి. అలాగే " ప్రేమంటే ఇంతే" అంటూనే ప్రేమ మయంగా నవల సస్పెన్స్ తో బాగా తీసుకు వస్తున్నారు. చాలా ఇంట్రెస్ట్ గా ఉంటోంది.**శ్రీమతి పల్లవి, శ్రీమతి అరుణ, శ్రీమతి సుకన్య , శ్రీ మధు ---- గుంటూరు. శ్రీ కృష్ణ, శ్రీమతి అరుణ ----- తణుకు.**

అమెరికా వెళ్ళి పెద్ద పెద్ద డిగ్రీలు సంపాదించడమే కాక మన తెలుగు మీద అభిమానంతో ఇంత నాలెడ్జ్ తో మీరు, వేమూరి గారు ఇంత అద్భుతంగా వ్రాయడం నిజంగా మా అందరి అదృష్టం. మీలాంటి వారి వల్లే తెలుగు బతుకుతోంది. నేమాని సూర్యనారాయణ గారు "పట్టుచీర" కథతో మా మనస్సులను దోచుకున్నారు. మీ సేవా కార్యక్రమాలు అమోఘమండి. "డా. చాగంటి కృష్ణ కుమారి గారు" చాలా రోజుల తరువాత మరల మన పత్రికకు వ్రాయడం ఆనంద దాయకం.
**శ్రీ రాం , శ్రీ గోపి కృష్ణ, శ్రీమతి అను ---- సూర్యాపేట. శ్రీమతి అమల, శ్రీ హరి గారు, శ్రీమతి మణి ---మల్కాజీ గిరి.**

శ్రీ దుర్గా ప్రసాదరావు ధారావాహికంగా మాకు అత్యంత విలువైన భాష "సంస్కృతం" అందిచ్చారు. నిజంగా మా అదృష్టం. నీళ్ళ గురించి కుడా బావుంది. నిండు కుండ తొణకదు అన్నట్లుగా ఉన్వానాయి వివరాలు. అలాగే శ్రీమతి వాణిగారిలో చాలా టాలెంట్స్ ఉన్నాయి అనిపిస్తోంది. కానీ ఈమధ్య ఎక్కడా చైతన్యంలో కనిపించ లేదు.
**శ్రీమతి జ్యోత్స్న , శ్రీమతి కమల , శ్రీ జయ రాం ----- కోదాడ. శ్రీ పవన్. శ్రీమతి పాప, శ్రీ పకాష్ ---- అనంతపూరు.**

శ్రీమతి భారతి గారు వ్రాసే ప్రతీ టాపిక్ ప్రాక్టికల్ గా ఉంటుంది. అన్నీ ఉపయోగకరంగా అనిపిస్తాయి. కావూరి శ్రీనివాస రావుగారు తాళ పత్రాల మీద చేసిన పరిశోధనలు గురించి ఎక్కడివి కనుక్కున్నారో వివరాన్ని ఇస్తారని ఆశిస్తున్నాను.
**శ్రీ తులసీ దాస్, శ్రీ ఫణి --- హైదరాబాదు . శ్రీమతి జయ, శ్రీమతి నిర్మల , శ్రీ మాధవ్ --- రాజమండ్రి.**

# కల నిజమాయె - ముక్తినాథ్ మానస సరోవర యాత్ర



నిజంగా ఆ అనుభవం అనిర్వచనీయం. ఆ పర్వతాని కున్న శక్తి మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. ఏదో చెప్పలేని అనుభూతి. ఆ కైలాష్ పర్వతానికి ఉన్న పాజిటివ్ ఎనర్జీని గురించి వర్ణించలేం. ఆనంద భాష్పాలు వచ్చేసాయి. మా జీవితం ధన్యం అయింది అనిపించింది.

తెల్లవారింది. వెలుగు వ్యాపించసాగింది. డ్రైవర్ మాకిచ్చిన గడువు దాటిపోయింది. మమ్మల్ని తొందర పెట్టడం మొదలుపెట్టాడు. ఎవరైనా చూస్తే నాకు సమస్య అవుతుంది, ఇంక మనం తిరిగి వెనక్కి 'డార్చేన్' వెళ్లిపోవాలి అని కంగారు పెట్టడం మొదలుపెట్టాడు డ్రైవర్. ఆ కైలాస పర్వతాన్ని వదలిపెట్టి రావడానికి మనసు ఎంత మాత్రం అంగీకరించకపోయినా, తప్పనిసరి పరిస్థితుల్లో తిరిగి బయలుదేరాల్సి వచ్చింది. ముగ్గురం మరోసారి కైలాస పర్వతానికి మనసారా నమస్కరించుకుని, తనివితీరా ఇంకోసారి చూసుకుని జీప్ ఎక్కి కూర్చున్నాం. డ్రైవర్ బండిని పోనివ్వసాగాడు. బ్రహ్మపుత్ర నది వెంబడే మా ప్రయాణం సాగింది. ఆ స్వచ్ఛమైన నీటి ప్రవాహాన్ని చూసుకుంటూ, మధ్యమధ్యలో వెనక్కి తిరిగి కైలాస పర్వతాన్ని చూసుకుంటూ మా ప్రయాణం కొనసాగించాం. వేలాది యాత్రికులు పరిక్రమ చేస్తూ కనపడ్డారు. ఓ గంట ప్రయాణం తర్వాత మా హోటల్ కు చేరుకున్నాం. రూమ్ కి వెళ్లి, అక్కడ ఉండిపోయిన ఇద్దరు సహయాత్రికులతో మా కైలాస పర్వత అనుభవాలు, అనుభూతులు పంచుకున్నాం. వాళ్ళు అది విని, తామే స్వయంగా చూసినంత సంబరపడ్డారు.

అందరం కలిసి బ్రేక్ ఫాస్ట్ చేయడానికి హోటల్ హిమాలయకు బయలుదేరాం. అక్కడ 'మధుబన్' వాళ్ళు పెట్టిన వేడి వేడి టిఫిన్లు తిని, తిరిగి వెనక్కి రూమ్ కి వచ్చాం.

కాసేపటి తర్వాత మా లయాజన్ ఏజెంట్ మా రూమ్ కి వచ్చాడు. మీ పరిక్రమ అయిపోయింది కదా. ఇంక ఇక్కడ 'డార్చేన్' లో చూడటానికి ఏమీ లేదు. మీరు అయిదుగురు హాయిగా వ్యాన్ లో మానససరోవరం వెళ్ళిపొండి. హాయిగా అక్కడ గడపండి. పరిక్రమకు వెళ్ళిన మీ మిగిలిన సహయాత్రికులు పరిక్రమ పూర్తి చేసుకుని అక్కడకు డైరెక్ట్ గా వచ్చి మీతో జాయిన్ అవుతారు అని అన్నాడు.

అతను చెప్పింది మాకు చాలా బాగుందనిపించింది. మానససరోవరం దగ్గర ఇంకా ఎక్కువ సమయం గడపడం కన్నా ఆనందం ఏముంటుందీ?

గబగబా మా బట్టలు సర్దేసుకుని, అందరం టెంపో వ్యాన్ ఎక్కి కూర్చున్నాం. వాతావర-

ణం చాలా బాగుంది. మానససరోవరం బయలుదేరింది మా టెంపో వ్యాన్. డ్రైవర్ హుషారుగా బండి పోనిచ్చాడు. ఓ రెండు గంటలు ప్రయాణం చేసి మానససరోవరం చేరాం. అక్కడ అన్నీ 'మడ్ హౌసెస్'. ఒక్కో రూమ్ లో అయిదు మంచాలు వేశారు. పరుపులు, దళసరి రజాయిలు వేశారు. అక్కడ వాష్ రూమ్స్ ఉండవు. మన పల్లెటూళ్ళలో ఓ యాభైసంవత్సరాల క్రితం ఉన్నట్టుగా, 'ఓపెన్' టాయిలెట్లు. బహిర్భూమికి వెళ్ళటానికి ఏ పొదల చాటుకో వెళ్ళాలి. రూమ్ లో మా సామాన్లు పెట్టుకుని మానససరోవర తీరానికి బయలుదేరాం. మా రూమ్ కి ఓ వంద మీటర్ల దూరంలోనే ఉంది సరోవరం.



కైలాస మానససరోవర యాత్రలో రెండవ ముఖ్యమైన ఘట్టం ఇది. ఎన్నో సంవత్సరాల కోరిక ఇప్పుడు తీరుతోంది. బ్రహ్మ స్వయంగా సృష్టించిన ఈ మానససరోవర దర్శనం పూర్వ జన్మ సుకృతం అని చెప్పటంలో ఎలాంటి సంశయం లేదు. సరస్సును వర్ణించటానికి మాటలు చాలవు. సరోవరం చూసేసరికి ఉత్సాహం ఉరకలు వేసింది. పరుగులాంటి నడకతో ఆ సరోవరం ఒడ్డుకు చేరాం.

సరోవరంలో ఎవరూ స్నానం చేయరాదని అక్కడ ప్రభుత్వం వారు ఆంక్షలు పెట్టారు. వేలకొలదీ భక్తులు వచ్చి సరోవరంలో మునిగి స్నానాలు చేయటం వల్ల నీరు కాలుష్యం అయిపోతోందని వారి భావన. అందుకనే ఈ రిస్ట్రిక్షన్స్. కానీ అక్కడ రెండు టెంట్లు ఏర్పాటు చేసారు- ఒకటి ఆడవాళ్ళకి, ఒకటి మగవాళ్ళకి. వాళ్ళే బకెట్ని సరోవరంలో ముంచి నీళ్ళు నింపి టెంట్ దగ్గర పెడుతున్నారు. మనం టెంట్ (గుడారం) తలుపు వేసుకుని స్నానం చెయ్యటమే. ఫరవాలేదు అనిపించింది. అల్లాగే ఆ సరోవరం నీళ్ళతో హాయిగా స్నానం చేసి పట్టుబట్టలు కట్టుకున్నాం.

మేం ఇక్కడినుంచే బంక మన్ను తీసుకెళ్ళాం కదా. దానితో శివలింగం చేసుకున్నాం. మాతో పాటే తీసుకెళ్ళిన ఆవు నెయ్యి, సమిధలతో అభిషేకం, హోమం చేసుకున్నాం. కైలాస పర్వతం అభిముఖంగా కూర్చుని, మానస సరోవరం తీరంలో శివుడికి నమక చమక విధులతో అభిషేకం, ఆవు నేతితో హోమం చేసుకునే అదృష్టం- నిజంగా జీవితంలో ఏ (శివ)భక్తునికైనా ఇంతకన్నా ఏం కావాలి చెప్పండి. జన్మ ధన్యమయిందన్న సంతృప్తి దొరికింది. మానససరోవరంలో కలపటానికి మాతో తీసుకెళ్ళిన కొత్త బట్టలు, అల్లాగే మా చుట్టాలు, స్నేహితులు ఇచ్చిన కొత్త బట్టలు, నీళ్ళలో ఏమీ కలపకూడదన్న ఆంక్షల వల్ల, సరోవరం ఒడ్డునే, నీళ్ళకు బాగా దగ్గరలోనే ఉన్న పొదలలో పెట్టి వచ్చాం. మాతో వచ్చిన యాత్రికులలోని అస్సాం కుర్రాళ్ళు మర్నాడు తెల్లవారు ఝామున లేచి కొంచెం దూరంగా వెళ్లి సరోవరంలో మునిగి వచ్చారట. రాత్రి

పూట అంత సెక్యూరిటీ నిఘా ఉండదు కదా.

ఇలాంటి యాత్రలలో, ఎక్కడో దూరంగా ఉన్న హిమాలయాలలో సడెన్ గా మీ చుట్టాలో స్నేహితులో కనపడి పలకరించారనుకోండి. అప్పుడు ఎలా ఉంటాయి మీ ఫీలింగ్స్. మాకూ అలాగే జరిగింది. సడెన్ గా ఆరోజు సాయంత్రం ఉన్నట్టుండి 'అత్తా' అన్న పిలుపు వినపడింది. పరిచయమున్న గొంతే అది. ఎవరా అని తిరిగి చూస్తే, మావారి మేన కోడలు కనిపించింది. ఎంతో ఆనందం వేసింది. తను, ఆమె భర్త సద్గురు 'జగ్గీ వాసుదేవ్' గ్రూప్ లో వచ్చారు. అనుకోకుండా అక్కడ కలిసాం. ఆరోజు పౌర్ణమి కదా! అక్కడ ఆరోజు రాత్రి ఉండి మర్నాడు కైలాష్ పరిక్రమకు వెళ్తారట.

ఆరోజు రాత్రి పున్నమి వెన్నెలలో సరోవర అందాలను తిలకిద్దామని సరోవరం ఒడ్డునే కూర్చున్నాం. మాలాగే వందలాది భక్తులు కూర్చున్నారు.

ప్రతి పౌర్ణమి నాటి రాత్రి ఆకాశంలోంచి తారలు సరోవరంలో పడి, మళ్ళీ లేచి కైలాష్ పర్వతం మీదికి వెళ్తాయని అక్కడ ఉన్నవాళ్ళు చెప్పారు. ఆ తారలు దేవతలనీ, అలా భూమిపైకి దిగివచ్చి, సరోవరంలో స్నానం చేసి, శుచిగా పరమశివుని దర్శించటానికి వెళ్తారని భక్తుల ప్రగాఢ



విశ్వాసం. మాకు (అక్కడ కూర్చున్న మిగిలిన యాత్రికులకు కూడా) బహుశా ప్రాప్తం లేదేమో, ఆకాశం అంతా మబ్బులు కమ్మేసి ఆ దృశ్యం మా కంట పడలేదు. తెల్లవారుమున 4 గంటల దాకా అక్కడ కూర్చుని, నిరాశగా వెనక్కి తిరిగాం. పౌర్ణమి నాడు మానససరోవరం దగ్గర గడపడానికి ఈ దృశ్యం చూద్దామన్న కోరిక కూడా ఓ ముఖ్య కారణం. అంతా 'శివ సంకల్పం' అనుకుంటూ మా రూమ్ కి వచ్చి విశ్రమించాం.

మరునాడు పొద్దున్నే లేచి మళ్ళీ ఓసారి సరోవర దర్శనం చేసుకుని, బ్రేక్ ఫాస్ట్ ముగించుకుని మళ్ళీ మా బస్ లో తిరుగు ప్రయాణం ప్రారంభించాం.

మధ్యాహ్నం సుమారు 2 గంటల ప్రాంతంలో బస్సు ఒకచోట ఆపారు. ఆ స్థలంలో కొన్ని షామియానాలు వేసి ఉన్నాయి. లోపల కుర్చీలు కూడా ఉన్నాయి. అక్కడ మా అందరికీ లంచ్ ప్యాకెట్లు ఇచ్చారు. ఓ చపాతీ, బంగాళాదుంప కూర, ఓ ఆపిల్ పండు, మంచినీళ్ళు ఇచ్చారు. వాష్ రూమ్ లు మాత్రం లేవు. అక్కడ ఓ అరగంట ఆగి మళ్ళీ తిరిగి బయలుదేరాం. బస్ లో యాత్రికులు అందరూ అలసిపోయి ఉన్నారు. సరదాగా అందరితో మాట్లాడి వాళ్ళ మనోగతాలు ఎలా ఉన్నాయో తెలుసుకుందామనిపించింది. మా వారు అందరినీ వారి వారి అనుభవాలు, తీర్థ యాత్రలో వారు పొందిన అనుభూతులను అడుగుతుంటే నేను వీడియో తీసాను. మన వీడియోలో మీరు కూడా చూడవచ్చును. అంతా చెప్పిన తరువాత మా వారిని కుడా వాళ్ళు అడిగారు. ఎంతో సంతోషంగా చెప్పడం జరిగింది. తరువాత అంతా కాస్సేపు విశ్రాంతి తీసుకున్నారు. అందరూ అలసిపోయి ఉన్నారు.

ఆ యాత్రా అనుభూతులను, ఆ ఆనందాన్ని పొందుతూ అంతా నిద్రలోకి జారుకున్నారు. అలా మెల్లగా 'సాగా' ఊరు జేరుకున్నాము .

(ఇంకా వుంది)

# పూరి జగన్నాధ స్వామి వైభవం



డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

పూరి జగన్నాధుని రధయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైనది. కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాధ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాధ క్షేత్ర మాహాత్మ్యాన్ని యధామూలంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందడి.

- సంపాదకురాలు

తరువాత నారదుడు పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యంగూర్చి చెప్పాలని నిర్ణయించుకొని, నైమిశారణ్యం వచ్చాడు. మహర్షులు నారదుని ఈవిధంగా అడిగారు.

"మహాత్మా! అనేక క్షేత్రాలగురించి చెబుతూ పురుషోత్తమ క్షేత్రంగురించి ప్రస్తావించారు. ఇప్పుడు ఆక్షేత్ర వివరాలు మాకు పూర్తిగా చెప్పండి.ఆక్షేత్రంలో నారాయణుడు కొయ్యరూపంలో ఉన్నాడు.ఈ క్షేత్రాన్ని ఎవరు నిర్మించారు? ఆయన లీలలు ఏవిధంగా ఉంటాయో వివరించండి?" అని మహర్షులు అడిగారు.

"మహర్షులారా! పరమ రహస్యమైన విషయాన్ని చెబుతున్నాను, శ్రద్ధగా వినండి.

పూర్వం కుమారస్వామి పరమశివుని నుండి ఈ విషయాలను తెలుసుకున్నాడు. ఇక్కడ నారాయణుడు స్వయంగా కొయ్య రూపంలో ఆవిర్భవించాడు. పాపాలను నశింపచేయు క్షేత్రాలలో ఈ క్షేత్రం అత్యంత ప్రధానమయినది. పది యోజనాల దూరం వ్యాపించి ఉంది.

వరాహ స్వామి భూమిని సముద్రంనుండి ఉద్భవించినప్పుడు " నీలాచలం" అను పర్వతాన్ని ఇక్కడ ఏర్పాటు చేసాడు. బ్రహ్మ తిరిగి సృష్టిచేయాలని ఆలోచించినప్పుడు ఇక్కడ ఉన్న జగన్నాధుని ఈ విధంగా ప్రార్ధించాడు.

బ్రహ్మ కృత జగన్నాధ స్తుతి:-----

నమస్తే జగన్నాధ శంఖ చక్ర గదా ధర

యన్నాభి పంకజాదేవ జాతో&హం విశ్వ సృష్టి కృత్

పరమార్ధ స్వరూపం తే త్వంవైవేత్సి జన్మయ

యన్మాయయా జగత్సర్వం నిర్మితం మహదాదికం

యన్నిస్వాససముద్భూతంశబ్దబ్రహ్మత్రిధా&భవత్వ

ఉపజీవ్య తదేవాహం మస్పృజం భువనాని వై

త్వత్తో నాస్యః స్థూల సూక్ష్మ ధీర్ఘ హ్రస్వాని కించన

వికార భేదై భగవస్త్వమేవేదం చరాచరం

కటకాది యధాస్వర్ణం గుణత్రయ విభాగశః

స్రష్టా సృజ్యం త్వమేవాత్ర పోష్టా పోష్యం జగత్ప్రభో

ఆధారో ద్రియమాణం చ ధర్తా త్వం పరమేశ్వర

త్వత్ప్రేరిత మతిః సర్వశ్చరితే శుభా శుభం

తతః ప్రాప్నోతి సదృశీం త్వమైవ విహితాం గతిమ్

జగతో&స్య గతిర్భర్తా సాక్షీ త్వాం పరమేశ్వర

చరాచర గురో సర్వ జీవభూత కృపా మయ.

ప్రసీదాశ్వ జగన్నాధ నిత్యం త్వచ్ఛరణస్య మే

జగత్తుకు ఆధారమైన వాడా! శంఖ చక్ర గద ధరించినవాడా నీ నాభి కమలమునుండి పుట్టాను. ఈలోకములనుసృష్టిస్తున్నాను. నీపరమార్ధస్వరూపాన్ని నీవు తప్ప ఇతరులు తెలుసుకోలేరు. నీ మాయ వలన ఈ లోకాలు సృష్టించబడుతున్నాయి. నీ నిశ్వాసనుండి పుట్టిన శబ్ద బ్రహ్మ మూడుగా విభజింపబడింది. దాన్ని ఆధారం చేసుకొని నేను మూడు లోకాలుసృష్టించాను. నీకంటెస్థూలమైనది,అల్పమైనది, దీర్ఘమైనది, హ్రస్వమైనది మరొకటి లేదు. బంగారం అనేక రూపాలు పొందినట్లే నీవు గుణత్రయ విభాగం వలన అనేక రూపాలు పొందుతున్నావు. ఈ లోకాలకు గతివి, భర్తవు, సాక్షివి నీవే. సృష్టించేవాడవు, సృష్టించ బడేది నీవే. పోషించేవాడవు, పోషించబడేది నీవే. భరించేది, భరించబడేది నీవే. నీవే శుభా శుభాలను

కలిగిస్తున్నావు. చరా చరములకు గురువైన వాడా! పరమేశ్వరా! జీవులన్నిటియందు దయ చూపించు. జగన్నాధా! నీ పాదాల దగ్గర నాకు ఆశ్రయం  కల్పించు" అని బ్రహ్మ జగన్నాధుని ప్రార్ధించాడు.  ( 1 - 24 )

బ్రహ్మ ప్రార్ధనకు సంతుష్టుడై నారాయణుడు గరుడ ధ్వజారూఢుడై ప్రత్యక్షమయ్యాడు. " ఓ బ్రహ్మ! నీ కోరిక తీర్చడం కుదరదు. వారు కర్మబంధం అనుభవించక తప్పదు. అయినా నీ కోరిక తీరుటకు ఒక ఉపాయం చెబుతాను విను.

సముద్రానికి ఉత్తర తీరంలోను, మహా నదికి దక్షిణ తీరంలోను అన్ని తీర్ధాలఫలాన్ని ఇచ్చే ఒక ప్రదేశం ఉంది. పూర్వ జన్మలో చేసిన పుణ్యంయొక్క ఫలితాన్ని ఇక్కడ అనుభవించవచ్చు. సముద్ర తీరంలో నీల పర్వతంపైన నా నివాస స్థలం ఉంది. ఆ ప్రదేశాన్ని తెలుసుకొనుటకష్టము. అక్కడపురుషోత్తముని రూపంలో ఉన్నాను. ఈ క్షేత్రం సృష్టి, లయాలకు అతీతమైనది. నీలాచల పర్వతంపై కల్ప వృక్షం ఉంది. దానికి పడమర దిక్కున " రౌహిణము" అను కుండం ఉంది. ఆ సరస్సులోని నీటిని స్వీకరించిన వారు నా సాయుజ్యాన్ని పొందుతారు. నీవుకూడాఅచటికి వెళ్లు. అక్కడ నన్ను స్తుతించినట్లయిన నాస్వరూపాన్ని నీవు చూడగలవు. వ్రతాలు,యజ్ఞాలు చేసి పొందే ఫలితాన్ని అక్కడ ఒక్కరోజు ఉంటే లభిస్తుంది. ఆ క్షేత్రంలో ఒక్క క్షణం ఉన్నా అశ్వమేధ యాగం చేసిన ఫలితాన్ని పొందవచ్చు" అని జగన్నాధుడు బ్రహ్మకు చెప్పి అంతర్ధానమయ్యాడు.  ( 25 – 44)

స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండంలోని పురుషోత్తమ క్షేత్ర వైభవం లోని జైమిని ఋషి సంవాదం అను ప్రధమాధ్యాయం సమాప్తం

## 2 వ అధ్యాయం

(జైమిని,ఋషి,సంవాదము,యమ,లక్ష్మీసంవాదము)

జగన్నాధుడు అంతర్ధాన మయిన తరువాత, బ్రహ్మ స్వామి చెప్పిన ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ స్వామిని ప్రత్యక్షంగా చూసాడు. ఆనందించి, జ్ఞానాన్ని పొందాడు.

ఇంతలో అక్కడకు ఒక కాకి వచ్చింది.

అక్కడ ఉన్న రౌహిణము అను కుండంలోనీరుతాగింది.

భూమిపై పడి ప్రాణాలు విడిచింది. జగన్నాధుడు ప్రత్యక్షమయి, ఆ కాకికి మోక్షాన్ని ఇచ్చాడు. ఈక్షేత్రంలోస్వామినిప్రత్యక్షంగాచూడవచ్చు. మనస్సులో స్వామిని తలచుకుంటూ ప్రాణాలు విడిచి పెడితే స్వామిని ప్రత్యక్షంగా చూడవచ్చు. మూఢులకు కూడా ఇక్కడ ముక్తి లభిస్తుంది. శాంతి, వైరాగ్యము, జ్ఞానము కలవారికి లభించు ఫలితమును ఎవరు వర్ణించలేరు.  ( 1- 13)

" మహర్షి! నీలాద్రిపై బ్రహ్మ జగన్నాధుని చూసి ఏం చేసాడు? స్వామిని దర్శించుకొని ప్రాణాలు విడిచిన కాకి ఏంచేసింది? వివరంగాచెప్పమని ఋషులు అడిగారు.

నీలాద్రిపై బ్రహ్మ స్వామిని చూసి, ధ్యానించుచుండగా అక్కడికి యముడు వచ్చాడు. యముడు తన అధికారం స్థిరంగా ఉండునట్లు చూడమని, జగన్నాధుని ఈ విధంగా ప్రార్ధించాడు.

యముడు జగన్నాధుని ప్రార్ధించుట:-------

నమస్తే దేవ దేవేశ సృష్టిస్థిత్యంత కారణ

త్వయి ప్రోత మిదం సర్వం సూత్రే మణిగణా యధా

త్వయాధృతంత్వయాసృష్టంత్వయాచాప్యాయితంజగత్

చంద్ర సూర్యాది రూపేణ నిత్యం భావయసే&ఖిలం

విశ్వేశ్వరం జగద్యోనిం విశ్వావాసం జగద్గురుమ్

విశ్వసాక్షిణమాద్యంత వర్జిజం ప్రణమామ్యహం

నమః పరమ కారుణ్య జల సంభృత సింధవే

పరావర పరాతీత విభవే విశ్వ సంభవే

నమః కమల కింజల్కపీత నిర్మల వాససే

మహాహవరిపుస్కంధ కృంత చక్రాయ చక్రిణే

దంష్ట్రోద్ధృతక్షితిభృతే త్రయీ మూర్తిమతే నమః

నమో యజ్ఞ వరాహాయ చంద్ర సూర్యాగ్నిచక్షుసే

ఓ దేవ దేవా! సృష్టి స్థితి లయలకు నీవే కారణం. సమస్త విశ్వం నీపై ఆధారపడి ఉంది. ఈ విశ్వం,సృష్టి, స్తితి, లయలకు నీవే కారణం. చంద్ర సూర్యాది రూపాలలో నీవే లోకాలను ప్రకాశింప చేస్తున్నావు. ఆది, అంతము లేని వాడవు. పరమ కారుణ్య రూపం కలవాడవు. పరము, అపరము నీవే. పరమునకు అతీతుడవైన వాడవు నీవే. ఈ విశ్వాన్ని నీవే సృష్టించావు. సంసార దుఃఖమనకు, మంచుకు, నీవు సూర్యుడవు. దీనులకు నీవే బంధువు. ఈ ఐశ్వర్యాలన్నినీమాయచే సృష్టించబడ్డాయి.గుణములకుసమాహారమయినవాడా నీకు నమస్కారము. తామర పుప్పడివంటి వస్త్రమును ధరించిన వాడవు.

(ఇంకా వుంది)

# వ్రత సమాహారం - కార్తీక మాసం



కొత్త రామానందం

న కార్తీక సమో మాసః
న దేవః కేశవత్పరమ్
న చ వేదం సమం శాస్త్రం
న తీర్థం గంగాయాస్సమమ్

కార్తీక మాసానికి సమమైన మాసం లేదు. విష్ణుదేవునికి సమానమైన దేవుడు లేడు. వేదంతో సమానమైన శాస్త్రము లేదు. గంగతో సమాన మైన తీర్థం లేదని పై శ్లోకం తాత్పర్యం. శివకేశవులిరువురికి ప్రీతికరమైన కార్తీక మాసంలో స్నానం, దానం, దీప దానం, జపం, ఉపవాసం, వనభోజనం వంటి వాటిని చేయాలి.

కార్తీకమాసం విశిష్టత త్రిగుణాత్మకమైనది. ఆశ్వయుజ మాసం నవరాత్రి పర్వదినాలలో భగవదారాధన 'శక్తి'పరంగా ప్రధానంగా సాగుతాయి. విష్ణునామ స్మరణ సాగుతాయి. విష్ణువునకు ఆధారభూతమైనది శక్తియేనని చెప్పడం ఇందలి ఆంతర్యంగా గోచరిస్తుంది. విష్ణుమూర్తికి ఏకాదశి పరమప్రీతికరమైనది. కార్తీకంలో ఏకాదశి, శివునికి సోమవారము ప్రీతిపాత్రమైనది. సోమవారం రుద్రుని అభిషేకించి సాయంత్రం వరకు ఉపవసించి, నక్షత్ర దర్శనం చేసి భోజనం చేయడమన్నది ఒక యజ్ఞంగా భావిస్తాం. ఒకే మాసం శివ కేశవుల ఆరాధనకు గల ప్రాముఖ్యం వారికి గల అభేదాన్ని సూచిస్తుంది, అలాగనే కార్తీక మాసంలో ఏకాదశి ఎంత ముఖ్యమైనదో పూర్ణిమ కూడా అంత ముఖ్యమైనది. కృత్తికా నక్షత్రం షణ్ముఖుడికి ప్రీతి. సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రతి సంవత్సరంలో వచ్చే అన్ని మాసాలలో కెల్లా ఉత్తమోత్తమయినటువంటి ఈ కార్తీకమాసం అధిక ఫలదాయికమైనది.

జన్మజన్మాంతర పాపాలు పటాపంచలు చేసి మానవునికి దివ్యత్వాన్ని ప్రసాదించే ఈ మాసం దీపానికి ప్రసిద్ధి. పుణ్యనదీ తీరప్రాంతాలలో, 'నిర్విఘ్నం కురుమే దేవా దామోదర నమోస్తుతే' అని సంకల్పం చెప్పుకుని, ప్రవాహానికి ఎదురుగానూ, వాలుగానూ 'తులారాశి గంగ తే సూర్యే గంగా త్రైలోక్య పావనీ, సర్వత్ర ద్రవ రూపేణా సా సంపూర్ణ భవేత్తదా' అని మంత్రాన్ని జపించి త్రికరణ శుద్ధితో స్నానం చేయాలి. స్నానానంతరం మూడు దోసిళ్ళ నీరు తీరానికి చల్లి, తీరం జేరి, తర్పణం విడవాలి. సూర్య భగవానునికి అర్ఘ్యం చాలా ముఖ్యం. 'ఓం ప్రభాకరాయ నమః, ఓం దివాకరాయ నమః, ఓం భాస్కరాయ నమః, ఓం అచ్యుతాయ నమః, ఓం నమో గోవిందాయ నమః' అనే నామాలను చదువుతూ అర్ఘ్యం ఇవ్వడం ఉత్తమం.

కట్టుబట్టల కొనలను నీరు కారేలా పిండాలి. దీన్ని 'యక్ష తర్పణం' అని అంటారు. కార్తీక మాసంలోని 30 రోజులలో అన్ని నదులు, బావులు, కాలువలు ఊటబావుల్లో గంగానది అంతర్లీనంగా ప్రవహిస్తుందని భక్త జన విశ్వాసం, అందుకే ఈ మాసం స్నానికి ప్రాశస్త్యం.

ఈ విధముగా స్నానమాచరించి, తర్వాత దేవాలయంలో అశ్వత్థ వృక్షం క్రింద కానీ, ఇంటిలో తులసి మండపం వద్ద కానీ కూర్చుని ధ్యానించవలెను. శివాలయాలలో దీపం వెలిగించడం మంచిది. తులసి కోట వద్ద ఆవుపేడతో అలికి వరిపిండితో శంఖు చక్ర ఆకారాలలో ముగ్గులు పెట్టి, నువ్వుల ధాన్యం పోసి, దానిపై ప్రమిద ఉంచి, నిండా నువ్వుల నూనె పోసి వత్తి వెలిగించాలి. ఈ దీపం రాత్రింబవళ్ళు కొండెక్కకుండా వెలిగించాలి. దీనిని 'నందా దీపం' అంటారు. ఈ విధంగా చేసి, నైవేద్యం పెట్టి, కార్తీక పురాణం చదివితే శివకేశవులు సంతసించి, కైవల్యం ప్రసాదిస్తారు. పొద్దుగూకగానే దీపాలు అమర్చడం, స్తంభాన్ని పాతి రంధ్రములు కలిగిన కూడలిలో ప్రమిద పెట్టి దానిలో దీపాన్ని ఉంచుతారు. అందరూ నమస్కరిస్తారు. ముఖ్యంగా కార్తీక పున్నమి నాడు తప్పక వెలిగించవలెను. ఉసిరికాయ పైన వత్తులనుంచి దీపం వెలిగించవచ్చు. నదులలో దీపాలను వదలడంతో పాటు, దీపాలు పండితునికి దానం ఇవ్వవలెను.

సోమవారాల్లో శివుడిని పూజించి, ఉపవాస వ్రతం పాటించినవారు అనంత పుణ్యాలు పొందుతారు. ఆరోగ్యరీత్యా ఉపవాస మాచరించుట వల్ల శారీరక రుగ్మతలు తగ్గి ఉత్సాహంగా ఉండగలుగుతారు. ఈ మాసంలో వనభోజనాలు చేయాలని శాస్త్రవచనం. పలు జాతుల వృక్షాలున్న వనంలో ఉసిరిక చెట్టును పూజించి,

ఆ చెట్టు క్రింద కూర్చుని, పనస ఆకులో భుజించుట ఉత్తమం.

కార్తీకమాసంలో ఉపవాసాలు చేస్తూ పంచామృతాలతో పరమేశ్వరునికి అభిషేకం చేయడం వల్ల విశేష ఫలితం లభిస్తుంది. కార్తీక మాసంలో కమలాక్షుడైన శ్రీహరిని కమలాలతో పూజిస్తే చాలు, వారికి పునర్జన్మ ఉండదు.

ఈమాసంలో ప్రతివారూ బ్రహ్మీ ముహూర్తంలో ఎక్కువగా చలి ఉన్నా లేచి స్నానం చేస్తుంటే మనలను కాపాడేవాడు శివుడు. శివ అంటే మంగళకరుడు అని అర్థం. మన ప్రాణం మంగళకరంగా ఉండాలని, శివ శివ అంటూ స్నానం చేయాలని పెద్దలు చెప్పుచున్నారు. ఈ పవిత్రమాసంలో ఉల్లి, వెల్లుల్లి, ముల్లంగి, ఆనపకాయ, మునగకాడ, వంకాయ, గుమ్మడి, పుచ్చకాయ వెలగపండు తినకూడదు. మినుము, పెసర, కండి, ఉలవ వాడరాదు.

ది. 29-10-2019 రోజున భగినిహస్త భోజనం వేడుక పురస్కరించుకుని పురుషులు తమ సోదరి ఇంటికి వెళ్లి భోజనం చేయాలని శాస్త్రవచనం. అందువల్ల సోదరుడికి అపమృత్యువు భయం కానీ. నరకలోక కష్టాలు కానీ ఉండవంటారు.

ది. 31-10-2019 రోజున నాగులచవితి పురస్కరించుకుని నాగరాజు పుట్ట వద్దకు వెళ్లి, అచ్చట పూజ చేసి, పుట్టలో పాలు పోసి తదుపరి నైవేద్యం సమర్పిస్తారు. పుట్టమన్నును కుటుంబ సభ్యులందరూ చెవులకు, కంటి రెప్పలపైన ధరిస్తారు.

ది. 8-11-2019 నాడు ఉత్థాన ఏకాదశి పర్వదినం. దీనినే ప్రబోధన ఏకాదశి అని కూడా అంటారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి నుండి పాలకడలిలో శయనించి యోగనిద్రలో గడిపిన శ్రీ మహావిష్ణువు ఈనాడు నిద్రనుంచి మేల్కొంటారు. ఈరోజున కాయధాన్యాలతో చేసిన ఏ ఆహారాన్ని తినకూడదు. ఫలహారం మాత్రమే సేవిస్తారు. మర్నాడు పండితునికి స్వయం పాక దానం ఇవ్వాలి.

ది. 9-11-2019 నాడు క్షీరాబ్ధి ద్వాదశిన భక్తి శ్రద్ధలతో జరుపుకుంటాము. అమృతం కోసం దేవతలు దానవులు కలసి క్షీర సాగర మధనం చేసిన రోజు. ఆ రోజున ప్రతివారు తమ ఇంటిలోని తులసి కోట వద్ద శ్రీ మహావిష్ణువును తులసిని పూజించటమే కాక, వైష్ణవాలయాలలో దీపాలు వెలిగిస్తారు.

ది. 12-11-2019 న కార్తీక పూర్ణిమ లేక త్రిపుర పూర్ణిమ అని కూడా అంటారు. ఈ రోజునే త్రిపురాసుర సంహారం జరిగింది. ఉసిరికపై వత్తులను ఉంచి దీపాలను వెలిగించడం ఉత్తమం. శివాలయాలలో జరిగే జ్వాలాతోరణ ఉత్సవంలో పాల్గొనటం ఆనవాయితీగా వస్తోంది. ఈరోజున శివుడిని తామరపూలతో పూజించాలి. అలా కుదరకపోతే శివుని స్మరిస్తూ భక్తురాళ్ళు తులసి చెట్టు దగ్గర 720 వత్తులను నేతిలో ఉంచి పెద్ద దీపాన్ని జ్వలింపజేస్తారు.

మహిళలు పలువ్రతాలు ఈ నెలలో ఆచరించి తమ కోర్కెలు నెరవేర్చమని భక్తితో శివుని కోరుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వాటిలో ముఖ్యమైనవి 1) అన్నకూటవ్రతం 2) శాకసప్తమీ వ్రతం 3) క్షీరాబ్ధి వ్రతం 4) భత్తేశ్వర వ్రతం 5) కరక చతుర్థీ వ్రతం 6) పైతామహా కృచ్ఛ వ్రతం 7) దీపదాన వ్రతం మొదలైనవి.

## అద్భుతాలకు నెలవు అరుణాచలం

అత్యంత ప్రాచీన పంచభూతాత్మక లింగం అరుణాచలంలో అలరారుతున్నది. భగవాన్ రమణ మహర్షి ఉనికి వల్ల దేశవిదేశాలలో ప్రసిద్ధికెక్కిన పుణ్యక్షేత్రమయింది. ఇచ్చట అరుణగిరి తనలో అనేక అద్భుతాలు, ఆశ్చర్యాలు దాచుకున్న సాక్షాత్తు శివస్వరూపం. కార్తీక పున్నమినాడు ఇక్కడ జరిగే దీపోత్సవం ఒక ప్రత్యేక ఆకర్షణ. ఆ సందర్భంగా అరుణగిరి శిఖరాగ్ర అంచున వెలిగించే బ్రహ్మాండమైన జ్యోతిని దర్శించి ప్రతి భక్తుడు పులకించి తరించదగినది.

పరమశివుడు అరుణా-

చలేశ్వరునిగా కొలువైన పవిత్ర క్షేత్రమే తిరువన్నామలై. దానినే మనం అరుణాచలం అని పిలుస్తున్నాము. తమిళంలో తిరు అంటే శ్రీ, అన్నళ్ అంటే అగ్ని, మలై అంటే కొండ అని అర్ధం. శివపురాణంలో ఈ అరుణగిరి విశిష్టతను గురించి లిఖించబడింది. కృతయుగంలో అగ్నిపర్వతంగా, త్రేతాయుగంలో రత్నపర్వతంగా, ద్వాపరయుగంలో కంచు పర్వతంగా ఉన్న ఈ అరుణగిరి ఈ కలియుగంలో శిలాపర్వతంగా రూపొందిందని పురాణ కథనం.



తిరుచానూర్ లో జననం, కాశీలో మరణం, తిల్లయ్ (చిదంబరం) లో దర్శనం, తిరువన్నామలైలో స్మరణం, మోక్షదాయకం అని ఓ తమిళ సూక్తి. అలాగే వీలైనపుడెల్లా 'ఓం అరుణాచలేశ్వరాయ నమః' అనే మంత్రాన్ని జపిస్తే అన్ని రకాల బాధలనుండి విముక్తి పొందుతారంటారు.

ఒకసారి బ్రహ్మ విష్ణువులు తాను గొప్పంటే తాను గొప్పంటూ వివాదానికి దిగారు. అప్పుడు శివుడు జ్వాలాయుతమైన ఓ పెద్ద అగ్ని స్థంభ రూపాన్ని దాల్చి దాని తుది, మొదలను కనుగొనమని వారిరువురకు చెప్పి, ఆ పరీక్షలో నెగ్గినవారిదే విజయమని చెప్పాడు. బ్రహ్మవిష్ణువులు తమ ఘర్షణ ఆపుజేసి జ్యోతి స్థంభం వైపు ఆశ్చర్యంగా చూడసాగారు. అది ఎలా వచ్చిందో, దాని మొదలు తుది ఎక్కడున్నాయో తెలుసుకునేందుకు బ్రహ్మ హంస రూపంలో పైకి, విష్ణువు వరాహ రూపంలో కిందికి పయనించారు. ఎంతదూరం సాగినా, ఆద్యంతాలు కనిపించలేదు. తిరిగి బయలుదేరిన చోటుకు వచ్చి తమ అశక్తతను గుర్తించి తప్పు తెలుసుకుని పరమేశ్వరుణ్ణి క్షమాపణ కోరుతూ ప్రార్ధించారు. అప్పుడు జ్యోతి స్థంభం నుంచి శివుడు ప్రత్యక్షమయ్యాడు. 'నిన్ను సేవించుకునే అవకాశం మాకు ప్రసాదించు' అని శివుని బ్రహ్మావిష్ణువులు కోరారు. శివుడు వారి కోరికపై పర్వతాకారంలోనూ, లింగాకారం గానూ ఉంటానని, తన లింగాకృతిని అందరూ పూజిస్తే కొంతకాలానికి ఆ లింగాకృతి నుంచి రుద్రునిగా వెలువడి మిమ్మల్ని అనుగ్రహిస్తానని చెప్పాడు.

ధనుర్మాసంలో ఆరుద్ర నక్షత్రం నాడు జ్యోతిర్లింగమైన అరుణగిరి నుంచి స్వయంభూలింగం వెలసింది. శివుడు చెప్పిన పద్ధతిలో ఆ లింగాన్ని బ్రహ్మాదులు భక్తితో ఆరాధించారు. తర్వాత మాఘ బహుళ త్రయోదశి నాడు అర్ధరాత్రి వేళ ఆ లింగం నుంచి రుద్రుడు ఆవిర్భవించాడు. స్కాంద పురాణం ప్రకారం అరుణాచల లింగమే ప్రథమ లింగం. అరుణాచల మహాత్యంలోని రెండు శ్లోకాలు పరిశీలిస్తే, శివుడు అగ్ని స్వరూపునిగా అవతరించి, ఆయన తేజస్సును

పర్వత రూపంలో ఉన్నట్టు భక్తులను అచ్చటినుంచే సిద్ధరూపంలో అనుగ్రహిస్తున్నట్లు బోధిస్తున్నాయి.

తొమ్మిది సమున్నత గోపురాలతో, ఆరు ప్రాకారాలతో కూడిన ఆలయం సుమారు 24 ఎకరాల స్థలంలో అత్యంత గంభీరంగా దర్శనమిస్తుంది. ఆలయ ప్రాంగణం చుట్టూ ఎత్తైన గోడలతోనూ, నాలుగు గోపురాలతోనూ నిర్మించబడ్డాయి. తూర్పు వైపు గోపురాన్ని 'రాజగోపురం' అంటారు. ఇది 11 అంతస్థులతో అలరారుచూ భక్తులను చకితపరుస్తుంది. ఆలయప్రవేశం చేసిన భక్తులు భక్తితో ఐదు ప్రాకారాలు దాటి శివపరమాత్మను సందర్శించుకుంటారు. ఆలయములోని ఐదు ప్రాకారములలో అనేక మండపాలు, తీర్థాలు, ఉపాలయాలు మరియు అనేక శిల్పాలు తిలకించవచ్చును.

రెండవ ప్రాకారంలో పంచభూత లింగాలకు చెందిన ఐదు ఆలయాలు, రమణ మహర్షి ప్రధమంగా తపస్సు చేసుకున్న పాతాళ లింగ ఆలయం, ఎన్నెన్నో విగ్రహాలు తిలకించవచ్చు. అందుకే ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటే పంచభూత క్షేత్రాలన్నింటినీ దర్శించుకున్న పుణ్యఫలం లభిస్తుందంటారు.

మొదటి ప్రాకారంలో గర్భాలయంలో లింగరూపంలో కొలువైయున్న అరుణాచలేశ్వరుడు రుద్ర రూపంలో బంగారు కవచంతో దర్శనమిస్తుంటాడు. స్వామివారి చెంతనే మేరు చక్రం, శయన ప్రతిమ, యోగశక్తి అమ్మవారిని దర్శించవచ్చు. అరుణాచలేశ్వరుని దర్శనం చేసుకుని, వైకుంఠ ద్వారం నుంచి అరుణాచల పర్వతాన్ని దర్శించి మనసారా వందనం అర్పిస్తారు. భక్తులు. ఇచ్చట పార్వతీ అమ్మవారు 'అన్నామలై అమ్మ' పేరుతో కొలువుదీరి ఉన్నది.

**గిరి ప్రదక్షిణ**

తిరువన్నామలై సందర్శించే యాత్రికులు విధిగా చేయాలనుకునే వాటిలో గిరి ప్రదక్షిణ ఒకటి. రమణ మహర్షి తరచు గిరిప్రదక్షిణ చేస్తుండేవారు. సుమారు 13 కి.మీ. పొడవున్న ప్రదక్షిణ మార్గంలో వందకు పైగా దేవాలయాలు, 360 కి పైగా తీర్థాలు, 4000 శివలింగాలు ఉన్నాయి. గిరిప్రదక్షిణలో భక్తులకు ఆ దేవతలను సేవించుకున్న ఫలితం దక్కుతుంది. శివరాత్రి, ఉగాది, కార్తీక పౌర్ణమి నాడు కాలినడకన, చెప్పులు ధరించకుండా నిర్మలమైన మనస్సుతో, శివనామ స్మరణతో గిరిప్రదక్షిణ చేస్తే మహా ఫలప్రదమని, ప్రదక్షిణంలో ప్రతి అడుగుకు జన్మజన్మల పాపాలు నశిస్తాయంటారు. అలాగే సూర్య గ్రహణ సమయాన, ప్రతి పౌర్ణమి నాడు చేసే ప్రదక్షిణ మంచి ఫలితాలను ఇస్తుందని భక్తజన విశ్వాసం. సాధారణంగా గిరిప్రదక్షిణ చేయడానికి మూడుగంటల సమయం పడుతుంది.

**కార్తీక దీపోత్సవం**

కార్తీక పౌర్ణమి నాడు జరిగే దీపోత్సవం అరుణాచలేశ్వర ఆలయంలో ఒక ప్రత్యేకతగా కొనసాగుతున్నది. ఆ రోజున అరుణాచల కొండమీద సాయంత్రం 6 గం||లకు పెద్ద అగ్నిగుండాన్ని వెలిగిస్తారు. పది అడుగుల ఎత్తు, అయిదు అడుగుల చుట్టుకొలతలు గల లోహపుపాత్రను కొండపైకి చేర్చి, అందులో వెయ్యి కిలోల నెయ్యి పోసి, అతి పెద్ద వస్త్రాన్ని దీపపు వత్తిగా వినియోగించి, మంత్రోచ్చారణతో వెలిగిస్తారు. బ్రహ్మాండమైన రీతిలో వెలుగులు విరజిమ్ముతూ ఆ జ్యోతి తిరువన్నామలై చుట్టుపక్కల 50 కి.మీ. పరిధిలో వెలుగులు, మూడురోజులపాటు నిరంతరాయంగా కానవస్తుంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా జరిగే ఈ దీపదర్శనం నయనానందకరంగా ఉంటుంది. ఆ అద్భుతాన్ని తిలకించటానికి లక్షలాది భక్తులు ప్రతి ఏటా ఈ క్షేత్రానికి వస్తారు. దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు జరుపుతారు. ఈ క్షేత్ర దర్శకులందరూ ఇచ్చటి శ్రీ రమణ మహర్షి ఆశ్రమాన్ని దర్శించుకుంటారు.

**ఓంశ్రీ అరుణాచలేశ్వరాయ నమః**

# నేను 'గేటెడ్'- నువ్వు 'LIG'



(గత సంచిక తరువాయి)

## భువనచంద్ర

వివాహ మండపం 'సెట్' ఐ అయిదు కోట్లు ఖర్చయిందిట. ఇక భోజనాల్లో వడ్డించిన స్వీట్లు, హాట్లు, ఫ్రూట్లు+ మిగతావి (కూరలూ నారలూ) మొత్తం 180 రకాలుట. వధూవరుల్ని ఆశీర్వదించడానికి ఆర్డినరీ, వి ఐ పీ, వి వి ఐ పీ, ఎగ్జిక్యూటివ్, ఎక్స్ట్రా వి వి వి ఐ పీ వంటి అయిదు లైన్స్ ఏర్పాటు చేశారట. ఇక డైనింగ్ హాల్(?) అందమే అందం. మొత్తం ఖర్చు 60 కోట్లు దాటిందనే విషయం ఊరంతా పాకింది. అదో మూన్నెళ్ళు రాజ్యం చేసింది. ఆ తరవాత మరో రాజకీయనాయకుడి మనవరాలి పెళ్ళీ, ఓ పత్రికాధిపతి మనవడి పెళ్ళీ వరసగా సామాన్యుడి బుర్ర ఆక్రమించి విభ్రమానికి గురిచేశాయి.

మొత్తానికి అంతా సద్దుమణిగింది అనుకున్న సమయంలో HIG లోని సామాన్య కొడుకు, ఆఫ్ట్రాల్ LIG లోని ఓ అమ్మాయిని ప్రేమించి వైరల్ న్యూస్ సెంటర్ గా మారాడు.

HIG వాళ్ళంతా సామాన్యనీ, సామాన్య భర్తనీ పిల్లల్నీ కూచోపెట్టి క్లాస్ పీకారు. ఈ వివాహాన్ని ఆమోదిస్తే, ఆ సమస్య ఇక్కడితో ఆగదనీ, HIG పిల్లలు చెడిపోయి LIG వాళ్లనో లేక ఇంకా లో క్లాస్ వాళ్లనో ప్రేమిస్తారనీ, తద్వారా HIG గౌరవం మట్టిలో కలిసిపోతుందనీ, మూడు దివారాత్రాలు వాదించి, పెళ్లి ఆపేందుకు ప్రయత్నించారు. సామాన్య కొడుకు 'ససేమిరా' అన్నాడు. ఓ రోజు ఎవ్వరికీ చెప్పకుండా, గుళ్ళో పెళ్లి చేసుకొచ్చాడు. LIG వాళ్ళ ఆనందానికి హద్దులేదు. లోకాన్ని జయించేసినంతగా సంబరపడ్డారు. "ఓ మెట్టు ఎక్కి వాళ్ళు మనని పది మెట్లు దించారు" అన్నాడు సామాన్య గారి భర్త అరుణాచలం.

కొత్త కోడలు కొత్తలో చాలా నెమ్మదిగానూ మంచిదిగానూ వున్నది. ఆరు నెల్లయ్యేసరికి ఆవిడ HIG వాళ్ళకే HIG గా తయారయింది.

సామాన్య, సామాన్య కోడలు స్వతంత్ర మధ్య జరిగే ప్రత్యక్ష పరోక్ష యుద్ధాలు హాట్ టాపిక్ అయ్యాయి.

మరో రెండు నెలల్లో మరో బ్రహ్మాండమైన న్యూస్ 'గంగానగర్' ని ఊపేసింది. గేటెడ్ కమ్యూనిటీ లోని వర్ధమాన క్రికెటర్, 'లో మిడిల్' క్లాస్ అమ్మాయిని ప్రేమించి పెళ్ళాడాడని. ఆ వ్యవహారం కత్తులూ కటార్ల దాకా వెళ్ళినా, రక్తపాతం జరక్కుండానే సద్దుమణిగింది. గేటెడ్ ఆయనకీ ఒక్కడే కొడుకాయే, కాంప్రమైజ్ కాక ఏం చేస్తాడూ!

గవర్నమెంటు జనాభా లెక్కలకి ఉద్యోగుల్ని నియమిస్తుంది. కొద్దో గొప్పో డబ్బు కూడా ముట్టచెపుతుంది.

సిటీల్లో, ముఖ్యంగా మా చెన్నైలో ఏరియాకి ఒక నేపాలీవాడు 'నైట్ వాచ్ మేన్' పని చేస్తూవుంటాడు. ఇంటికి, నెలకి 50 చొప్పున వసూలు చేస్తాడు. అలాగే 'ఎక్స్ నోరా' వాళ్ళు కూడా నెలకీ ఇంటికీ 100 తీసుకుని చెత్తని కలెక్ట్ చేసి, 'యార్డ్' లో పడేస్తుంటారు. వీళ్ళు కాక, మరో గ్రూప్ జనియించారు. వీళ్ళు ఒక్క పైసా కూడా తీసుకోకుండా రూమర్లని విరివిగా పంపిణీ చేస్తుంటారు. అలాగే ఏ చిన్న సందు దొరికినా విభేదాల్ని ఎగదోస్తుంటారు.

ఈ ఫ్రీ గ్రూప్ చలవతో, LIG కీ HIG కీ, HIGకీ గేటెడ్ వాళ్ళకీ, గేటెడ్ కీ మిడిల్ క్లాస్ వాళ్ళకీ మధ్య యుద్ధాలు దినదిన ప్రవర్ధ-

మానమయ్యాయి.

ఏరియా మొత్తం రోజుకో సరికొత్త విశేషంతో ఉద్రూతలూగిపోతోంది.

సంవత్సరం గడిచేలోగా నిక్కీ లక్కీ విడిపోయారు. కారణం నిక్కీ, లక్కీతో గొడవపడి మరో 'మున్నాభాయ్' తో క్లోజ్ గా వుండటం. దాంతో లక్కీ, లైసెన్స్ లేని తుపాకీతో నిక్కీ వెంటపడటం, కాల్పులు జరక్కముందే నలుగురూ పట్టుకుని సామరస్యంగానే వివాహ విచ్ఛిన్నం కావించి విడాకులిప్పించారు.

ఇక అత్తాకోడళ్ళ పోరాటం ఉధృతమై, సామాన్య కొడుకూ కోడలూ విడికాపురం పెట్టారు. వారు విడికాపురం పెట్టింది ఊరి బయట వున్న 'విల్లా'లో గనక 'గ్రూప్' గొడవలు లేవు.

వర్ధమాన క్రికెటర్ విదేశాల్లోనే ఎక్కువ గడుపుతూ వుండటం వలన, అత్తమామలు చూపిన ఆదరానికి బెదిరిపోయిన లోయర్ మిడిల్ క్లాస్ అమ్మాయి గోళ్ళు కొరుక్కుంటూ పుట్టింట్లోనే ఉంది. వర్ధమానుడు వచ్చినా గేటెడ్ కమ్యూనిటీలోకి మళ్ళీ తనని తీసుకువెడతాడనే నమ్మకం ఆ పిల్లకి లేదు. కారణం, ఆ వర్ధమానుడికి క్రికెట్ కూడా ఓ మోస్తరుగా ఆడటం తప్ప 'కానీ' సంపాయించడం తెలీదు.

ఎంతో కొంతకాంపెన్సేషన్' దక్కుతుందని ఆ పిల్ల తల్లితండ్రులు మాత్రం మహాధీమాగా వున్నారు. వారి కోరిక నెరవేరుతుందా లేదా అని 'ఫ్రీ' గ్రూప్ వాళ్ళు మహోత్సాహంగా ఎదురుచూస్తున్నారనేది నిర్వివాదాంశం.

"ఏమిట్రా ఏదో శ్రీబోధలూ, చిన్న కథలూ రాసేవాడు తలాతోకా లేని ఈ చెత్త కథని ఎందుకు రాశాడూ?" అని మీరు అంతరంగంలోనూ, ప్రకాశంగానూ కూడా తిట్టుకోవచ్చు, నేనేమీ అనుకోను. మిత్రులారా... పొరపాటున కూడా అనుకోను.

పూర్వకాలంలో సినిమాల్లో విరివిగా పనికివచ్చిన జబ్బు T.B. ఆ తరవాత అంతగానూ పనికొచ్చిన జబ్బు హార్ట్ ఎటాక్. ఆ తర్వాత ఏ పాత్రని అర్థంతరంగా 'తీసెయ్యాలన్నా' ప్రస్తుతం A-1 గా పనికొస్తున్న జబ్బు కేన్సర్.

అలాగే సమాజంలో కూడా, కుల, మత, రాజకీయ, అరాచకీయ, వర్ణ, వర్గ రోగాలతో పాటు సరికొత్తగా వచ్చిన రోగం పేరు 'గేటెడ్' రోగం, 'LIG, MIG' గ్రూప్ రోగం.

ఈ రోగం సరికొత్తది కాక పోయినా రోజురోజుకీ, క్షణక్షణానికీ ప్రవర్ధమానమవుతున్న రోగం. మా 'విస్సి' మావయ్య అన్నట్టు లోకంలోని జీవులన్నీ కూడా 'గేటెడ్' జీవులే.

తల్లి నుంచి 'ప్రసూతి' అనే గేటు ద్వారా లోకంలోకి వస్తాయి. మృత్యువు అనే 'మహా గేటు' లోనించి లోకం నుంచి నిష్క్రమిస్తాయి. మధ్యలో ఈ గ్రూపుల కురుక్షేత్రమేలా?

ఏ గ్రూపులో అలరారుతున్నా, మనుషులకి ఉండాల్సింది కాస్త బుద్ధీ, జ్ఞానమూ. అది వుంటే చాలు, మనిషిని మనిషిగా గుర్తించడానికీ, మనుషుల్లా మసలడానికీ!

మళ్ళీ కలుద్దాం,
నమస్సులతో,
భువనచంద్ర

# కలియుగ నరకాసుర

- వెంకటేష్ కె

నీ లోని అసురిడిని నరకరా సత్య -
భామ నీకై దిగి రాధ!
నీ లోని మంచిని పెంచరా ఆనందం
ఎగరదా తారాజువ్వలా!

తూర్పున సూర్యుడిని వదిలి దండం
నీవు చెడుకు సెలవు ఇవ్వరా!
ఉత్తరాన ఉత్తరము లేకున్నా పక్షము
రోజులు సెలవివ్వరా!
దక్షిణాన దక్షిణలతో పూజలెన్నో
అందుకునే లక్ష్మి రూపమివ్వరా!
పశ్చిమానా పడమర దిక్కు వాలిపోదా
మంచికి రూపం అవ్వరా!

నీ లోని అసురిడిని నరకరా సత్య -
భామ నీకై దిగి రాధ!
నీ లోని మంచిని పెంచరా ఆనందం
ఎగరదా తారాజువ్వలా!

అంధకారము పారద్రోలే జ్ఞాన
జ్యోతివై వెలుగురా!
మంచిని నడిపే ఉద్యమంలో
సమిధవై వెలుగురా!
నీవు నిత్య జ్ఞానాగ్ని హోత్రమై
వెలుగురా!
వంట ఇంటిలో హోత్రమే
అన్నపూర్ణవై నిత్యము వెలుగురా!

నీ లోని అసురిడిని నరకరా సత్య -
భామ నీకై దిగి రాధ!
నీ లోని మంచిని పెంచరా ఆనందం
ఎగరదా తారాజువ్వలా!


# మూడవ రాష్ట్రపతి డా. జాకీర్ హుస్సేన్



## పాలెపు బుచ్చిరాజు

అన్నం పెట్టకపోవడం అన్యాయమే అని వారి తరపున వాదించాడు జాకీర్. ఆయన ఇలా ఒక ఉపన్యాసం ఇచ్చాడు.. "సమాజు చదవడం తప్పని సరి అన్న విషయాన్ని నేను సమర్థిస్తాను. కాని, చదవకపోతే అభోజనం పెట్టడం అన్యాయం. ఎందుకంటే, దానికయ్యే ఖర్చుల నిమిత్తం సరిపడా డబ్బు వారు ముందుగానే చెల్లించారు కనుక. అధికారులు దీనిపై పునరాలోచించడం మంచిది. మేము అన్యాయాన్ని సహించము". ఇది ఆయన జీవితంలో చేసిన మొట్టమొదటి ఉపన్యాసం. అలా విద్యార్థి దశలోనే న్యాయం పక్షాన వాదించడం, అన్యాయాన్ని ఎదిరించడం అలవాటయింది జాకీర్ కి. ఇంతకీ ఆ సంఘటన హాస్టలు అమలు చేసే శిక్షాస్మృతినే మార్చేసింది. అధికారులు ఆ నియమాన్ని తొలగించారు. ఆ తరవాత, ఇటు విద్యార్థులకి, అటు అధ్యాపకులకి మధ్య వారధి అయ్యాడు జాకీర్. చదువులో కూడా చురుకుగా ఉండేవాడు కనుక ఆయన్నే హాస్టలుకి మానిటర్ గా నియమించారు అధికారులు.

ఆ రోజుల్లో మొదటి ప్రపంచ యుద్ధంలో భాగంగా, టర్కీ- ఇటలీల మధ్య యుద్ధం ఆరంభం అయింది. టర్కీలో ముస్లిములు ఇక్కట్లలో ఉన్నారు. జాకీర్ హుస్సేన్ టర్కీ టోపీ పెట్టుకునేవాడు. ఆయనకి ఒక ఉపాయం




తట్టింది. తనతో మరికొందరు విద్యార్థుల్ని వెంట బెట్టుకుని, యుద్ధబాధితులకోసం చందాలు వసులు చేయడానికి సమకట్టాడు. నలుగురూ, చేరగానే, "టర్కీలో మన ముస్లిం సోదరులు కష్టాల్లో ఉన్నారు. భారత దేశంలో ఉన్న మనం వారికి సహాయ పడడం ధర్మం." అంటూ అందరూ ప్రభావితులయ్యేలా ఒక ఉపన్యాసం ఇచ్చేవాడు. అది విన్నవారు మనసులు కరిగి, పర్సులు తెరిచి, తోచినంత దానం చేసేవారు.

ఒకనాడు, సెలవుల్లో ఇంటికి వెళ్ళినపుడు కాయమ్ గంజ్ లో ఒక చిత్రమైన సంఘటన జరిగింది. అలవాటు ప్రకారం, టర్కీలో ముస్లిములు పడే బాధల్ని వర్ణిస్తూ, వారిని ఆదుకోవడం చాలా ముఖ్యమని చెప్తుతూ, దానం చేయమని ప్రజల్ని కోరుతూ వీధిలో తిరుగుతున్నాడు. జాకీర్ హుస్సేన్. నెత్తి మీద ఉన్న

టోపిని తిరగేసి పట్టుకుని దానిలో డబ్బులు వేయమని అడుగుతున్నాడు. "మీరిచ్చిన ఈ రాగి నాణాలే తుపాకి తూటాలై శత్రువుల్ని చీల్చి చెండాడుతాయి." అని వచ్చిన వారికి చెప్పుతున్నా డు. ఒక వయసు మళ్ళినాయన జాకీర్ ఉపన్యాసం విని ఎంతగా ప్రభావితుడయ్యాడంటే, కళ్ళ లో నీరు కారుతూ ఉండగా ముందుకు వచ్చి, జేబులో ఉన్న పర్సు తీసి, అందులో ఎంత ఉందో అని కూడా చూడకుండా పర్సులో వేసేశాడు. జాకీర్ ఆయన వైపే చూస్తూ ఉండిపోయాడు. అంతేకాదు, జాకీర్ ధైర్య సాహసాలకి, దయాగుణానికి ముగ్ధుడైన ఆయన తన మనుమరాలిని జాకీర్ కి ఇచ్చి వివాహం చేయడానికి అక్కడికక్కడే నిశ్చయించుకున్నాడు. ఆమె పేరు షాజహాన్ బేగం. కాని ముద్దుగా 'పుతలీ' అని పిలిచేవారు.

ఆ తరవాత కొన్నాళ్ళకి ఉపాధ్యాయుల్లో ఒకాయన, జాకీర్ పట్టుదల, సహన శీలత ఎలా ఉంటాయో పరీక్షించడానికి పూనుకున్నాడు. మరికొందరు విద్యార్థులతో కలిసి తన ఇంటికి విందుకు ఆహ్వానించాడు. వారు భోజనానికి కూర్చోగానే ఉప్పూ కారం లేని చప్పిడి పదార్థాలతో అన్నం పెట్టాడు. కావాలనే కూరల్లోను, పప్పులోనూ నీళ్ళు కలిపించాడు. విద్యార్థులంతా, ఇంత రుచీపచీలేని



భోజనం ఎప్పుడూ చేయలేదని తిట్టుకుంటూ సగంలో లేచిపోయి చేతులు కడుక్కున్నారు. కావాలనే ఇంటికి పిలిచి ఆయన ఇలా అవమాన పరిచాడని విసుక్కున్నారు. కాని జాకీర్ హుస్సేన్ మాత్రం ఏమీ జరగనట్టుగానే మాములుగా భోజనం చేయసాగాడు. ఇదంతా తెర చాటున ఉండి గమనిస్తున్న ఉపాధ్యాయు డు ముందుకు వచ్చి, జాకీర్ హుస్సేన్ తల నిమురుతూ ఆశీర్వదించి, ఇలా అన్నాడు. " నేను కావాలనే ఇలా చేశాను. మీలో ఉన్న సహన శక్తిని పరీక్షించడానికి నేను చేసిన ప్రయోగం. దీనిలో నువ్వు ఉత్తీర్ణుడవయ్యావు. నాకు చాలా సంతోషంగా ఉంది. అత్యావసర సమయంలో స్వలాభాపేక్ష లేకుండా ఎంతటి త్యాగమైనా నువ్వు చేయగలవనడానికి ఇది ఒక నిదర్శనం. నువ్వు భవిష్యత్తులో చాలా గొప్పవాడివి అవుతావు".

ఇటావాలో హైస్కూలు పూర్తయ్యాక జాకీర్ హుస్సేన్ అలిగడ్ లో ఎల్.ఏ. ఓ. కాలేజి లో ఇంటర్ లో జాయిను అయ్యాడు. సైన్సు పాఠ్యాంశంగా తీసుకుని మంచి మార్కులతో పాసయ్యాడు. మెడిసిన్ చదవాలనే కోరికతో లక్నో క్రిష్టియన్ కాలేజిలో అడ్మిషన్ తీసుకున్నాడు. కాని దైవేచ్ఛ మరొకలా ఉంది. జీవితంలో ఆయనకి వైద్యవృత్తి చేసే యోగం లేదేమో! జాయినయిన వెంటనే జబ్బు పడ్డాడు. ఆ జబ్బు ఒకంతట వదిలి పెట్టలేదు. ఆఖరికి డాక్టరు కావాలనే కోరిక విరమించుకోవలసి వచ్చింది. తిరిగి అలిగడ్ వచ్చి, కాలేజిలో ఇంగ్లీషు, అర్థశాస్త్రం, వేదాంతం పాఠ్యాంశాలుగా డిగ్రీలో జాయినయ్యాడు. డిగ్రి లో ఫస్ట్ క్లాస్ లో పాసయి, ఎం. ఏ. అర్థశాస్త్రం, ఎల్. ఎల్. బి. ఒకేసారి చదవసాగాడు. బి.ఏ. లో మంచి మార్కులు రావడం వల్ల ఆయనకి 'ఇక్బాల్ పతకం' (మెడల్) కూడా లభించింది.

జాకీర్ హిస్సేన్ కి రచనలు చేయడంలోనూ, ఉపన్యాసాలు ఇవ్వడంలోనూ చినప్పటి నుంచి ప్రవేశం ఉంది. యూనివర్సిటీలో కూడా వక్తృత్వపోటీల్లో పాల్గొని బహుమతులు పొందాడంతో ఆయన ప్రతిభ మరింత రాణించింది.

ఆయన హైస్కూల్లో చదివే రోజుల్లో ఒకసారి పరీక్షలు రాయ

డానికి ఆగ్రా వెళ్ళాడు. అప్పుడు వారి స్వగ్రామం అయిన కాయమ్ గంజ్ లో ప్లేగు వ్యాధి వ్యాపించి ఉంది. తల్లి జబ్బు పడింది. ఆమెకు తన పిల్లల్ని పిలిపించి ఒకసారి చూడాలనే కోరిక కలిగింది. కాని వారి చదువు పాడవుతుందని, ఇక్కడికి వస్తే వారికి కూడా వ్యాధి సోకే ప్రమాదం ఉందని భయపడి ఆ ప్రయత్నం మానుకుంది. తన కోరికని మొక్కలోనే త్రుంచి వేసింది. తండ్రి లేకపోయినా మమతా మమకారాలతో వారిని పెంచి పెద్ద చేసింది. వారు అభివృద్ధిలోకి రావడమే ఆమె ధ్యేయం. అందువల్ల తాను జబ్బు పడినట్టు కూడా వారికి తెలియజేయడానికి సాహసించలేదు. ఆఖరికి వారెవరూ లేకుండానే ఆమె తుది శ్వాస విడిచింది. జాకీర్ హుస్సేన్ ఆగ్రా నుంచి తిరిగి వస్తూ ఉండగా మధ్యదారిలో తన ఊరిలో ప్లేగు గురించి తెలిసింది. ఆయన సరాసరి కాయమ్ గంజ్ కి చేరుకున్నాడు. కాని అప్పటికే ఆలస్యం అయిపోయింది. తల్లి తమ్ముడు కూడా వ్యాధికి బలైపో యారు. ఆ విషయాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన తన పుస్తకంలో ఇలా రాసుకున్నాడు. "నేను ఆగ్రా పరీక్షలకి వెళ్ళినప్పుడు, కాయమ్ గంజ్ లో ప్లేగు వచ్చింది. మా కుటుంబంలోని స్త్రీలు పిల్లలు అంత మృత్యువాత పడ్డారు. పెద్దవాళ్ళెవరూ మిగలలేదు. నేనుస్తేశాను చేరుకున్నపుడు, నన్ను చూడడానికి ఎవరూ రాలేదు. వాహనం కూడా లేదు. కాలినడకనే చేరుకున్నాను. అక్కడ ఇంటికి తాళం వేసి ఉండడం చూసి నివ్వెర పోయాను. మా అమ్మని తల్చుకుని చాలా బాధపడ్డాను. ఆమె ఎప్పుడూ చెప్తుతూ ఉండేది. 'మీ పనులు మీరే చేసుకోవడం నేర్చుకోండి. బాగా చదువుకుని మన వంశానికిపేరు ప్రతిష్టలు తీసుకురండి' అని. అది నేనెప్పటికీ మరిచిపోలేను."

తల్లి మరణం జాకీర్ మనసులో పెద్ద గాయం చేసింది. మిగిలిన అన్నదమ్ములు కుడా కాయమ్ గంజ్ వచారు. అంతటి అసహాయ స్థితిలో కూడా వారంతా ధైర్యంగా ఉండి బాగా చదువుకుని వంశ మర్యాద కాపాడాలని నిశ్చయించుకున్నారు. ఇటావా తిరిగి వచ్చిన తరవాత కూడా జాకీర్ తల్లిని మరిచిపోలేకపోయాడు. ఆయనకు ఆమె గుర్తుకి వచ్చినప్పుడల్లా ఏడుపు వచ్చేది. అన్నదమ్ములు సాంత్వన పలికేవారు.


జాకీర్ 1920 వ సంవత్సరంలో ఎం. ఏ. పాసయ్యాక అదే కాలేజిలో ఉపన్యాసకుడుగా జాయిను అయ్యాడు. కాని అదే సమయంలో న్యాయశాస్త్ర విభాగంలో విద్యార్థిగా కూడా ఉండేవాడు. ఒకే మనిషి ఒకే కాలేజిలో ఉపాధ్యాయుడిగాను, విద్యార్థిగాను కూడా ఉండడం చిత్రమైన పరిస్థితి. ఈ పనులు సక్రమంగా నిర్వహిస్తూనే ఆయన తన రచనా వ్యాసంగాన్ని, భాషణా చతురతని వదిలి పెట్టలేదు.

వివిధ పత్రికల్లో ఆయన వ్యాసాలూ ముద్రితం అయ్యేవి. బహుముఖ ప్రజ్ఞాశాలి అని అందరూ పొగిడేవారు.

అప్పట్లో భారత దేశాన్ని ఆంగ్లేయులు పరిపాలిస్తున్నారు. మొదటి ప్రపంచ యుద్ధంలో వారిది పై చేయి అవడంతో, ఇంకా రెచ్చిపోయి నియమాలు, నిబంధనలు కఠినతరం చేశారు. గాంధిజీ దక్షిణాఫ్రికా నుంచి తిరిగి వచ్చి, సహాయనిరాకరణోద్యమం ప్రారంభించాడు. టర్కీలో ముస్లిముల్ని ఆంగ్లేయులు బాధపెడుతున్నందుకు నిరసనగా ముస్లిములు కూడా ఉద్యమాలు ప్రారంభించారు. గాంధిజీ విద్యార్థుల్ని ఉత్తేజితుల్ని చేసి, ఉద్యమాలపై వారి దృష్టిని మళ్ళిస్తున్నాడు. ఆ సమయంలో జాకీర్ హుస్సేన్ అలిగడ్ విశ్వవిద్యాలయపు విద్యార్థి సంఘానికి ఉపాధ్యక్షుడిగా ఉన్నాడు. గాంధిజీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, వంటి ప్రముఖుల పిలుపు విని ముస్లిం యువకులు వేల సంఖ్యలో చదువులు వదిలి పెట్టి, ఉద్యమాల్లో చేరసాగారు. జాకీర్ హుస్సేన్ కూడా ఉద్యోగం వది-

లిపెట్టి తన అనుచరులతో సహా స్వాతంత్ర్య సమరంలో దూకాడు. అప్పుడు యూనివర్సిటీ కులపతిగా ఉన్న జియా ఉద్దీన్ అనే ఆయన జాకీర్ ని పిలిపించి, ఉద్యోగం మానవద్దని ఎంతో నచ్చజెప్ప జూశాడు. డిప్యూటి కలక్టరుగా బ్రిటిష్ ప్రభుత్వంలో ఉద్యోగం వేయిస్తానని కూడా ఆశ చూపెట్టాడు. కాని జాకీర్ ఆయన మాటల్ని పట్టించుకోలేదు. "నాకు, నా దేశం, నా జాతి మనుగడ ముఖ్యం. ఇందులో నా స్వార్థ చింతనకి తావు లేదు దేశం తోటే నేను ప్రయాణిస్తాను. " అని కరాఖండిగా చెప్పాడు.

అలిగడ్ లో ఎం.ఏ. ఓ. కాలేజి ముస్లిం విద్యార్థులకోసం ఉద్దేశించ బడింది. కొందరు పెద్దల ప్రయత్నం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం స్థాపించింది. కాని దాని పరిపాలన అంతా ఆంగ్లేయుల చేతిలోనే ఉండేది. జాకీర్ కి ఈ పద్ధతి నచ్చలేదు. ముస్లిముల కోసం స్థాపించిన కాలేజి పూర్తిగా వారి ఆధీనంలోనే ఉండాలని ఉద్యమం లేవదీశాడు. ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదు. పెద్దలంతా కలిసి తామే తమకోసం ఒక యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి సంకల్పించారు. జాకీర్ హుస్సేన్, ఆయన సహచరులు ఈ అందోళనలో క్రియాశీల పాత్ర వహించారు. ఆ కారణంగా 'జామితా మిలియా ఇస్లామియా' కి 1920లో అంకురార్పణ



జరిగిం ది. ప్రభుత్వం దానిని గుర్తించలే దు. ఇదికూడా ప్రభుత్వ వ్యతిరేక అందోళననలో ఒక భాగం అయింది. జాకీర్ హుస్సేన్ సహా య నిరాకరణోద్యమంలో భాగస్వామి అయ్యాడు. తన జీవితాన్ని దేశ సేవకే అంకితం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఇది తన జీవితంలో అతి ముఖ్యమైన నిర్ణయం అని ఉపన్యాసాలలో చెప్పుకున్నాడు.

ఇలా ఉండగా, ఆయన పి. హెచ్. డి. చేయడానికి 1922లో జర్మనీ వెళ్ళాడు. అక్కడ పని చేస్తూనే, అక్కడి రాజకీయాల్లో కూడా శ్రద్ధ వహించ సాగాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయినా జర్మనీ ఇప్పుడు పతనమై ఉంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. జాకీర్ హుస్సేన్ అక్కడి వారికి గాంధిజీ సహాయనిరాకరణోద్యమం గురించి వివరించడం వల్ల వారికి గాంధిజీ అంటే గౌరవ భావం ఏర్పడింది. జర్మను భాషలో గాంధిజీ గురించి ఒక పుస్తకం కూడా రాశాడు. దానితో ఆయన జర్మను ప్రజలకి సన్నిహితుడయ్యాడు.

ఇక్కడ 1924 వ సంవత్సరానిని కల్లా దేశంలో ఉద్యమాలు కొంత సన్నగిల్లాయి. దానితో జామియా మిలియా ఇస్లామియా కి చందాలు కరువయ్యాయి. ఆర్థిక వనరులు లేకుండా దానిని నడపడం కష్టమని తోచి కులపతి మూసేయడం మంచిదని జాకీర్ హుస్సేన్ పేర్న ఒక ఉత్తరం రాసి పంపాడు. అంత కష్టపడి సాధించిన దానిని తేలిగ్గా వదులుకోవడం జాకీర్ కి నచ్చలేదు. తనుతిరిగి వచ్చేవరకు ఎలాగో ఓపిక పట్టమని, వచ్చిన వంటనే తాను పగ్గాలు చేపట్టుతానని జవాబు రాశాడు. ఆఖరికి జాకీర్ హుస్సేన్ 1926లో డాక్టరేటు పూర్తీ చేసి ఇండియాకి తిరిగి వచ్చి జామియా మిలియా బాధ్యతలు తన తలపై తీసుకున్నాడు. అప్పటికే దానిని సౌలభ్యం కోసమని అలిగడ్ నుంచి ఢిల్లీ కి మార్చారు. అంతటి అసాధారణ ప్రతిభావంతుడు, కవి, పత్రకారుడు, విద్వాంసుడు, ఆదర్శ ఉపాధ్యాయుడు, రాజకీయ దురంధరుడు కనుకనే ఆయన జీవితంలో ఎన్నో విజయాల్ని సాధించాడు. జామియా మిలియా కులపతిగా, స్వదేశీ ఉద్యమంలో గాంధీవాదిగా, బీహారు రాష్ట్ర గవర్నరుగా, ఉపరాష్ట్రపతిగా, ఆఖరికి మనదేశపు రాష్ట్రపతిగా విరాజిల్లాడు. కష్టపడువారిని భగవంతుడు ఆదరించును అన్నదానికి ఆయన జీవితం ఒక ఉదాహరణ.

# వేమూరి వేంకటేశ్వరరావు



## అంకెలు, సంఖ్యలు: అయిదు

పంచ చేరువాడు పరగ వేమ. ఆకుపచ్చ, ఎరుపు, తెలుపు, నలుపు, పసుపు రంగులని పంచరంగులు అంటారు కాని ఆధునిక శాస్త్రం ప్రకారం తెలుపు, నలుపులని విడివిడిగా రంగులలో లెక్కపెట్ట కూడదు. అంతే కాదు. “తెలుపు”, “నలుపు” అన్న మాటల రెండింటి మధ్య వ్యత్యాసం వాటి ద్యుతిలో ఉన్న తేడా మాత్రమే. అన్ని రంగులు కలిసినప్పుడే తెలుపు వస్తుందని చిన్నప్పుడు సైన్స్‌లో చదువుకున్నాం. నలుపు కూడ అంతే అన్ని రంగుల కలయికే. తెలుపు వస్తువులు తెల్లగా ఉండడానికి కారణం వాటి మీద పడ్డ కాంతి అంతా పరావర్తనం చెంది మన కంటికి చేరుకోవడమే. నల్ల వస్తువుల మీద పడ్డ కాంతి అస్సలు పరావర్తనం చెందదు. అటువంటి వస్తువుని సైన్సులో “బ్లేక్ బోడీ” అంటారు.

పంచకళ్యాణి గుర్రం అంటే అయిదు రంగుల గుర్రం కానే కాదు. ఏ రంగు గుర్రమైనా సరే శరీరమంతా ఒకే రంగు ఉండి ఒక్క నుదుటి మీద, కాళ్ళ దగ్గర తెల్లగా ఉంటే అది పంచకళ్యాణి. గుర్రం రంగే తెలుపైనప్పుడు ముఖం మీద మచ్చ మరో రంగులో ఉంటుంది.

పంచాస్యం, పంచాననం అంటే పెద్ద ముఖం ఉన్న జంతువు -




సింహం. ఇక్కడ “పంచ” అంటే పెద్ద అనే అర్థంలో వాడబడింది. పంచనఖం అంటే అయిదు గోళ్ళు ఉన్న జంతువు - పెద్దపులి. ఈ సందర్భంలోనే ”పంజా” అన్న మాట పుట్టి ఉంటుంది. హైదరాబాదులో ఉన్న ”పంజాగుట్ట” అంటే ఐదు కొండలనే అర్థం స్ఫురిస్తోంది.

పంచతంత్రం అనగానే మిత్రలాభం, మిత్రభేదం గుర్తుకొస్తాయి. కొంచెం చదువుకున్న ఘటానికి సంధివిగ్రహం జ్ఞాపకం వస్తుంది. మిగిలిన రెండింటి పేర్లు చెప్పుకోండి చూద్దాం!

న మ శి వా య అన్న అయిదు అక్షరాలే పంచాక్షరి మంత్రం! శివుడికి పంచాననుడు (అనగా, ఐదు ముఖములు కలవాడు) అన్న పేరు ఉందని ఎంతమందికి తెలుసు? ఎలిఫెంటా గుహలలో ఉన్న శివుడు పంచాననుడే కాని మనకు నాలుగు ముఖాలే కనిపిస్తాయి. అయిదవది లోకోత్తరం [లేదా “ట్రాన్‌సెండెంటల్”]. వీటి పేర్లు అఘోరం, ఈశానం, తత్పురుషం, వామదేవం, సద్యోజాతం.

వైష్ణవుడు కావడానికి పంచ సంస్కారాలు చేయాలి. తప్త చక్రాంకనం (అంటే, చక్రంతో వాత పెట్టడం?), నొసట ఊర్ధ్వ పుండ్రం, పేరు మార్పు, మంత్రజపం, యజనం [అంటే, దేవపూజ].

తంత్రవిద్యకి పంచ మకారాలు

(అనగా, మద్యం, మత్స్యం, మాంసం, ముద్ర, మైథునం) ముఖ్యం అంటారు.
దేవ యజ్ఞము(హోమము), బ్రహ్మ యజ్ఞము (వేదాధ్యయనము), భూత యజ్ఞము (కాకబలి), పితృయజ్ఞము(పిండ తర్పణ క్రియ) క్రియ), మనుష్య యజ్ఞము(అతిథి పూజ) అనేవి ఐదు ప్రతి గృహస్తూ నిత్యం చెయ్యవలసిన పంచ మహాయజ్ఞములుగా పేర్కొన్నారు.
పంచబాణుడు మన్మథుడు. ఈయనకి అయిదు రకాల పువ్వుల బాణాలు ఉన్నాయి: అరవిందము [తామర], అశోకము, చూతము [మామిడి], నవమల్లిక, నీలోత్పలం [నల్లకలువ].
శ్లో. అరవిందమశోకం చ చూతం చ నవమల్లికా |
నీలోత్పలం చ పంచైతే పంచబాణస్య సాయకాః ||
"పంచ" హిందీలోకి వెళ్ళి పాంచ్ అయింది. ఇంగ్లీషులోకి వెళ్ళి "పంచ్" అయింది. అయిదు రకాల పండ్ల రసాలు కలపగా వచ్చిన దానిని ఇంగ్లీషులో "పంచ్" అంటారు. పంచ్ లో "చుక్క" పడక్కరలేదు.
ఝీలం, చీనాబ్, రావి, బీయాస్, సట్లెజ్ అనే అయిదు నదులు ప్రవహించే దేశాన్ని పంజాబ్ అన్నా రు. సనాతనుల దృష్టిలో పంచగంగలూ కావేరి, తుంగభద్ర, కృష్ణవేణి, గోదావరి, గంగానది.




ఈ ఐదు నదులే పంచగంగలు ఎందుకు అయాయో, ఇందులో నాలుగు దక్షిణాది నదులవడంలో ఉన్న సూక్ష్మం ఏమిటో నాకు బోధపడడం లేదు.
పంచామృతాలు వేసుకుందికి వీలుగా ఐదు గదులు ఉన్న పాత్రని పంచపాత్ర అనేవారు, మొదట్లో. ఇటీవలి కాలంలో పంచపాత్ర అంటే పూజాసమయంలో ఉద్ధరిణితో వాడే ఏదైనా ఒక చిన్న పాత్ర. సంతర్పణలలోనూ, హొటేళ్ళలోనూ పచ్చళ్ళు, ఊరగాయలూ వడ్డించడానికి ఐదు పాత్రలు కలిసి ఉన్న పాత్రా విశేషాన్ని ఈ రోజుల్లో "గుత్తి" అంటున్నారు.
తిథి ["డేట్"], వారం ["డే ఆఫ్ ద వీక్"],నక్షత్రం[నిజానికిచంద్రుడు ఉన్న నక్షత్ర సముదాయం], యోగం [గ్రహాల కలయిక], కరణం [జాతకం] ఉన్న పుస్తకాన్ని పంచాంగం అంటాం.
అప్పు ఇచ్చిన వాడు, పుచ్చుకున్న వాడు, దస్తావేజు రాసిన వాడు, ఇద్దరు సాక్షులు సంతకం పెట్టిన కాగితం పంచారూఢిపత్రం అవుతుంది.
పంచభక్ష్యములు అంటే భక్ష్యం, భోజ్యం, లేహ్యం, చోష్యం, పానీయం. భక్ష్యం అన్నా భోజ్యం అన్నా "తినదగినది" ["ఎడిబుల్"] అనే నిఘంటుకారుడు చెప్పేడు. మరి ఈ రెండింటి మధ్య తేడా ఏమిటో? లేహ్యం అంటే ముద్దలా ఉన్నది, చోష్యం అంటే పీల్చదగ్గది లేదా జుర్రుకోడానికి వీలైనది. పానీయం అంటే తాగేది.
భూమి, నీరు, అగ్ని, గాలి ఈ నాలుగింటినీ అనాది కాలపు గ్రీకులు ముఖ్యమైన మూలకాలు లేదా "ఎసన్షియల్ ఎలిమెంట్స్" అనేవారు. ఈ భూలోకంలో ఉన్నవి అన్నీ ఈ నాలుగింటి తోటే తయారయాయనీ స్వర్గలోకంలో ఉన్నవన్ని మరొక అయిదవ పదార్థంతో చేయబడ్డాయనీ నమ్మేవారు. ఈ "అయిదవ పదార్థం" గ్రీకు భాషలో "క్వింటిసెన్స్" అయింది. "క్వింట్" అంటే అయిదు, "ఎసెన్స్" అంటే ముఖ్యం అని అర్థం. ఎంతో ముఖ్యమైన విషయం అని ఇంకా నొక్కి వక్కాణించవలసి వచ్చినప్పుడు ఇంగ్లీషులో "క్వింటిసెన్స్" అన్న మాట వాడతారు.
ఈ ఐదింటిని మనవాళ్ళు పంచభూతములు అన్నారు. కాని మనవాళ్ళు ఈ ఐదవ ధాతువుని ఆకాశం అనమన్నారు. ఆకాశం శూన్యానికి సంకేతం కనుక గ్రీకు

వారి క్వింటిసెన్సు మనకి సున్నా అయింది!
పంచగవ్యములు అంటే ఆవు వల్ల మనకు లభించే అయిదు ముఖ్యమైన పదార్థాలు: అవి పాలు, పెరుగు, వెన్న, గోపంచితం, గోమయం. మరీ ఉచ్చ, పేడ అంటే నాటుగా ఉంటుందేమోనని "గోపంచితం", "గోమయం" అన్నాను, అంతే.
ఉపనయనం చేసినప్పుడు పంచశిఖలు ఎందుకు చేస్తారో, దానిలోని అంతరార్థం ఏమిటో ఎవరైనా విడమర్చి చెబితే బాగుండును.
పంచపాండవుల గురించి నాకు ఎవ్వరూ విడమర్చి చెప్పక్కరలేదు. వాళ్ళు మంచపుకోళ్ళలా ముగ్గురు అని నాకు రెండవ తరగతి లోనే తెలుసని ఒకరు చెప్పేరు.
పంచమవేదం అంటే ఐదో వేదం అని అర్థం. పంచమవేదం ఏదయ్యా అంటే మహాభారతం అని కొందరు, ఆయుర్వేదం అని మరికొందరు అంటూ ఉండగా విన్నాను. ఆయుర్వేదంలో పంచకర్మలు ఉన్నాయి. "ఆ పంచకర్మలు ఏవి?" అని అడిగితే రకరకాల సమాధానాలు వచ్చేయి. వాంతి చేయించడం, విరేచనం అయేటట్లు చేయడం, ముక్కులో తైలం పొయ్యడం వగైరాలు ఆధునిక కాలంలో వ్యాపారానికి ఆకర్షణీయంగా లేవని కాబోలు అయిదు నక్షత్రాల హోటేళ్లల్లో ఉత్తర అధునాతన ఆయుర్వేద భిషక్కులు కొత్త చికిత్సా విధానాలు ప్రవేశపెట్టేరు.
పంచజ్ఞానేంద్రియములు ఏమిటో మనకి తెలుసు. ముక్కు మన ఘ్రాణేంద్రియం, నాలుక రసనేంద్రియం, కన్ను చక్షురింద్రియం, చెవి శ్రోత్రేంద్రియం, చర్మం త్వగింద్రియం. త్వక్ అంటే చర్మం.
పంచమహాపాతకాలు: కల్లు త్రాగడం, గురుపత్నితో సంగమించడం, బ్రాహ్మణుడిని చంపడం, దొంగతనం చేయడం, ఈ లక్షణాలున్న వాడితో స్నేహం చేయడం అని మహాభారతంలో ఉంది.
ఇలా చాకలిపద్దులా చెప్పుకుంటూ పోతే పంచ మాటలు చాలా చెప్పుకోవచ్చు: పంచప్రాణాలు, పంచ మహాకావ్యాలు (తెలుగులో, సంస్కృతంలో), పంచ ఆరామ క్షేత్రాలు, పంచ తన్మాత్రలు, పితృపంచకం, మాతృపంచకం, వగైరాలు.
గణితంలో 5 కి ప్రాముఖ్యత లేక పోలేదు. ప్రధాన సంఖ్యలలో 5 మూడవ ప్రధాన సంఖ్య. అంతే కాదు. ఇది రెండు కవల ప్రధాన సంఖ్యలలో కనిపించే ఏకైక సంఖ్య: (3,5) ఒక కవల, ( 5,7) మరొక కవల. ఈ లక్షణం ప్రదర్శించే సంఖ్య ఇదొక్కటే!
హేమచంద్ర-ఫిబొనాచీ వరుసక్రమంలో, అనగా 1, 1, 2, 3, 5, 8.... వరుసలో, 5 అయిదవ స్థానంలో ఉండడం గమనార్హం! ఈ లక్షణం ప్రదర్శించే సంఖ్య ఇదొక్కటే!
అంతే కాదు. అయిదు "ఫెర్మా ప్రధాన సంఖ్య" అవడం వల్ల కేవలం నిటారు బద్ద, వృత్తలేఖిని సహాయంతో పంచభుజిని నిర్మించవచ్చు. ("ఫెర్మా ప్రధాన సంఖ్య" అంటే ఏమిటో గూగులమ్మని అడిగి తెలుసుకొండి.)
భుజాలు పూర్ణాంకాలు అయిన అతి చిన్న లంబకోణ త్రిభుజంలో కర్ణం పొడుగు 5. (మిగిలిన రెండు ఆసన్న భుజాల పొడుగులు 2, 3 అని గమనించండి.)

రేఖాగణితంలో పెంటగన్‌ని పంచభుజి అంటారు. అమెరికా ప్రభుత్వపు దేశరక్షణ విభాగం పంచభుజి ఆకారంలో ఉన్న ఒక పెద్ద భవనంలో ఉంది. అందుకని ఆ భవనాన్ని "పెంటగన్" అంటారు. ఇది భవనం పేరు కనుక దీన్ని మనం తెలుగులోకి అనువదించి పంచభుజి అనక్కర లేదు. అలాంటప్పుడు మన "లాల్ ఖిల్లా"ని ఇంగ్లీషువాడు "రెడ్‌ఫోర్ట్" అంటూంటే మనం ఎందుకు ఊరుకున్నాం? మంచి ప్రశ్నే!
భారతదేశపు రక్షణ శాఖా విభాగానికి షడ్భుజి ఆకారంలో ఒక భవనం నిర్మించి దానికి షడ్భుజి అని పేరు పెడితే అమెరికావాడు తప్పకుండా ఉడుక్కుంటాడు!
పంచతంత్రంలో మిగిలిన రెండింటి పేర్లు లబ్ధనాశం, అసంప్రేక్ష్యకారిత్వం అని ఇప్పటికేనా తెలుసుకొండి.

# ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



# ప్రేమంటే ఇంతే

(గత సంచిక తరువాయి)

కృష్ణమోహన్ ఫోన్ చెయ్యగానే మొదటి రింగ్కే ఫోన్ ఎత్తి 'హలో" అంది అనూరాధ.

"హలో ఎవరు రాధేనా మాట్లాడు తున్నది"

"అవును బావా నీకు ఎలా వుంది, నొప్పి పూర్తిగా తగ్గిందా?" అని ఆతృతగా అడిగింది.

"నిన్ననే చెప్పాను నొప్పి లేదని, నేను ఫోన్ చెయ్యకపోతే నువ్వు అనవసరమైన ఆలోచనలు చేస్తూ కుదురుగా వుండవని ఫోన్ చేసాను"

"థాంక్యూ బావా, మళ్ళీ ఎప్పుడు వస్తావు" అని ఆడిగింది అనూరాధ.

"వీలున్నపుడు వస్తాను. అనవసరమైన ఆలోచనలు చెయ్యకుండా నీ దృష్టి అంతా నీ చదువు మీద పెట్టు, ఇక వుంటాను" అని ఫోన్ పెట్టేసాడు. తరువాత సుమారు ఒక నెల పాటు కృష్ణ మోహన్ రాధ వాళ్ళింటికి వెళ్ళ లేదు. మధ్యలో రెండు సార్లు రవి ఫోన్ చేసి రమ్మన్నాడు కాని వివిధ కారణాల వల్ల వెళ్ళలేకపోయాడు.

రవి, రాధ బలవంతం చేస్తే డిశంబర్ 31వ తేదీ సాయంత్రం వెళ్ళాడు. ఆ రోజు రాత్రి భోజనం చేసి వాళ్ళంతా కబుర్లు చెప్పుకుంటూ, అడ్డాట ఆడి, పాటలు పద్యాలతో అర్ధరాత్రి వరకు అందరు సరదాగా గడిపారు.

అర్ధరాత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు ఒకరికొకరు చెప్పుకున్న తరువాత నూతన సంవత్సర సందర్భంగా రాధ చేసిన గులాబ్జాం తిని "ఇక నేను బయలుదేరుతాను" అన్నాడు కృష్ణమోహన్.

"వుండు బావా నేను డ్రాప్ చేస్తాను" అన్నాడు రవి.

"వోయ్ మోహన్ ఈ వేళప్పుడు ఎక్కడికీ వెళ్ళొద్దు, కొత్త సంవత్సరము పేరు చెప్పి ఈ అర్ధరాత్రి పనీపాటూ లేని తాగుబోతులంతా రోడ్లెక్కి హడావిడి చేస్తూంటారు, ఇక్కడే పడుకుండిపో తెల్లారగట్టే వెళుదువుగాని" అన్నారు పార్వతమ్మగారు

"లేదండీ నేను కొంచం ఆలస్యంగా లేస్తాను, రేపు ఉదయం తొమ్మిదికల్లా కాలేజీలో మా ప్రొఫెసర్ గారిని ఒక ముఖ్యమైన పనిమీద కలవాలి టైం సరిపోదు" అన్నాడు కృష్ణమోహన్.

"పరవాలేదయ్యా ఒక గంటన్నర ముందు లేస్తే సరిపోతుంది రవి స్కూటర్ మీద డ్రాప్ చేస్తాడు" అని అతనిని వెళ్లనివ్వలేదు పార్వతమ్మగారు. పెద్దలు, పిన్నలు పడుకున్నారు, రవి, అనూరాధ, కృష్ణమోహన్ మిగిలారు.

"బావా సంక్రాంతి తరువాత హైదరాబాద్ వెళ్ళాలి, నాకు ఒక కంపెనీలో ఇంటర్వ్యూ వచ్చింది" అన్నాడు రవి.

"వెరీ గుడ్, ఎప్పుడు ఇంటర్వ్యూ, ఎప్పుడు బయలుదేరుతున్నావు" అని అడిగాడు కృష్ణమోహన్.

"21వ తేదీ బయలుదేరుతాను, 23న ఇంటర్వ్యూ తిరిగి 25న బయలుదేరుతాను"

"హైదరాబాదులో వుండటానికి ఎవరైనా వున్నారా లేకపోతే మొహమాటపడకు నా ఫ్రెండ్స్ వున్నారు"

"థాంక్యూ బావా అఖ్ఖర్లేదు, మా మేనమామ వాళ్ళు వున్నారు"

"ఆల్ ది బెస్ట్ రవి, గుడ్ లక్"

"థాంక్యూ బావా"

తరువాత కాసేపు ముగ్గురూ కబుర్లు చెబుతూ వుండగా రవి నిద్రలోకి జారుకున్నాడు. "రాధా నువ్వూ వెళ్ళి పడుకో, నాకు ఇంకా నిద్ర రావడంలేదు. కాస్సేపు ఏదైనా పుస్తకం చదువుతాను"

"నాకూ నిద్ర రావడం లేదు ఒక పని చేద్దాము, హాల్లో కూర్చుని

కబుర్లు చెప్పుకుందాము బావా"
"సరే పద, ఇక్కడ రవికి డిస్టర్బెన్స్ అవుతుంది"
హాల్లోకి వెళ్ళాక "రోజు ఎన్ని గంటలకి పడుకుంటావు, ఎన్ని గంటలకి లేస్తావు" అని అడిగింది అనూరాధ.
"ఇందులో కూడా ఆ బెంగాలీ వాళ్ళ అలవాటు వచ్చింది, ఆలస్యంగా పడుకుంటాను, ఆలస్యంగా లేస్తాను"
"సరే నా ట్రీట్ సంగతి ఏమిటి" అని అడిగింది అనూరాధ.
"ఏయ్ నిన్ను బుద్ధిగా చదువుకోమన్నానా, మళ్ళీ ట్రీట్లంటావు"
"బావా ఇలా నన్ను మభ్యపెట్టి టోకరా ఇవ్వాలని చూడకు"
"సరే నీ ఫైనల్ పరీక్షలయినాక వేసవిలో చూద్దాము"
"నీ కృష్ణమాయలు నాకు తెలుసు, వేసవి సెలవులివ్వగానే విశాఖపట్నం పారిపోతావు. అందుకని నువ్వు సంక్రాంతి నుండి తిరిగి రాగానే అన్నయ్య వూరు వెళ్ళినపుడు ఇయ్యి"
"చూద్దాము...సరేగాని నువ్వు ఏమీ అనుకోకపోతే ఒకప్పు కాఫీ ఇయ్యగలవా?"
"బావా నిన్ను ఆ మొహమాటమే వదిలెయ్యమంటున్నాను. నువ్వు నువ్వు అడిగితే ప్రాణాలయినా ఇస్తాను బావా" అని సరదాగా నాటకఫక్కీలో అంది అనూరాధ.
"అబ్బో చాలా వుంది, అవసరమైనపుడు అడుగుతాలే ప్రస్తుతానికి కాఫీ చాలు" అని నవ్వుతూ అన్నాడు కృష్ణమోహన్.
కాఫీ త్రాగుతూ "చాలా బాగుంది. ఇంత మంచి కాఫీ ఇచ్చినందుకు ఇదిగో నీకు స్వీట్" అని నాలుగు చాక్లెట్స్ ఇచ్చాడు.
అవి చూసి "థాంక్యూ బావా, చాక్లెట్స్ తెచ్చి ఇప్పటిదాకా ఇవ్వలేదేమి" అని అడిగింది.
దానికి సమాధానంగా ఒక చిరునవ్వు నవ్వి "పద చాలా టైం అయింది ఇక పడుకుందాము, గుడ్నైట్" అన్నాడు కృష్ణమోహన్.
"గుడ్నైట్ బావా" అని కృష్ణమోహన్ రవి రూములోకి అనూరాధ వాణి, సతీశ్ వున్న రూంలోకి వెళ్ళారు.
మర్నాడు ఉదయం ఏడు గంటలకి రవి లేపితే కృష్ణమోహన్ లేచాడు. అప్పుడు బ్రష్, టంగ్ క్లీనర్ లేవన్న సంగతి గుర్తుకొచ్చి "బావా బ్రష్ అవీ లేవు, నన్ను హాస్టల్ దగ్గర డ్రాప్ చెయ్యి, అక్కడికి వెళ్ళి ఫ్రెష్ అవుతాను" అని రవితో అన్నాడు.
అప్పుడే కాఫీ కప్పులతో రూంలోకి వచ్చిన అనూరాధ ఆ మాట విని "కృష్ణా కొత్త బ్రష్, టంగ్ క్లీనర్ వున్నాయి అవి నిన్న రాత్రే నీ కోసం తీసి వుంచాను, వాటితో ఫ్రెష్ అవు" అంది.
"ఓహ్ కాఫీ ఎమఘుమలాడుతూ మనసు లాగేస్తున్నాది" అన్నాడు కృష్ణమోహన్.
"అనూ బావకి కూడా ఒక కప్పు కాఫీ యియ్యవే" అన్నాడు రవి.
"కృష్ణా నా కప్పు తీసుకో నేను మళ్ళీ కలుపుకుంటాను" అంది అనూరాధ.
"వద్దు పెద్దవాళ్ళు చూస్తే మందలిస్తారు, అయినా నీ కోసం తెచ్చుకున్నావు నువ్వు త్రాగు, నేను ఫ్రెష్ అయి వస్తాను" అన్నాడు కృష్ణమోహన్.
"పరవాలేదు త్రాగు" అంది అనూరాధ. రవి న్యూస్ పేపర్ కోసం హాల్లోకి వెళ్ళాడు.
"ఒక పని చెయ్యి, ఒక ఖాళీ కప్పు ఖాళీ కప్పు షేర్ చేసుకుందాము" అని అనూరాధతో అన్నాడు కృష్ణమోహన్. అనురాధ ఖాళీ కప్పుతో బాటు ఒక టవల్ కూడా తీసుకొచ్చి కృష్ణమోహన్కి ఇచ్చింది.
కాఫీ త్రాగినాక "రాధా నేను ఫ్రెష్ అయి ఏకంగా స్నానం చేసి వస్తాను. రవిని రడీగా వుండమను, నన్ను డ్రాప్ చేసి హాస్టల్లో తను కూడా బ్రేక్ఫాస్ట్ చేసి వస్తాడు" అన్నాడు కృష్ణమోహన్.
"మరి ఆంలెట్ వేస్తున్నాను,అది ఎవరు తింటారు" అని వెటకారంగా అడిగింది అనూరాధ.
ఆంలెట్ పేరు వినగానే వళ్ళు మరచిపోయి "థాంక్యూ అయితే ఇక్కడే బ్రేక్ఫాస్ట్" ఆనందంగా అన్నాడు కృష్ణమోహన్.
"సార్ మనము ఇంట్లో వున్నాము, ఆంలెట్ వేస్తే వేసినందుకు నాకు, తిన్నందుకు నీకు వీపు మీద పెసరట్లు వేస్తారు అమ్మా, నాన్నాగారు. నీకు ఇష్టమని రవ్వ దోశలు వేస్తున్నాను త్వరగా తెములు"
సంక్రాంతి సెలవులకి విశాఖపట్నం వెళ్ళి కృష్ణమోహన్ తిరిగి వచ్చిన మూడు రోజుల తరువాత రవి హైదరాబాద్ ప్రయాణం రోజున రవికి "శుభాకాంక్షలు" చెప్పటానికి వాళ్ళింటికి వెళ్ళి


చైతన్యం సంకల్ప బలం

"బావా ఇంటర్వ్యూకి బాగా ప్రిపేర్ అయ్యావా? విష్ యు ఆల్ సక్సెస్ ఎండ్ హ్యాపీ జర్నీ" అని అన్నాడు కృష్ణమోహన్.
"థాంక్యూ బావా"
"నిన్ను స్టేషన్లో ట్రైన్ ఎక్కించి నేను అలా హాస్టల్కి వెళతాను"
"ఇదిగో ఈ రాక్షసి పొద్దున్న నుండి తనూ స్టేషన్కి వస్తానని నన్ను వేపుకు తింటున్నాది" అని అనూరాధ గురించి చెప్పాడు రవి.
"నువ్వెందుకు రాధా నేను దిగబెడతాను"
"నేనూ వస్తాను, ఈ వూరు వచ్చి ఇన్ని రోజులు అయినా నేను కాకినాడ స్టేషన్ చూడలేదు" అంటూ చిన్నపిల్లలాగ మారాం చేసింది అనూరాధ.
"పోనీలెద్దూ అది ఏదో ముచ్చట పడుతుంది, నువ్వు దాన్ని దిగబెట్టి వెళ్లుగాని" అని కృష్ణమోహన్తో అన్నారు పార్వతమ్మగారు.
"వద్దండీ మళ్ళీ మీరు భోంచేసి వెళ్ళు అంటారు. రేపు నాకు టెస్ట్ వుంది, నేను తొందరగా వెళ్ళాలి"
"నీ మొహమాటం సంతకెళ్ళ, నిన్ను భోజనం చెయ్యమనను సరేనా...నా మతిమరుపు మండా! నిన్ను చూడగానే నాకు ఒక ఆలోచన వచ్చింది మాటలలో మరిచాను, నువ్వు ఒక సహాయం చెయ్యగలవా?"
"చెప్పండి"
"ఏమీలేదు రవి తిరిగి వచ్చేసరికి ఐదు రోజులు పడుతుంది, ఈ లోపల అనూకి రెండు రోజులు సంగీతం క్లాసులు వున్నాయి. ఆడపిల్లని ఒక్కర్తినీ పంపడానికి భయం వేస్తున్నాది, అందుకని నువ్వు ఆ రెండు రోజులూ దాన్ని సంగీతం క్లాసుల నుండి తీసుకురాగలవా?"
"ఓస్! సహాయం అంటే ఏమిటో అనుకున్నాను, అలాగే తప్పకుండా చేస్తాను"
"మీ మామయ్య గారికి ఎలాగూ స్కూటర్ నడపడం రాదు,అందుకని ఒక పని చెయ్యి నువ్వు ఇప్పుడు హాస్టల్కి స్కూటర్ తీసుకెళ్ళిపో, ఆ రెండు రోజులూ నీకు వచ్చి వెళ్ళడానికి ఇబ్బంది వుండదు"
"సరే అలాగే"
"బావా నేను నిన్ను ముందు స్టేషన్లో డ్రాప్ చేసి వస్తాను, తరువాత అనూని పికప్ చేసుకుని వస్తా-ను" అన్నాడు రవి.
"అలాగే చెయ్యి" అన్నాడు కృష్ణమోహన్.
"అదేం కుదరదు, మీరిద్దరూ ముందు వెళితే నిన్ను ట్రైన్ ఎక్కించి హాస్టల్కి చల్లగా జారుకుంటాడు ఈ మోహమాట చక్రవర్తి. అందుకని ముందు ట్రిప్లో నన్ను తీసికెళ్ళి డ్రాప్ చేసి రెండో ట్రిప్లో బావని తీసుకురా" అంది అనూరాధ. తప్పించుకోవడానికి అవకాశం లేకుండా చాలా తెలివిగా ఇరికించింది అనుకున్నాడు కృష్ణమోహన్.
రవిని ట్రైన్ ఎక్కించాక అనూరాధ, కృష్ణమోహన్ స్టేషన్ బయటకి వచ్చాక "బావా ఎక్కడైనా పది ని-ముషాలు కూర్చుని మాట్లాడుకుందాము" అంది అనూరాధ.
"ఏయ్! పిచ్చి వేషాలు వెయ్యకు, పద నిన్ను డ్రాప్ చేసి నేను వెళతాను"
"బావా, ప్లీజ్ బావా"
"సరే కాఫీ హౌస్కి వెళ్ళి ఒక కప్పు కాఫీ తాగి వెళిపోదాము, పది నిముషాలు కన్నా ఎక్కువ వుండను"
"సరే నా చాక్లెట్స్ ఏవీ"
"ఓస్ మరచిపోయాను" అని అరడజను చాక్లెట్స్ జేబులో నుండి తీసి ఇచ్చాడు. కాఫీ హౌస్ చేరుకున్నాక కాఫీ త్రాగుతూ మాట్లాడుతూ వుండగా "నా ట్రీట్ ఎప్పుడు ఇస్తావు" అని అడిగింది అనూరాధ.
"నువ్వింకా మరచి పోలేదా?"
"ఆశ అలాగే...ఒక పని చేద్దాము ఈ ఆదివారం ఉదయం ఎక్కడికైనా వెళదాము, బయట భోజనం చేద్దాము"
"అలాగే, నీకు ఆ ట్రీట్ ఇచ్చేస్తే నాకు మనశ్శాంతి లభిస్తుంది"
"ఆదివారం ఉదయం తొమ్మిది కల్లా నేను మా ఇంటి దగ్గర రామాలయంలో నీ కోసం నిరీక్షిస్తూ వుంటాను"
"సరే ఇంక పద" అని ఇద్దరూ బయలుదేరి అనూరాధని ఇంటి దగ్గర వదిలిపెట్టాడు కృష్ణమోహన్.
"బావా రేపు సంగీతం క్లాస్ వుంది మరచిపోకు, నువ్వు సరిగ్గా ఆరు గంటలకి మా సంగీతం టీచర్ ఇంటికి వచ్చెయ్యి"
"అలాగే బాయ్" అని కృష్ణమోహన్ హాస్టల్కి వెళ్ళిపోయాడు.

*********

అనూరాధ విషయాలన్నీ కృష్ణ మోహన్ ఎప్పటికప్పుడు అవినాష్తో పంచుకుంటున్నాడు. ఈ ట్రీట్ విషయం చెప్పినపుడు

"బావా ఇంతవరకు అనూ గురించి నువ్వు చెప్పిన విషయాలు విన్నాక తను నిన్ను ఇష్టపడుతున్నట్లు, అభిమానిస్తున్నట్లు నాకు అనిపిస్తున్నాది. ఇవి ప్రేమగా మారే అవకాశం వుంది"అన్నాడు.

"నాకలాంటి ఉద్దేశ్యం లేదు బావా, అయినా నా దృష్టి అంతా ఇప్పుడు చదువు మీదే ... మాకు వుండటానికి ఒక ఇల్లు గాని, ఆస్తులు గాని ఏమీ లేవు. మేము మా నాన్నగారి సంపాదన మీద ఆధారపడి వున్నాము, అందుకని నేను ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా సెటిలయి మా నాన్నగారిని సపోర్ట్ చెయ్యాలనుకుంటున్నాను. ముందు నేను సెటిల్ అవ్వాలి, ఆ తరువాతే మిగతా విషయాలు" అని తన అభిప్రాయాన్ని చెప్పాడు కృష్ణమోహన్.

"మరి ఆదివారం ఒకవేళ అనూ ఆ ప్రస్తావన తీసుకొస్తే?"

"నా అభిప్రాయాన్ని నిర్మోహమాటంగా చెబుతాను"

"సరే బావా ఒక్క విషయం గుర్తు పెట్టుకో, ఆడవాళ్ళు సున్నిత మనస్కులు అందుకని చెప్పేది మాత్రం మృదువుగా అనూ మనసు గాయపడకుండా చెప్పు" అని సలహా ఇచ్చాడు అవినాశ్.

"అలాగే బావా"

అనుకున్న ప్రకారం ఆదివారం ఉదయం రామారావుపేట కుళాయి చెరువు దగ్గర వున్న రామాలయంలో అనూరాధ కృష్ణమోహన్ కోసం నిరీక్షిస్తూ వుంది. కృష్ణమోహన్ తొమ్మిదికల్లా రామాలయానికి వచ్చాడు.

"బావా రాములవారి దర్శనం చేసుకొని బయలుదేరుదాము" అంది అనూరాధ. ఇద్దరూ స్వామి వారి దర్శనం చేసుకొని బయటకి వచ్చాక "ఇప్పుడు చెప్పు ఎక్కడికి వెళదాము" అని అడిగాడు కృష్ణ మోహన్.

"నీ ఇష్టం, నేను నీ అతిధిని నువ్వు ఎక్కడికి తీసుకెళితే అక్కడికి వస్తాను"

"సరే యానాం వెళదాము" అని స్కూటర్ స్టార్ట్ చేసాడు కృష్ణమోహన్. యానాంలో శివాలయం, సైంట్ ఏన్స్ కేతలిక్ చర్చ, గ్రాండ్ మాస్క్, వేంకటేశ్వరస్వామి వారి ఆలయం, గోదావరి నది ఒడ్డు అన్నీ చూపించాడు కృష్ణ మోహన్. అతనితో అలా కలిసి రావడమనేది చాలా ఆనందాన్ని, ఒక కొత్త అనుభూతిని కలుగజేసింది అనూరాధకి. గోదావరి నదివొడ్డున కూర్చుని ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"బావా నువ్వు ఇదివరకు ఎప్పుడైనా చర్చ్కి, మసీదుకి వెళ్ళావా? నేను ఇదే మొదటిసారి చూడడం"

"విశాఖపట్నం పోర్ట్ ఏరియాలో ఒకే చోట మూడు కొండలున్నాయి. మొదటి కొండ మీద వేంకటేశ్వర స్వామి వారి ఆలయం, రెండవది దర్గా కొండ దాని మీద మసీదు, మూడవది రోజ్హిల్స్ దాని మీద కన్నెమరియమ్మ గుడి (చర్చ) వున్నాయి. నేను ప్రతి శనివారం ఆ వేంకటేశ్వరస్వామి వారి గుడికి వెళ్ళేవాడిని. నాకు షాజహాన్ అని చాలా క్లోజ్ ఫ్రెండ్ వున్నాడు, వాడు నేను హైస్కూల్లో కలిసి చదువుకున్నాము. మేమిద్దరమూ ఎన్నోసార్లు మసీదుకి, గుడికి కలిసి వెళ్ళాము. మేరీమాత పుట్టినరోజు నాడు మరియమ్మ పండుగ ప్రతీ సంవత్సరం ఆ రోజ్హిల్స్ మీద జరుగుతుంది, నేను ఫ్రెండ్స్ కలిసి నాలుగు సార్లు వెళ్ళాను" వివరంగా తన అనుభవాలని అనూరాధతో పంచుకున్నాడు కృష్ణమోహన్.

"మరి మీ ఇంట్లో అలా మసీదులకి, చర్చ్లకి వెళితే ఏమీ అనరా!" ఒకింత ఆశ్చర్యంగా అడిగింది అనూరాధ.

"మా ఇంట్లో ఏమీ అభ్యంతరాలు వుండవు. మా నాన్నగారు చాలా అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి. ఆయన ఇలాంటివి ప్రోత్సహిస్తారు. యాదృచ్ఛికంగా ఆయనకీ కరీం అని ఒక ముస్లిం బాల్యస్నేహితుడు వున్నారు, వారి స్నేహం ఈ రోజుకీ కూడా కొనసాగుతుంది. 'ఎదట మనిషి కష్టాల్లో వున్నపుడు అతను ఎవరైనా మనకు చేతనైన సహాయం చేయాలి అనేది మా నాన్నగారి సిద్ధాంతం'. ఇక మా అమ్మగారికి కొంచెం ఛాందసము వున్నా ఆవిడ చాలా వరకు మా అభిప్రాయాలని మన్నిస్తుంది" అని కృష్ణమోహన్ వివరించాడు.

"నువ్వు చెప్పింది వింటుంటే నాకు చాలా ఆశ్చర్యంగావుంది, ఎందుకంటే మా ఇంట్లో మా నాన్నగారు, మా అమ్మ ఇద్దరూ చాలా ఛాందస భావాలు కలిగిన వాళ్ళు. పొరపాటున నేను ఇలా వెళ్ళానని తెలిస్తే నన్ను మందలిస్తారు"

“వాళ్ళు చిన్నపుడు పుట్టి పెరిగిన వాతావరణాన్ని అనుసరించి మన పద్ధతుల ప్రకారం వాళ్ళు వున్నారు అందులో తప్పేముంది” అని “ఇంతకీ ఇంట్లో ఏం చెప్పి వచ్చావు” అని అడిగాడు.

“మా స్నేహితురాలి అన్నయ్య నిశ్చితార్థం అని చెప్పాను”

“మీ వాళ్ళు సనాతనమైన వాళ్ళు కదా, వివరాలు అడగ లేదా?”

“అడిగారు, మనవాళ్ళే కానీ మన శాఖ కాదు ఇంటిపేరు వేదుల వాళ్ళు ద్రావిడులని చెప్పాను”

“అమ్మ జయచిత్రా! ఎంతైనా ఆడ వాళ్ళు అబద్ధము చెబితే గోడ కట్టి నట్లు వుంటుంది”

“నా మాట నాకే అప్పచెప్పావు, సరే నీ కోనసీమ కలల రాణి కనిపించిందా?”

“ఏయ్ ఇలా ఆట పట్టిస్తావనే ఆ రోజు సగంలో ఆపేసాను, కానీ నీ తెలివితేటలతో కనిపెట్టేసావు నా దగ్గర ట్రీట్ కొట్టేసావు. సరే పద ఇక బయలుదేరుదాము, ఇంకా కాకినాడ వెళ్ళి భోజనం చేసి నిన్ను డ్రాప్ చేసే సరికి రెండు దాటుతుంది” అంటూ లేచాడు కృష్ణమోహన్.

కాకినాడ వచ్చి అక్కడ సత్కార్ హోటల్లో భోజనాలయినాక అనూరాధని వాళ్ళ ఇంటి దగ్గరలో డ్రాప్ చేసి హాస్టల్కి తిరిగి వచ్చాడు కృష్ణమోహన్.

ఒక రోజు రవి కృష్ణమోహన్కి ఫోన్ చేసి “బావా నీతో కొంచెం పనుంది, సాయంత్రం అర్జంట్గా రాగలవా” అని అడిగాడు.

“ఏమైంది, అందరూ కులాసాయే నా” కంగారుగా అడిగాడు కృష్ణమోహన్.

“అంతా కులాసాయే. నేను, నాన్నగారు, అమ్మ వూరు వెళ్ళ వలసి వస్తున్నాది, వాణి పరీక్షలు మొదలయ్యే సమయానికి మేము వుండము, అందుకని వాణి నిన్న రాత్రి నుండి పరీక్షల గురించి బెంగపెట్టుకొని ఏడుస్తున్నాది. నువ్వు వస్తే అన్ని విషయాలూ మాట్లాడుదాము”

“సరే అలాగే వస్తాను” అని సాయంత్రం కృష్ణమోహన్ వెళ్ళాడు .

అతను వెళ్ళేసరికి అందరూ చాలా కలతతో వున్నారు, వాణి మీద కోపంతో కేకలు వేస్తున్నారు. కృష్ణమోహన్ని చూడగానే వాణి ఏడుస్తూ పరిగెత్తి అతని చెయ్యి పట్టుకుని “చూడు బావా అసలే నేను పరీక్షలగురించి బెంగపడుతుంటే వీళ్ళందరూ నన్ను కోప్పడుతున్నారు, దెబ్బలాడుతున్నారు” అంది.

“పిచ్చి పిల్లా వీళ్ళంతా నీ వాళ్ళే కదా, భయమెందుకు ఈ ఏడుపెందుకు, ముందు ఆ ఏడుపు ఆపు” అని “రవీ ఏమయింది ఎందుకు ఏడుస్తున్నాది” అని అడిగాడు కృష్ణమోహన్.

“పరీక్షలు తప్పుతాను, పరీక్షలు రాయను అంటున్నాది”

“ఏమైంది వాణీ, ఎందుకు రాయనంటున్నావు” అడిగాడు కృష్ణమోహన్.

“బావా నాకు పబ్లిక్ ఎక్జాం రాయాలంటే భయమేస్తున్నాది, నేను తప్పకుండా ఫైల్ అయిపోతాను” అంది వాణి.

“భయమెందుకు, నువ్వు ఇదివరకు టెంత్లో పబ్లిక్ ఎగ్జాం రాసావుగా”

“అయినా నాకు భయమేస్తున్నాది బావా”

“OK ఒక పని చెయ్యి, నీ ఎగ్జాం గురించి కాస్సేపు మరచి పోయి, ఆ ఏడుపు ఆపేసి ముఖం కడుక్కుని ఫ్రెష్ అయి రా, మనందరం అలా బయటకి వెళ్దాము” అన్నాడు కృష్ణమోహన్...బయట కాస్సేపు తిరిగి వస్తే వాణి రిలాక్స్ అవుతుంది, తరువాత చదువు గురించి మాట్లాడుదాము అని అతని వుద్దేశ్యం.

“అదికాదయ్యా దాని పరీక్షలు ఇంక ఇరవై రోజులేవున్నాయి...” అని పార్వతమ్మగారు ఏదో చెప్పబోతూ వుంటే “అత్తయ్యా మేము తిరిగి వచ్చాక అన్ని విషయాలూ మాట్లాడుదాము, మీరు కంగారు పడకండి వాణీ చేత బ్రహ్మాండంగా పరీక్షలు వ్రాయించే భాధ్యత నాది” అన్నాడు కృష్ణమోహన్.

బయటికి వెళ్ళాక “వాణీ ఇప్పుడు మనం పరీక్షల గురించి, చదువు గురించి అసలు మాట్లాడద్దు, నీ స్నేహితులు, నీ అభిరుచిల గురించి మాట్లాడుకుందాము”

“అలాగే బావా”

“సరే నీ అభిరుచులు గురించి చెప్పు”

“నా అభిరుచులు అల్లికలు, ముగ్గులు వేయడం, సినిమా పాటలు వినడం”

“గుడ్, నువ్వు ఏ ఆటలు ఆడతావు”

“త్రోబాల్, ఖోఖో, రింగ్ టెన్నిస్”

“గుడ్, సినిమా పాటలు

ఎవరివంటే నీకిష్టం?"
"సుశీలగారు, జానకిగారు, బాల సుబ్రహ్మణ్యం"
సినిమాలంటే ఇంట్రస్ట్ వుందా, నీ అభిమాన హీరో, హీరోయిన్లు ఎవరు"

"నాకు ఎన్.టి.ఆర్, వాణిశ్రీ అంటే ఇష్టం"
అలా ఒక గంట కబుర్లు చెప్పుకొని వాణి దృష్టి చదువు, పరీక్షల నుండి మరల్చి సామాన్య స్థితికి తీసుకు వచ్చాడు కృష్ణమోహన్.

*********

భోజనాలు చేసిన తరువాత అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.
"బావా నీతో మాట్లాడిన తరువాత వాణి కాస్త కుదుటపడింది. ఇప్పుడు ఒక సమస్య వచ్చింది, అదేమిటంటే మార్చి 10వ తేదీ నుండి వాణి పరీక్షలు మొదలవుతున్నాయి, నేను ఒక ఇంటర్వ్యూకని తొమ్మిదవ తేదీన బయలుదేరి మద్రాసు వెళుతున్నాను. అమ్మ నాన్నగారు మా రెండవ మేనత్త కొడుకు పెళ్ళికి నెల్లూరు అదే రోజు వెళుతున్నారు. వాళ్ళు పదమూడవ తేదీన తిరిగివస్తారు, నేను పద్నాల్గవ తేదీన తిరిగి వస్తాను. ఉంకొక విషయం ఏమిటంటే మేడమీద వున్న దక్షిణామూర్తిగారు, భార్య వారం రోజుల క్రితం బొంబాయిలోవున్న వాళ్ళ అబ్బాయి దగ్గరకి వెళ్ళారు, వారు రెండు నెలల దాకా రారు. సరిగ్గా వాణి పరీక్షలు మొదలయ్యే సమయానికి మేము వుండటం లేదని తనకి బెంగ పట్టుకుని భయమేస్తున్నాది, నేను పరీక్ష తప్పుతాను అంటూ ఏడవడం మొదలుపెట్టింది, అది చూసి నాన్నగారికి అమ్మకి కంగారు వచ్చింది. మోహన్ని రమ్మను అతనిని ఆ నాలుగు రోజులూ ఇక్కడ అనూకి, వాణికి సాయంగా వుంటాడు, వాణి పరీక్షలకి గైడ్ చేస్తాడు అని అమ్మ అంది. అందుకే నీకు ఫోన్ చేసి రమ్మన్నాను" అని విషయాన్ని వివరించాడు రవి.
"అబ్బాయ్ మోహన్ ఆ నాలుగు రోజులూ నువ్విక్కడ వుండి మాకు సహాయం చెయ్యాలి" అన్నారు పార్వతమ్మగారు, విశ్వనాథంగారు
"అవును బావా నువ్విక్కడ వుంటే మేము నిశ్చింతగా వెళ్ళి రాగలము" అన్నాడు రవి.
"బావా నువ్విక్కడ వుంటే నాకు ధైర్యంగా వుంటుంది, నేను పరీక్షలు బాగా వ్రాయగలను" అంది వాణి.
అనూరాధ ఏమీ మాట్లాడలేదు గాని కృష్ణమోహన్ ఏమంటాడా అని అతని వంక నిశితంగా చూస్తున్నాది.
"సరే అలాగే వుంటాను, మీరందరూ నిశ్చింతగా వెళ్ళిరండి" అని
"వాణీ నువ్వు పాటలు పాడుతావా" అని అడిగాడు కృష్ణమోహన్.
ఇదేమిటి ఇతను ఒక్కసారి విషయం మార్చి నువ్వు పాటలు పాడతావా అని వాణిని అడుగుతున్నాడు అని అందరూ ఆశ్చర్యంగా అతని వంక చూసారు.
"నలుగురిలో పాడాలంటే నాకు సిగ్గు, భయం" అంది వాణి.
"భయమెందుకు, సిగ్గెందుకు, మీ అక్క పాడటంలేదా, నేను పాడటంలేదా? అలాగే నీ అభిమాన గాయనీ గాయకులు ఎన్ని వందల పాటలు పాడారు, వారంతా భయం, సిగ్గు అనుకుంటే ఈ రోజు మనమంతా అభిమానించే వాళ్ళమా? ఆదరించే వాళ్ళమా? ఒక్క విషయం గుర్తు పెట్టుకో "పుట్టుకతోటే ఎవ్వరికీ అన్ని విద్యలు రావు, మనము పుట్టిన వెంటనే ఏడుస్తాము అప్పుడు అదే మన భాష. ఆ తరువాత కొన్ని నెలలకు ఒక అక్షరం మాటలు, తరువాత రెండక్షరాల మాటలు అలా క్రమేపీ మాటలు వస్తాయి. అలా మనం ఒక్కొక్క మెట్టూ ఎక్కి అన్నీ నేర్చుకుంటాము. అదే మనం భయపడి పైమెట్టు ఎక్కక పోతే, మనం అక్కడే ఉండిపోతాము మన తోటి వాళ్ళంతా ముందుకు వెళిపోతారు. మనం అనవసరంగా దేనికీ భయపడకూడదు, తప్పు చేస్తే భయపడాలి. మనం చేసే పనిలో అది చదువైనా, ఉద్యోగమైనా, ఇంకేదైనా మన శక్తి వంచన లేకుండా కృషి చెయ్యాలి"
"నాకు స్టేజి ఫియర్ బావా" అంది వాణి

"చూడు వాణి మొదటి సారి కొంచెం బెరుకుగావుంటుంది, క్రమేపీ ఆ భయం తగ్గి కొన్నాళ్ళకి పోతుంది. "సముద్రం ఒడ్డున నించుని అలలు తగ్గాక స్నానం చేద్దామనుకుంటే అది జీవితంలో జరగదు. ఆ భయాన్నిమనం

మనం తొలగించాలంటే మనం ధైర్యం చెయ్యాలి, అదే సమయంలో జాగ్రత్తగానూ వుండాలి. ఇక పాటల విషయానికి వస్తే మొదటి సారి కొంచెం తప్పులు రావచ్చు, భయంగానో, బిడియంగానో వుంటుంది. కాలక్రమేణా సాధనతో వాటిని మనం అధిగమించొచ్చు, చదువు విషయం కూడా అంతే. మనకి నూటికి నూరు మార్కులొచ్చినా మన పరిజ్ఞానాన్ని మనం సందర్భోచితంగా అన్వయించకపోతే లేదా వాడుకోకపోతే ఆ పరిజ్ఞానానికి సార్ధకత వుండదు. ఇప్పుడు చెప్పు అసలు నీకు పరీక్షలు అంటే భయమెందుకు" అని అడిగాడు కృష్ణమోహన్.

"చదివినవి ఒకొక్కసారి గుర్తు రాక వచ్చినవి కూడా మరచిపోతున్నాను, దాని వల్ల భయం మొదలవుతున్నాది మొత్తం బ్లాంక్ అవుతున్నాది" అంది వాణి.

"వాణి 'ఈ పరీక్షలు కూడా క్రికెట్ మేచ్ లాంటివే. ఎంత పేరున్న ఆటగాడైనా ఆ మేచ్లో బాగా ఆడాలి. ఆ రోజు బాగా ఆడాలంటే నెట్స్లో బాగా సాధన చెయ్యాలి. పరీక్షలు కూడా అంతే ఆ రోజు ఎవరు బాగా రాస్తే వారే విజయం సాధిస్తారు. ఇక్కడ కూడా బాగా ప్రిపేర్ అవ్వాలి, కంగారుపడకుండా ప్రశాంతంగా రాయాలి'. అలా ప్రశాంతంగా వుండటానికి, నీ పరీక్షల ఒత్తిడిని తొలగించడానికి కొన్ని చిట్కాలు చెబుతాను జాగ్రత్తగా పాటించు" అని పరీక్షల ముందు రివిజన్ ఎలా చేసుకోవాలి? పరీక్షలు అవుతున్నపుడు ఎలాంటిజాగ్రత్తలు తీసుకోవాలో చాలా కూలంకషంగా వాణికి వివరించాడు కృష్ణమోహన్. అతని మాటలు విన్నాక వాణికి చాలా వరకు ఉపశమనం కలిగింది.

"థాంక్యూ బావా నీ మాటలు విన్నాక నా విశ్వాసం పెరిగింది, నీ సలహాలు, సూచనలు తప్పక పాటిస్తాను. నాకు లెఖ్ఖల్లో కొన్ని సందేహాలు వున్నాయి. దయచేసి ఒక నాలుగు రోజులు కొంచెం గైడ్ చెయ్యవా?" అని అడిగింది వాణి.

"అలాగే, తప్పకుండా చెబుతాను. పరీక్షలు ఇంకా ఇరవై రోజులు న్నాయి కదా, పది రోజులముందు రోజు విడిచి రోజు వచ్చి చెబుతాను. నీ పరీక్షల సెంటర్ ఎక్కడ? పరీక్ష టైమింగ్స్ ఏమిటి? వివరంగా చెప్పు" అని అడిగి తెలుసుకున్నాడు కృష్ణమోహన్.

"OK నీ పరీక్షలు గురించి నువ్వు ఇంక ఆలోచించకుండా, నేను చెప్పిన సూచనలని పాటించి దృష్టి అంతా చదువు మీద పెట్టి చదువు, నీ సందేహాలు అన్నీ నోట్ చేసుకొని నేను వచ్చిన రోజు అడిగి తెలుసుకో. నేను చెప్పిన సూచనలలో ఒక ముఖ్యమైన విషయం గుర్తు పెట్టుకో, నీకు చదవడం ఎంత ముఖ్యమో, విశ్రాంతి కూడా అంతే ముఖ్యం. అందుకని ఎలా చదువుకోవాలో నీకు ఒక టైంటేబుల్ తయారు చేసి ఇస్తాను అది పాటించు, అప్పుడు నీకు ఒత్తిడి అనిపించదు. నువ్వు ఫస్ట్ క్లాస్లో పాస్ అవుతావు, అది నా భాద్యత" అని టైంటేబుల్ తయారు చేసి ఇచ్చి వాణికి ధైర్యం నూరి పోసాడు కృష్ణమోహన్.

"థాంక్యూ బావా, నాకు ఇప్పుడు కొండంత ధైర్యం వచ్చింది. నువ్వు చెప్పినట్లే చేస్తాను" అంది వాణి.

"ఇక నేను బయలుదేరుతాను" అన్నాడు కృష్ణమోహన్.

"ఆడపిల్లలిని వదిలి ఎలా వెళతాము అని భయపడ్డాము, సాయంత్రం దాని పరిస్థితి చూసి ఇది అసలు పరీక్షలు రాస్తుందా అని బెంగ పడ్డాము. నువ్వు ఇక్కడ వుండటానికి ఒప్పుకుని, వాణికి ధైర్యం చెప్పడం చూసాక దానితోబాటు మాకూ ధైర్యం వచ్చి ఊపిరి పీల్చుకున్నాము. ధన్యవాదాలు మోహన్" అన్నారు పార్వతమ్మగారు.

"అయ్యో భలే వారే ఈమాత్రం దానికి మీరు థాంక్స్ చెప్పడమేమిటి ! ఇలాగైతే ఇక మీదట నేను మీ ఇంట్లో కాఫీ త్రాగినపుడు, భోజనం చేసినపుడల్లా థాంక్స్ చెప్పాలి" అన్నాడు కృష్ణమోహన్.

"బావా ఒక కప్పు కాఫీ ఇవ్వనా" అని నవ్వుతూ అడిగింది అనూరాధ.

"ఎందుకు థాంక్స్ చెప్పించుకుందుకా" నవ్వుతూ అన్నాడు కృష్ణమోహన్. అతని మాటలకి అందరూ నవ్వుకున్నారు.

"లేదు నిజంగానే, భోజనం చేసి చాలా సేపు అయిందిగా" అంది అనూరాధ.

"మరీ మొహమాటపెట్టేస్తున్నావు"

"అదే వదిలేయమంటున్నాను" అని కాఫీ తీసుకు వచ్చింది అనూరాధ.

కాఫీ త్రాగుతుంటే "అబ్బాయ్,

మోహన్ని హాస్టల్ దగ్గర దింపిరా" అని రవికి చెప్పారు విశ్వనాథం గారు.
కృష్ణమోహన్ బయలుదేరుతూ వుంటే "థాంక్యూ బావా, సాయంత్రం ఎంతో ఉద్రిక్తంగా వున్నపరిస్థితిని నువ్వు ఎంతో నేర్పుగా మామూలు స్థితికి తెచ్చావు. నిజంగా నువ్వు చాలా తెలివైనవాడివి" అంది అనూరాధ.
కృష్ణమోహన్ని హాస్టల్ దగ్గర దింపినాక "పిలిచిన వెంటనే వచ్చి వాణికి ధైర్యం చెప్పి, మేము వూరులో లేనప్పుడు అనూకి, వాణీకి సాయముండడానికి అడిగిన వెంటనే ఒప్పుకున్నావు, థాంక్యూ బావా" అన్నాడు రవి.
"హెయ్ రవి అంతా పెద్ద మాటలాడి ఇబ్బంది పెట్టకు"

*********

అనుకున్న ప్రకారం వాణి పరీక్షలు మొదలయ్యే లోపల నాలుగు రోజులు కాలేజి అయిన తరువాత వెళ్ళి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో సందేహాలు అన్నీ నివృత్తి చేసాడు కృష్ణమోహన్. మార్చి 9వ తేదీ సాయంత్రానికి అనూరాధ ఇంటికి వెళ్ళాడు.
పదవ తేదీ ఉదయం ఎనిమిది గంటలకల్లా బ్రేక్ఫాస్ట్ చేసి వాణిని తీసుకొని బయలుదేరేటపుడు "రాధా నాకు లంచ్ ప్రిపేర్ చెయ్యొద్దు, నేను మధ్యాహ్నం వాణీని ఇంటి దగ్గర దించి కాలేజి వెళ్ళి అక్కడే భోజనం చేస్తాను. కాలేజి అయినాక సాయంత్రం వస్తాను" అని చెప్పాడు కృష్ణమోహన్.


సాయంత్రం వచ్చాక వాణి పరీక్ష ఎలా రాసిందో కనుక్కుని, తరువాత పరీక్షకి ఈ రోజు, మర్నాడు ప్రొద్దున్న చదువుకొమ్మని, మర్నాడు సాయంత్రం తనకు ఏమైనా సందేహాలు వుంటే అడగమని చెప్పాడు. అలా వాణికి కావలసిన ప్రోత్సాహన్ని ఇచ్చి, దిశానిర్దేశం చేసి వాణి చేత పరీక్షలు బాగా రాయించాడు కృష్ణమోహన్.

రేపు పార్వతమ్మగారు, విశ్వనాథంగారు తిరిగి వస్తారనగా, ముందు రోజు రాత్రి కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో "బావా మా కాలేజీ వార్షికోత్సవం ఈ నెల 25న జరుగుతుంది. దానికి నువ్వు తప్పకుండా రావాలి, మంచి మంచి ప్రోగ్రాములు వున్నాయి. ఒక నాటిక కూడా వుంది, అందులో నేనూ నటిస్తున్నాను" అని కృష్ణమోహన్కి చెప్పింది అనూరాధ.
"నువ్వు ఏక్టింగ్ కుడా చేస్తావా? అదీ సంగతి అందుకే ఆ స్పోంటెనిటీ నీకు వచ్చింది"
"అలాగా! మరి తమరు కూడా నటిస్తారు కదా? అంటే ఆ స్పోంటెనిటీ నీకూ వున్నట్టేగా!"
"అమ్మాయిగారు అసలు తడుముకోరు వెంటనే రియాక్ట్ అయిపోతారు"
"నీ తెలివితేటల ముందుమేమెంత?"
"సరేలే, ఇంతకీ నాటికలో నీ పాత్ర ఏమిటి?"
"అది సస్పెన్స్, వెండితెరపై చూడాలి"
"అలాగే మేడం, మీ ఆటోగ్రాఫ్ మాకు తప్పకుండా ఇవ్వండి" అంటూ వేళాకోళం చేసాడు కృష్ణమోహన్.
"ఊహూ! అదిగో నన్ను ఆట పట్టిస్తున్నావు" అంటూ బుంగమూతి పెట్టింది అనూరాధ.
"అబ్బా! మేము ఆట పట్టిస్తున్నాము, కానీ తమరు మమ్మల్ని ఆట పట్టించడం కాదు, ఏకంగా మాతో ఆట ఆడేసుకుంటారు"
"ఇలా నన్ను ఏడిపిస్తే నేను నీతో మాట్లాడను అంతే".
"హమ్మయ్య! ఎంతటి శుభవార్త చెప్పావు, ఆ పని చెయ్యి జీవితాంతం నీకు ఋణపడి వుంటాను"
"ఆశ! నీకు ఆ అవకాశం ఎప్పటికీ ఇవ్వను, నువ్వు ఒక పని చెయ్యి, నేనే నీకు జీవితాంతం ఋణపడి వుంటాను"
"ఏమిటది"
"అహ ఏమీలేదు"
"ఏమీలేనపుడు అలా ఎందుకన్నావు?"
"అబ్బా ఏమీ లేదన్నాగా, ఇప్పుడా విషయం వదిలెయ్యి, సమయం వచ్చినపుడు చెబుతాను" అని తాను చెప్పదలచుకున్నది దాటవేసింది అనూరాధ.
విశ్వనాథంగారు, పార్వతమ్మగారు, రవి తిరిగి వచ్చిన తరువాత 16వ తేదీనాడు రవి ఇంజినీరింగ్ కాలేజీ హాస్టల్కి వచ్చి "బావా ఒక శుభవార్త. నేను జనవరిలో హైదరాబాద్ ఇంటర్వ్యూకి వెళ్ళాను గుర్తుందా? ఆ ఉద్యోగానికి ఇవాళే అపాయింట్మెంట్ లెటర్ వచ్చింది,

(ఇంకా వుంది)

## గడిలో దాగిన వైజ్ఞానిక నుడి - 2

డా. చాగంటి కృష్ణకుమారి



**అడ్డం**

**1.** ఎమరాల్డ్ లో ఆక్సైడ్ రూపంలో ఈ లోహం వున్నదని వాక్ లిన్ (Vauquelin)కనుగొన్నాడు (5 )
4.ఆర్కె మెడీస్ నీళ్ళ తొట్టె లోనుండి బయటకు వచ్చి అరిచాడు, ( వెనకనుండి ముందుకి )(3)
7. బియ్యపు మెతుకు, ఆవగింజ, ఇసక రేణువు, వంటి చిన్న కణము.(3)
8. ఎల్లప్పుడూ ( వెనకనుండి ముందుకి )(2)
11. ఈ రేడియో ధార్మిక లోహ పరమాణు విన్యాసం [Rn] $7s^2$ వెనకనుండి ముందుకి )(4)
12. రోజా రంగు అని అర్థంవచ్చే గ్రీకు పదం పేరు తో Rh సంకేతాన్ని, పేరుని పెట్టుకొన్న మూలకం.(4)
14. ఇది -- గన్నేరు.(గన్నేరు కాదు, బిళ్ళ గన్నేరు కాదు, దేవ గన్నేరు అసలే కాదు, కానీ ఇంగ్లీషులో Rain Tree అంటారు. ఖాళీని నింపు (2)
15. గలనము చేయగా (వడ కట్టగా) వచ్చినది (3)
16. కుక్క – వంకర (2)
19. ఒకే శీర్ష్య ము,భుజము గల రెండు కోణాలు (3)
20. ఆవర్తన పట్టిక లో దీని స్థానం నియోడిమియమ్ కీ సమేరియం కి మధ్యన (5)

**నిలువు**

**1.** వ్యాఘ్రము (3)
2. పలు రంగులలో పూసే ఈ పూలరకాల శాస్త్రీయ నామం ' లిలియమ్' (Lilium) (2)
3. మూడవ పీరియడ్, ఏడవగ్రూపు లోనున్న పరివర్తన మూలకంపేరును యూరప్ లో నున్న రైన్ (Rhine) నది పేరునుండి గ్రహించారు (కిందనుడి పైకి(4)
4. ఇది ఒకరకం తీపి వంటకం పేరు. హిమాచలప్రదేశ్ లోని ఒక పట్టణం పేరు కూడా ఇదే(2)
5. 1789లో క్లప్రాత్ (Martin Heinrich Klaproth) కనుగొన్న ఈ రేడి యోధార్మిక మూలకం (5)
9. చెమ్మగా (3)
10. తడి లేకుండా ఆరబెట్టినవి--- వుంటాయి.(3)
11. ఏడవ పీరియడ్ లో నున్న ఈ మూలకం ఎలక్ట్రాన్ విన్యాసం [Rn] $6d^1 7s^2$ (కిందనుండి పైకి (5)
13. మిథైల్ ఇథిలిన్. (కిందనుండి పైకి(4)
17. ఒక రకపు చిరు ధాన్యము. Sorghum vulgare (2)
18. ఇష్టము (2)
20.భారతదేశపు పదకొండవ రాష్ట్రపతి పేరులోని చివరి మూడు అక్షరాలు (కిందనుండి పైకి (3)

# ఆర్. శర్మ దంతుర్తి

# తెలుగు పద్య రత్నాలు - 6

ఓ సారి వెనక్కి చూసుకుంటే హిరణ్యకశిపుడు ఎందుకిలా అడిగాడో తెలుసుకోవడం కష్టం కాదు. తన తమ్ముణ్ణి నీటిలో వరహావతారం లో వచ్చి చంపాడు శ్రీహరి. ఆయనెక్కడుంటాడో తెలుసుకోవడం అసాధ్యం (తన హృదయంలోనే ఉన్నాడన్న విషయం మర్చిపోయి), ఏ రూపంలో వస్తాడో, ఎప్పుడొస్తాడో తెలియదు. ఏయే ఆయుధాలతో యుద్ధం చేస్తాడో అసలే తెలియదు. అందుకే తనకి తెలిసిన ఎవరివల్లా, ఏయే ప్రదేశాల్లోనూ చావు రాకూడదు అని అడిగాడు.

ఇందులో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఎలా చావకూడదనుకుంటూ అడిగాడో అదే కోరికతో తాను ఎలా చావాలో నిర్ణయించుకున్నాడు హిరణ్యకశిపుడు. అందుకే తాను అడిగిన కోరికతో మనిషీ, జంతువూ కాకుండా, ఇంట్లో, బయటా కాకుండా, ప్రాణం ఉన్నదానితో కానీ, లేనిదానితో కానీ కాకుండా హిరణ్యకశిపుడి కోరిక ప్రకారం నృసింహావతారంతో వాణ్ణి సంహరించాడు శ్రీహరి. మరో విషయం ఏమిటంటే జయవిజయులు మానవజన్మ ఎత్తినప్పుడు వాళ్ళు అడిగినది మూడు జన్మలలో శ్రీహరికి శత్రువులుగా ఉండాలనేది. శత్రువంటే నిరంతరం ఆయన మనసులో మెదుల్తూ ఉంటాడన్నమాట. అలా పక్కలో బల్లెంగా తయారవడానికి అమర్చినవాడే హిరణ్యకశిపుడి కొడుకు ప్రహ్లాదుడు. ఎవరేం చెప్పినా, పాములచేత కరిపించినా శ్రీహరి నామం వదలని స్వంత కొడుకు వల్లే అలా నిరంతరం – తాను ఎంత వద్దనుకున్నా – శ్రీ హరిని స్మరించుకుంటూ ఆయనచేత తాను కోరుకున్న కోరిక ప్రకారం ప్రాణం తీయించుకున్నవాడు హిరణ్యకశిపుడు. ఇదంతా అలా జరగడ్డానిక్కారణం కూడా తన స్వంత కోరిక – అనేక సంవత్సరాలు తీవ్రమైన తపస్సు చేసి మరీ సాధించుకున్నది. అందుకే అంటారు, "ఏదైనా కోరుకునేటపుడు జాగ్రత్త సుమా, నువ్వు అడిగేది నిజంగా అనుగ్రహింపబడవచ్చు" అని. తపస్సు చేసే మహర్షులు చెప్తారు ఈ విషయం గురించే. కోరిక అనేదే మనకున్న దరిద్రం. దేనినీ కోరవద్దు భగవంతుణ్ణి తప్ప. మనం ఏదైతే కోరతామో అదే మనకి చివరకి బాధ కలిగించే విషయం. స్వామి వివేకానంద అంటున్నారు చూడండి – "నువ్వు దొంగవి అవ్వాలనుకుంటే, రాజుగారి ఖజానా కొల్లగొట్టడానికి ప్రయత్నించు. వేటగాడివి అవ్వాలనుకుంటే, ఖడ్గమృగాలని వేటాడ్డానికి ప్రయత్నించు. బిక్షగాళ్లని కొల్లగొట్టడానికీ, చీమలని వేటాడ్డానికీ ఏమీ ప్రయత్నం అవసరంలేదు. అందువల్ల నీకు ఏదైనా కావాలనుకుంటే, ఎవరినైనా ప్రేమించాలనుకుంటే, భగవంతుణ్ణి అడిగి ఆయన్నే ప్రేమించు." అదీ మనం గ్రహించవలసింది; కోరుకునేదెప్పుడూ మనకి బాధ కలిగించేలా ఉండకూడదనుకుంటే ఏమిటి కోరుకునేది? ఏమీ లేదు. అదే సన్యాసం అనే దానికర్థం. మోక్షం మీద కోరికతో అన్నీ త్యజించాక మిగిలే చివరి కోరిక మోక్షం. అది కూడా త్యజించాక వచ్చేది గీతాచార్యుడు చెప్పిన మోక్ష సన్యాస యోగం. అప్పుడు

(39 వ పేజీ చూడండి)

# ఆదూరి హైమవతి



## అసలైన సంపద

దీనికి తగిన ఉపాయం ఆలోచించడం ప్రారంభించింది ఆమె.

'తమ చిన్నతనంలో ,తన-తల్లి ఎప్పుడూ-' ఉన్నదాంట్లో సర్దుకు పోడం '-అనేమాట అంటూండటం, సుశీలమ్మ గారికి గుర్తుకు వచ్చింది.అంతేకాక ఆమె ఎవరి పుట్టినరోజుకు, వారికి బట్టలు కుట్టించి, వచ్చే పుట్టినరోజు వరకూ వారు ఆబట్టలను జాగ్రత్తగా వాడుకోమని చెప్పేవారు. ఇంట్లో ఉన్నవస్తువులు ఏమేంటో, వాటిని ఎంతకాలం ఎలా జాగ్రత్తగా వాడుకో, పదిలంగా ఉంచుకోవాలో కూడా తమకు అర్ధమయ్యేలా చెప్పె అమ్మ మాటలన్నీ ఆమెకు మనస్సులో కదలసాగాయి.

తానింత కాలం అమ్మ మాటలు మరచి, తన బిడ్డడికి తన ఇంటి విషయాలన్ని చెప్పకదాచి ఆ పసిమనస్సుకు తమ ఆర్ధికస్థితి గురించిన, అసలు విషయం తెలియజేయనందుకు సుశీలమ్మగారెంతో బాధపడి, ఆరాత్రంతా తన తల్లిని స్మరిస్తూ, తనకో దారి చూపమని భగవంతునితో పాటుగా తల్లిని కూడా ప్రార్ధిస్తూ గడిపారామె.

ఆరాత్రి కలలో ఆమెకు ఆమెతల్లి కనిపించి ఆశీర్వచనాలు అందించారు. చిన్నతనంలో తమకు చెప్పిన కథలు అనేకం సుశీలమ్మగారికి కలలో ఆమె తల్లిని చూడగానే గుర్తుకు వచ్చాయి. ఎంతో ఉత్సాహంగా ఆమె నిద్రలేచి తన నిత్య కృత్యాలలో మునిగిపోయారు.

సంపత్ నిద్రలేచి, తన పనులన్నీ ముగించుకుని అమ్మ పెట్టిన మజ్జిగ అన్నంతిని, మధ్యాహ్న భోజనానికి చపాతీలు బాక్సులో తీసుకుని అమ్మను స్కూలులో టూరు కోసం కట్టవలసిన సొమ్ము గురించీ అడిగాడు.

సుశీలమ్మ గారు నవ్వుతూ "సంపత్! ఈరోజు సాయంకాలం నీకు సొమ్ము ఇచ్చే ప్రయత్నం చేస్తాము. నీవు సంతోషంగా స్కూలుకు వెళ్ళిరా!" అని చెప్పారు. సంపత్, స్కూల్ కెళ్ళి సాయంకాలం, తిరిగి వచ్చి "అమ్మా! అమ్మా! సొమ్ము తీసి ఉంచావా?" అని అడిగాడు.

ఆమె "సొమ్ము ఇంకా అందలేదురా! చూద్దాం రేపటికి అందుతుందేమో --" అని చెప్పారు.

మరునాడు ఉదయాన్నే సంపత్ తిరిగి తల్లిని డబ్బుగురించీ అడిగాడు.

ఆమె "సంపత్ ! నాన్నగారి జీతం ఈ నెల మన ఖర్చులకే సరిపోదు. ఐతే నాన్నగారి ఆఫీసులో ఒకరిని కొంత డబ్బు అప్పుగా ఇవ్వమని అడిగారుట. ఆడబ్బు సమకూరితే రేపు నీకు సొమ్ము సర్దుతాము." అని తల్లి చెప్పిన మాటలతో, సంపత్ విసుగ్గా ముఖం పెట్టుకు వెళ్ళాడు.

మరునాడు సంపత్ మళ్ళీ డబ్బు ప్రస్తావన తేగా, "సంపత్ ! సొమ్ము అందలేదురా!" అనిచెప్పారు ఆమె.

"అమ్మా!అందరూ డబ్బుకడుతున్నారు. నేనే వెనుక బడిపోతున్నాను అందరూ నన్ను చూసి నవ్వుతున్నారు. కొందరైతే 'డబ్బులేని సంపత్ --సొమ్ము లేని సంపత్ --' అని వెక్కిరిస్తున్నారు. ఏమి చేయను? నాకు చాలా ఏడుపు వస్తున్నది" అని సంపత్ బాధపడుతుంటే, తనకూ బాధ కలిగినా,

బయటికి కనిపించనీయక సు-శీలమ్మగారు నవ్వుతూ "సంపత్! సంపద అంటే 'డబ్బే' అనేవారికి సంపద గురించి అసలేమీ తె-లీదనుకోవాలి.'సంపద' అంటే 'గుణ సంపద, శీలసంపద, వి-ద్యాసంపద, ఆరోగ్య సంపద, ఏ అవిటి తనంలేని, లోపంలేని, సంపూర్ణ అవయవ సంపద 'ఈ విషయాలు మీ స్నేహితులందరి-కీ చెప్పు. వారికి సంపద గురించి ఏమీ తెలీనట్లుంది" అని తల్లి చెప్ప గానే ,

"మా తరగతిలో ఒక పిల్లవా-నికి ఒకే కన్ను ఉంది, వాడిని అందరూ ' శుక్రాచార్య 'డని పిలు స్తుంటారు. మరొకడికి చెముడు. వాడిని అందరూ -' శబ్ధభేదు'డని అంటుంటారు. మాక్లాస్ లో ఒకడు చాలా అందంగా ఎర్రగా ఉంటాడు. వాడిని అందరూ 'రాకుమారు'డని అంటుంటారు. వాడి అసలు పేరే అందరూ మరచి పోయారు " అని చెపుతు-న్న సంపత్ తో --

"అలా అవిటి పిల్లల్ని ఎగతాళి చేయడం ఎంత తప్పు! మీ స్కూల్ మాస్టర్లకు ఎవ్వరూ చెప్పలేదా? " అని అడిగింది సుశీలమ్మగారు.

"లేదమ్మా! వాళ్ళెవ్వరూ మా మాస్ట-ర్లముందు ఏమీ అనరు. చాటుగా అంటుంటారు. ఎవ్వరూ మా మాస్టర్లకు చెప్పరు. ఎందుకంటే ఆ 'రాకుమారు'డని పిలిచేవాడు చాలా బలవంతుడు. వాడు మా-స్టర్లకు ఎవరైనా చెపితే వాళ్ళను తంతాడని అందరికీ భయం." అని తల్లికి చెప్పాడు సంపత్ .

సుశీలమ్మగారు "సంపత్ ! నీవో-పనిచేయి. అతనితో స్నేహంగానే ఉంటూ మంచిగా మాట్లాడుతూ అతనికి అర్ధమయ్యేలా తెలియ-చెప్పడం స్నేహితునిగా నీ బాధ్యత" అని ఆమె సంపత్ కు అతనితో ఎలా మెలగాలో తెలియచెప్పింది. దీనివల్ల తన బిడ్డకూ తమ ఆర్థిక పరిస్థితి గురించీ బాగా తెలియ చెప్ప వచ్చని ఆమె భావించింది.

సంపత్ తల్లి చెప్పిన విధంగా ఆ 'రాజకుమార్' అని అందరూ పిలిచే ఆ పిల్లవానితో చాలాస్నేహంగా మెలగసాగాడు. రాజకుమార్ కూడా సంపత్ తో మంచి గా ఉండసాగాడు.

ఒకరోజున అందరూ లంచ్ చే-సేసమయంలో, రాజకుమార్ "సంపత్ ! ఈ శుక్రాచార్యునికి రెండోకన్ను వస్తే ఎలా ఉంటుం-దంటావ్? అప్పుడు వీడిని మనం ఏమని పిలవాలి? "అన్నాడు.

సంపత్ కు చాలా బాధకలిగిం-ది. 'తనతోటి పిల్లవాడ్ని అలా బాధించడం, అవయవ లోపం పేర పిలవడం తగనిపని. అమ్మ చెప్పినట్లు చేసి ఈ రాజకుమార్ కు తెలియజేసి, మంచిగా మార్చడం స్నేహితునిగా తన బాధ్యత'అని ఆలోచించాడు సంపత్.

"రాజ్ కుమార్! ఈ రోజు మన తెలుగు టీచర్ గారు 'దధీచి'కథ చెప్పారు గదా! ఆమహానుభావు-డు అందరికోసం తనప్రాణాలనే అర్పించి తన వెన్నెముకతో ఇం-ద్రునికి వజ్రాయుధం చేసుకుని దుష్టులను సంహరించను సహకరించిన త్యాగి అనీ , ఇత-రులకోసం, ముఖ్యంగా స్నేహి-తులు, బంధువులు, దీనుల కోసం, అసహాయులకోసం సేవ-చేసేవారు గొప్పపేరుతో పాటుగా దైవ కృపకు పాత్రులౌతారని ' మన టీచర్ గారు ఎంతో బాగా చెప్పారు. అప్పుడు నాకేమని-పించిందంటే, మనం ఎవరికైనా మన అవయవాలను దానం చేస్తే ఎంతోమంచిపేరు వస్తుంది కదా అని. మన క్లాస్ లో ఉంటున్న ఈ ఒకే కన్ను ఉన్న వానికి మనలో ఒకరం ఓ కన్ను దానంచేస్తే మనకెంత మంచి కీర్తి వస్తుందో గదా! ఏమంటావు రాజ్ కుమార్?" అన్నాడు లంచ్ చేస్తున్న తన స్నే-హితునితో నిదానంగా సంపత్.

పిల్లలందరూ సంపత్ మాటలకు ఆశ్చర్యపోయారు.

రాజకుమార్ ఆశ్చర్యం-గా "సంపత్ ! ఏమంటున్నావు నీవు? మనలో ఒకరం మన ఒక కన్నును వాడికి దానం చేయా-లంటావా? దానివల్ల మనం ఎంత అసహ్యంగా కనిపిస్తామో ఒక్క-సారి ఆలోచించావా? - అపుడు మనల్ని ఇతరులు 'శుక్రాచార్యుడ' ని పిలవరూ!" అన్నాడు .

"రాజకుమార్ !మనం చేసేది సేవ ఐనపుడు ఎవరు ఎలా పిలి-స్తేమనకేం? పైగా నీవంటి వాడిని

ఎవరు అంత ధైర్యంగా' నిక్ నేమ్' తో పిలువగలరు చెప్పు!" అన్నాడు సంపత్.

"అదేమోరా! పైగా ఆకాలంలో గనుక 'ధధీచి' అనే ముని తన ప్రాణాలు విడచి వెన్నెముక ఇచ్చాడు. పేరూ వచ్చింది.ఈ కాలంలో ఎవర్రా! ఆదాయం లేకుండా ఊరికే దానధర్మాలుచేసేది, పైగా శరీర అవయవాలు!!"

"అన్నట్లు చెప్పడం మరచాను మన మాటల్లోపడి, మానాన్నగారి ఆఫీసులో ఒకరికి, చాలా ధన వంతులుట, వారిపిల్లవానికి రెండు కళ్ళూ లేవుట. ఎవరైనా ఒక్క కన్ను దానంచేస్తే రెండులక్షలు ఇస్తారుట మీకు తెల్సిన వారెవరైనా ఉంటే చెప్పమని చెప్పారుట. మానాన్నగారితో. ఏం! రాజ్ కుమార్! మనలో ఎవరైనా సరే ఒకన్ను దానంచేద్దామా! రెండులక్షలూ వస్తాయి. మంచిపేరూ వస్తుంది.' ఏమంటారు?.." అన్నాడు సంపత్.

" డబ్బు కోసమని మన అందం పోగొట్టుకుంటామా! నీ మాటలు చాలా చిత్రంగా ఉన్నాయి." అన్నారు స్నేహితులు.

" మరైతే మా అమ్మగారు రోజూ వెళ్ళే వేంకటేశ్వరస్వామి గుడిలో ఓ భక్తురాలు ప్రతిరోజూ స్వామి వారిని 'స్వామీ! మా బిడ్డకు ఎవరైనా ఓ కిడ్నీ దానంచేస్తే దానికి బదులుగా ఐదు లక్షలు ఇస్తాము' అని వేడుకోడం విన్నదిట! పోనీ మనమెవరమైనా ఒకిడ్నీ ఇస్తే దానికి బదులుగా మనకు ఐదు లక్షలు వస్తాయి కదా? పైగా కన్నులా కిడ్నీ పైకి కంపించేది కాదు గనుక, మన అందం ఏమీ చెడదు, మనల్ని ఎవ్వరూ ఏమీ ఎగతాళి చేయలేరు" అన్నాడు సంపత్.

వెంటనే పిల్లలంతా " ఏంటి సంపత్! ఇలా చెప్తున్నావు? కిడ్నీ ఇచ్చేస్తే, ఎంత ప్రమాదం? ఉన్న ఆ ఒక్క కిడ్నీఎప్పుడైనా చెడిపోతే మన గతేంటి? మనం చిన్న పిల్లలం, మన జీవితం ఎంతో ఉంది, మనం పెరిగి పెద్దయ్యి, ఉద్యోగాలు చేసి మన అమ్మ నాన్నల్ని పోషించాలి గదా? మరి కోరి అంగవైకల్యం తెచ్చుకుంటామా, చెప్పు?" అన్నారు.

"చాలా డబ్బువస్తుంది కదా! ఆ డబ్బుతో మనం హాయిగా జీవించవచ్చు గదా! ఇహచదువులు, ఉద్యోగాలు చేయవలసిన పనిమనకు ఉండదు. పైగా ఎంత మంచి పేరు! టి.వి.చానల్స్ లోనూ, వార్తా పత్రికల్లోనూ అంతా మనగురించే, మన ఫొటోలు పడతాయి, మనకు ఎంతోమంది సన్మానాలు చేస్తారు, అబ్బో ఎంత బావుంటుందో, ఊహించుకుంటుంటేనే ఎంతో సంతోషంగా ఉంది సుమా!" అని అందరి వంకా చూశాడు సంపత్.

"చూడు సంపత్! వాటన్నింటి వల్లా కలిగే సంతోషంకంటే, మన ఆరోగ్యం మనకు ముఖ్యం కదా! పైగా మనం ఇంత చిన్న తనంలోనే అంత డబ్బు సంపాదించాల్సిన అవసరమేంటి? మన అమ్మ నాన్నలు మనకు కావల్సినవన్నీ సమకూరుస్తూనే ఉన్నారుకదా! " అన్నాడు రాజకుమార్ .

" అదిసరే రాజకుమార్ ! మనం అందరిలో గొప్ప అనిపించుకోడం ఎంతో క్రేజీగా ఉండదూ!, చూడూ నిన్నందరమూ నీ అసలుపేరే మరచిపోయి 'రాజకుమార్' అనిపిలుస్తుంటే నీకెంత క్రేజ్ గా ఉంటున్నదో! అలాగే నీవంటి అందగాడు, బలమైనవాడు, చిన్నవాడు, ఒక పిల్లవాని ప్రాణం నిలపను, కిడ్నీ దానంచేస్తే, డబ్బు తీసుకోడం వేరేమాటనుకో, అందరూ నిన్నెంత పొగుడు తారో ఆలోచించు" అని చెప్పాడు సంపత్.

"సంపత్! ఆరోగ్యమే మహాభాగ్యమని మన టీచర్స్ చెప్తుంటారు కదా!ఆరోగ్యం లేని డబ్బెందుకురా!" అన్నాడు రాజకుమార్.

"కానీ ఎంతమంచి పేరు వస్తుందో, ఎంతకీర్తి వస్తుందో అది ఆలోచించు, మనం దేనికీ అమ్మానాన్నల్ని డబ్బు అడగక్కర్లేదు. ఎన్ని టూర్లకైనా వెళ్ళవచ్చు. ఎంత డబ్బయినా ఖర్చు చేయవచ్చు" అన్నాడు సంపత్.

"లేదురా! అలాంటి పని మేంచేయలేం. నీవూ అలాంటి ఆలోచనలు మానేయి..."

అన్నారు స్నేహితులు.

" మరి మనం మన అవయవాలను దానంచేసి, డబ్బు వస్తున్నా వద్దను కుంటున్నామే, దేవుడే పుట్టుకతోనే, కొందరికి కొన్ని అవయవాల లోపంతో పుట్టిస్తే వారిని మనం నిక్ నేంస్ పెట్టి పిలుస్తుంటే, వారెంత బాధపడతారో ఎప్పుడైనా మనం ఆలోచించామా? పాపం అలా పుట్టడం వారితప్పు కాదుకదా?" అన్నాడు సంపత్ .

అందరినీ, ముఖ్యంగా రాజకుమార్ ని చూస్తూ. రాజ్ కుమార్ తో పాటుగా, స్నేహి తులంతా. ఒక్క నిముషం ఆలోచించి,"ఔనురా! పాపం ఇంత కాలం మనం ఎందరినో సరదాకు నిక్ నేంస్ పెట్టి పిలుస్తూ అల్లరిపెట్టామే తప్ప వారెంతబాధ పడుతున్నారో ఆలోచించలేకపోయాం.ఇహనుంచీ మనం ఎవ్వర్నీ ఎలాంటి పేర్లతోనూ అలా పిలువకూడదు.వారి అసలు పేర్లతోనే పిలుద్దాం. ఎవరైనా అలా పిలిస్తే, వాళ్ళ పని నేను పడతాను. జాగ్రత్త ..!" అన్నాడు ఉద్రేకంగా రాజకుమార్.

సైన్స్ టీచరుగారు "పిల్లలూ!మనటూర్ కాన్సిలైంది. మీ డబ్బంతా తిరిగి వచ్చితీసు కెళ్ళండి. ఎందుకంటే సమయం తక్కువగా ఉంది. పెద్దపరీక్షలు వచ్చేస్తున్నాయి. వచ్చే సంవత్సరం వెళదాము. మీరంతాడబ్బు దాచుకోండి, మీ ఇళ్ళలో మీ కిడ్డీ బ్యాంకులలో " అని సైన్స్ టీచరు గారు ఎవరి డబ్బు వారికి ఇచ్చేశారు.

ఇంటి కెళ్ళి అన్ని విషయాలూ అమ్మకు చెప్పగానే సుశీలమ్మగారు తలభారందిగి, గండం గట్టెక్కినందు కెంతో సంతోషించి, దేవునికి మనస్సులోనే కృతజ్ఞతలుచెప్పుకుని, ఆరోజు నుండే తమ ఆర్థిక పరిస్థితి పిల్లవానికి తెలియపరచ నిర్ణయించుకున్నారామె.

పిల్లలకు తమ ఆర్థిక పరిస్థితిని తప్పక తెలియజేసి, లేనిపోని రాజసాలకు పోకుండా వారిని చిన్నతనం నుండే ఒద్దికగా పెంచడం తల్లిదండ్రుల బాధ్యత.

(35 వ పేజీ తరువాయి)

# తెలుగు పద్య రత్నాలు - 6

కలిగేది – అత్మానుభవం. మానవ జన్మ దీని కోసమే అంటూ స్వామి వివేకానంద రామకృష్ణా మఠం స్థాపిస్తూ చెప్పిన మాట – "ఆత్మనో మోక్షార్థం, జగత్ హితాయచ."

క్రితం నెల వ్యాసంలో చెప్పినట్టూ విష్ణుకథలు కల్యాణాత్మకాలు. ఎన్నిసార్లు చదివినదే చదివినా ఎప్పటికప్పుడు కొత్తగా ఉండడానిక్కారణం – భగవత్విభూతి. ఆ విభూతి మహాసముద్రం వంటిది కనక పూర్తిగా తెలుసుకోవడం ఎప్పటికీ ఎవరికైనా కానీ అసాధ్యం. మనకి చేయగలిగినది ఏమిటంటే, మనకున్నంతలో మనం కూడా తెచ్చుకున్న పాత్రతో (ఈ శరీరం) ఆ సముద్రం నీళ్ళని అందినంతమేర పట్టుకోవడం.

# నందుల ప్రభాకర శాస్త్రి



## మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

పెద్దసుబ్బరాయుడు చనిపోవటంతో, ఆయన భార్య సుబ్బమ్మ విధవరాలవటం, నందులవారి ఆస్తిలో సగభాగం, ఇంట్లో సగభాగం పంచుకుని కాపురం వుండటం, అవసరమైనప్పుడు వదినకు తెలియకుండా, గోడ దూకి తమకు కావాల్సిన వస్తువు తెచ్చుకోవటంతో ఆమెకు అభద్రత ఏర్పడటం, దాయాది మత్సరం భారతదేశంలో స్వతః సిద్ధంగా వుండటం. దీనిని ఆసరా చేసుకుని రాయిపెద్ది చిన్న వెంకటరమణయ్య సుబ్బమ్మను నమ్మించి ఆమె ఊరికి పోయేటప్పుడు ఆమె దస్తావేజులు అన్నీ రాయిపెద్దివారి ఇంట్లో వుంచి వెళ్ళటం జరిగేది.

ఇక భౌతిక దాడులతో ఉపయోగం లేదని ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతీయాలని నందుల పెద్దసుబ్బరాయుడి ఆస్తిలో సగం ఆయనకు సంబంధం వున్న స్త్రీకి రాయించినట్లు దస్తావేజులు సృష్టించి ఆ స్త్రీ ద్వారా కోర్టు మెట్లు ఎక్కించారు రాయిపెద్దివారు. ఈ కోర్టు గొడవలు పడలేక నందుల సుబ్బమ్మ తన ఆస్తిని మొత్తాన్ని పదిహేను వందలకు రసాయిపేట రెడ్డిగారికి రాసి ఇచ్చేసింది. వారైతే రాయిపెద్దివారితో పోరాడతారని. ఈ విషయం తెలుసుకున్న నందుల సుబ్బయ్య పదహారు వందల రూపాయిలిచ్చి రసాయిపేట రెడ్డి గారి నుండి తిరిగి రాయించుకొచ్చి, తనే ప్రత్యర్థిగా నిలబడి కోర్టు పర్వం కొనసాగించాడు.

అలా రెండు దశాబ్దాలకాలం కోర్టు చుట్టూ తిరిగి, మదరాసు హైకోర్టు వరకు ప్రయాణం చేసి అలిసిపోయి రాజీ కుదుర్చుకున్నారు ఇరుపక్షాలవారు.

నందుల సుబ్బయ్యగారు చనిపోయిన తరువాత రాయిపెద్ది వెంకటరమణయ్య చెప్పిన చివరిమాట "ఇన్నిరోజులూ నేను ఒక పులితో పోరాడినాన్న తృప్తి మిగిలింది. అయితే చెరి ఏడువేల రూపాయలు పోగొట్టుకున్నాం. కేవలం పట్టుదలలకోసం". ఆనాడు స్వాతంత్ర్యం రాకమునుపు అంటే రాణి రూపాయల నుండి ప్రారంభించి పదివేల రూపాయలు అంటే ఒక్కొక్క రూపాయి ఒక తులం బంగారుతో చేసేవారు. అలాంటి ఏడువేల తులాల బంగారు పోగొట్టుకుని పోషించుకుంది తమ అహం, పెద్దరికం.

### సాహిత్యం

ఆ చుట్టుపక్క పది ఊర్లలో సాహిత్యానికి మా ఊరు పెట్టింది పేరు. సాహితీవేత్తలు, సాహిత్యాభిలాషులు మెండుగా వుండేవారు. తీరిక చిక్కినప్పుడల్లా సాహితీ గోష్టి నడుస్తూ వుండేది.

(ఇంకా ఉంది)



# హాస్యపు జల్లు - అల్లు

## పోడూరి శ్రీనివాసరావు



(గత సంచిక తరువాయి)

ఇవేగాక 1980 దశాబ్దంలో శ్రీ అల్లు రామలింగయ్య, సహనటులు, కారె క్టర్ ఆర్టిస్టులు, ప్రతినాయకులుగా పేరుగాంచిన శ్రీ రావు గోపాలరావు, శ్రీ నాగభూషణం గార్లతో అనేక చిత్రాలలో నటించారు. శ్రీ అల్లు డైలాగ్ డెలివరీ, వారి డైలాగ్ టైమింగ్, ప్రాంతీయత (nativity), మాట యాస..... వారి నటనా జీవితంలో గొప్ప దశకు తీసుకువెళ్ళి, వారి నటనా కౌశలానికి అసంఖ్యాక అభిమానుల్ని సంపాదించిపెట్టింది.

శ్రీ అల్లు ఒక్క సినీ నటుడే కాదు, మంచి పేరు సంపాదించుకున్న హోమియోపతి వైద్యుడు కూడా. స్వాతంత్ర్య సమరయోధుడు. వారి జ్ఞాపకార్థం రాజమహేంద్రవరంలో 'శ్రీ అల్లు రామలింగయ్య హోమియోపతి కళాశాల' స్థాపించబడింది. క్విట్ ఇండియా ఉద్యమంలో శ్రీ అల్లు జైలు శిక్ష కూడా అనుభవించారు.

చలచిత్ర పరిశ్రమకు రాక ముందు, శ్రీ అల్లు ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కొన్ని నాటకాల్లో నటించారు. నృత్యకళా మండలి వారిచే 'హాస్య కళా ప్రపూర్ణ' బిరుదుతో గౌరవించబడ్డారు.

1970 లో పద్మశ్రీ అవార్డ్ పొందిన ప్రసిద్ధ హాస్యనటుడు రేలంగి తర్వాత, పద్మశ్రీ పురస్కారం పొందిన హాస్యనటుడు శ్రీ అల్లు రామలింగయ్యే(1990 లో).

తన నటనతో ప్రత్యేక స్థానం, ప్రేక్షకుల గుండెల్లో సంపాదించుకున్న శ్రీ అల్లు రామలింగయ్య అమరజీవి. తనదైన హాస్యంతో ఎప్పుడూ తెలుగు చలన చిత్రసీమ ఉన్నంతకాలం, ప్రత్యేక స్థానంలో అజరామరంగా ఉంటూనే ఉంటారు.

శ్రీ రామలింగయ్య కాంస్య విగ్రహం విశాఖపట్నం లోని రామకృ ష్ణా బీచ్ లో, వారి జన్మ స్థలమైన పాల కొల్లులో వారి స్మృత్యర్థం ప్రతిష్ఠించడం జరిగింది.

1999 లో ఫిల్మ్ ఫేర్ దక్షిణ భారత జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు శ్రీ అల్లు రామలింగయ్య.

వారి సతీమణి శ్రీమతి కనక రత్న మ్ గారు. వీరికి అయిదుగురు సంతానం. అందులో ప్రముఖుడు అల్లు అరవింద్. అనేక దిగ్విజయ చిత్రాల సమర్పకుడిగా, చిత్ర నిర్మాతగా, ప్రసిద్ధ హీరోలు అల్లు అర్జున్, శిరీష్ లకు తండ్రిగా, నటుడిగా, అల్లు అరవింద్ తెలుగు చలనచిత్ర ప్రేక్షకులకు సుపరిచితుడే. ప్రసిద్ధ నటుడు, మెగా స్టార్ చిరంజీవి అల్లు గారి అల్లు డే.

చిరంజీవి ఆధ్వర్యంలో నడిచే 'చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్', 'చిరంజీవి బ్లడ్ బ్యాంక్' లకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, తన సహాయ సహకారాలందించేవారు శ్రీ అల్లు రామలింగయ్య. తన మరణానంతరం తన కళ్ళను 'చిరంజీవి ఐ బ్యాంక్' కు దానం ఇచ్చిన ధన్యజీవి శ్రీ అల్లు.

వీరి గౌరవార్థం పోస్టల్ శాఖ 2013 లో ఒక పోస్టల్ స్టాంప్ ను విడుదల చేశారు.

తెలుగు చలన చిత్రసీమలో హాస్యం ఉన్నంతకాలం శ్రీ అల్లు రామలింగయ్య పేరు దశదిశలా మారుమ్రోగి పోతూనేవుంటుంది. ముఖ్యంగా 'ముత్యాలముగ్గు' చిత్రంలో కోతి కరిచిన పిమ్మట కోతిని అనుకరిస్తూ ఆయన నటన-న భూతో న భవిష్యతి. మరెవ్వరికీ అది సాధ్యం కాదు.

# మలుపులు

## ఎలెక్ట్రాన్



నీ కూతుర్ని చదివించి పెద్దచేసే ఓపిక నాదగ్గర లేదు! నీ కూతురు బాగోగుల్ని చూసుకోడానికి నీ అన్న దగ్గరున్న మీ అమ్మని తిరిగి తెచ్చుకో!" అని ఖరాఖండీగా చెప్పేసింది. భార్యతో కనక గొడవ పెట్టుకొంటే, తొందరపడి రెండో పెళ్లి చేసుకొన్నతన్నే నలుగురూ నిందిస్తారన్న భయంతో చంద్రన్న గమ్మునుండిపోయాడు.

రుద్ర స్కూలు మానేసి ఇంటిపట్టునే ఉండిపోయి ఆ చిన్న వయసులోనే ఇంటిపనుల్లో, వంటపనుల్లో మునిగిపోయి తండ్రికి మాటరాకుండా ఉండిపోయింది. ఉన్నట్టుండి ఓ రోజున రుద్ర మాయమైపోయింది. పోలీసులు రంగంలోకి దిగి ఆచూకీలు తీయడం ప్రారంభించారు. తనంతే యిష్టం లేకనే రుద్ర పారిపోయిందని, ముత్యాలు నమ్మబలికింది. రుద్ర ఏడాది పాపగా ఉన్న వయసులో ఆమెను ఎత్తుకొని చంద్రన్న దంపతులు అమ్మవారి ఉత్సవంలో ఓ ఫోటో తీయించుకొన్నారు. పోలీసులకి ఆ ఫోటో తప్ప వేరు ఆధారం లేదు. పట్నం నుంచి ఓ పోలీసు ఆర్టిస్టు వచ్చి రుద్ర రూపురేఖలు చంద్రన్న వద్ద తెలుసుకొని ఓ చిత్రం గీశాడు. ఇరుగు పొరుగులు రుద్ర అలాగే ఉంటుందని నిర్ధారణ చేశారు. పోలీసులు ఆ చిత్రానికి ఫోటోలు తీసి నలుచెరగులా పంపించారు. వెంటనే ఏ ఆచూకీ దొరకలేదు. వాస్తవానికి మారుటి తల్లి ముత్యాలు రుద్రని రహస్యంగా దళారులకి అమ్మి వేసింది.

రుద్రకి మెలుకువ వచ్చేసరికి తన మొహంలోకి ఓ నడివయసు స్త్రీ చూస్తూ ఉండడం గమనించింది. చిరునవ్వు నవ్వుతూ, నుదుటన ముద్దాడి, ముందస్తుగా ఓ గ్లాసుతో పాలిచ్చి తాగించింది. ఆ తర్వాత సౌమ్యంగా బుజ్జగిస్తూ మాట్లాడింది.

"నిన్నెవరో కృష్ణపట్నం నుంచి మహానగరం వచ్చే బస్సులో వదిలేసి వెళ్ళిపోయారు. కృష్ణపట్నం దగ్గర్లోనే ఉన్న చింతలూరు గ్రామంలో మా అన్న కూతురుకి పెళ్లి జరిగింది. దానికి వచ్చి నేనూ, మా ఆయనా అదే బస్సులో ఎక్కాం. తెల్లవారు ఝామున ఆఖర్నబస్సు దిగిన మాకు నువ్వు నిద్రపోతూ కనబడ్డావు. ఎంత కుదిపి లేపినా లేవలేదు. మేము నిన్ను ఎత్తుకొని, ఆటోలో మాయింటికి తీసుకువచ్చేశాము. ఎవరి తాలూకో చెబ్తే అక్కడికి తీసుకు వెళ్ళి అప్పచెబుతాం."

రుద్రకి అనుమానం వేసింది. ఏం జరిగిందీ తనకి లీలగా గుర్తుంది. అయినా నిలదొక్కుకొని సమాధానం చెప్పింది. "మా ఊరు క్రిష్ణపట్నం. మా నాన్నపేరు చంద్రన్న. ఓ కార్ఖానాలో పనిచేస్తాడు. సాయంత్రం అమ్మవారి గుడిబయట ఎవరో ప్రసాదం తినిపించారు. తర్వాత ఏమైందో నాకు తెలియదు."

"నువ్వు ఈ పొద్దున మాకు దొరికినప్పట్నుంచి నిద్రలోనే ఉన్నావు. నిద్దట్లోనే రెండు సార్లు పాలు తాగించాను. మధ్యాహ్నం ఇప్పుడే నీకు మెలుకువ వచ్చింది. బాబాయ్ బట్టలమిల్లులో పని చేస్తారు. రాగానే డ్యూటీకి వెళ్లారు. రాత్రికి తిరిగి వస్తారు. వీలు చూసుకొని మీ ఊరు తీసుకు వెళ్ళి మీ అమ్మానాన్నలకి అప్పగించేస్తారు. అంతవరకూ బెంగపెట్టుకోకుండా ఉండు. బాగా ఆకలిగా ఉన్నట్టున్నావు. అన్నం తిని మరి కాస్సేపు పడుకొని, సాయంత్రం మీ ఇంటి కబుర్లు చెబుదువుగాని," అందామె.

రుద్ర తలాడించింది. ఆమె పెట్టిన భోజనం తిని, తలదిమ్ము ఇంకా పూర్తిగా తగ్గకపోవడంతో సాయంత్రం వరకూ పడుకొని లేచింది. ఆమె రుద్రని మాటల్లో

పెట్టి మరిన్ని వివరాలు తెలుసుకోంది. "అంటే నీ సవితల్లికి నువ్వంటే ఇష్టం లేదన్నమాట. అలాంటి చోటుకి తిరిగి వెళ్ళడం ఎందుకు? ఇక్కడే ఉండిపో. ఎవరింట్లోనైనా పనికి కుదురుస్తాను!" రుద్ర వెంటనే సమాధానమివ్వలేదు. నాన్నకొత్తమ్మ మోజులో ఇదివరకట్లా తన్ను లాలించడు. తను తిరిగి వెళ్ళినా కొత్తమ్మ తన్ను రాచి రంపాన పెడ్తుంది. ఈమె చూస్తే జాలిగా మాట్లాడుతోంది. ఒకటి రెండుసార్లు స్నేహితురాలింట్లో చింత పిక్కలతో వామన గుంటలాడుతూ సమయం మరిచి, కాస్త చీకటి పడ్డతర్వాత ఇల్లు చేరితే -దుర్మార్గులు ఆడపిల్లల్ని ఎత్తుకుపోయి అమ్మేస్తారనీ, అటూ ఇటూ తిరక్క స్కూలయిపోయిన తర్వాత తిన్నగా ఇంటికి వచ్చేయమనీ, కన్నతల్లి మందలించింది. తర్వాత తల్లిదండ్రులతో చూసిన ఓ సినీమాలో కూడా అలాగే జరగడం గుర్తుకొచ్చింది. ఈమె వాలకం చూస్తే అలాంటి మనిషిలా కనుపించకపోయినా లోపల గుబులుగానే ఉంది. అయినా తను భయపడినట్టు కనబడకూడదు.

"ఆంటీ!నాకు ఇంటి పనులు చెయ్యడం అలవాటే! ఎవరింట్లోనైనా పనికి కుదర్చండి. నమ్మకంగా పని చేస్తాను." అంది నెమ్మదిగా.

ఆమె మొహంలో అనుకోకుండానే ఆనంద రేఖలు వెల్లి విరిసాయి. "నన్ను మణీ ఆంటీ అని పిలు. నీ కొత్తమ్మ మాట అటుంచుకాని, మీ నాన్నకి మట్టుకు బాగా బుద్ధిరావాలి. అయితే ఇక్కడ ఇళ్లలో చాకిరీ చెయ్యాలంటే పోలీసు స్టేషన్లో ముందస్తుగా పేర్లు, ఫోటోలతో సహా దరఖాస్తు చేసుకొని అనుమతి పత్రం తీసుకోవాలి. నీ వయసు చిన్న పిల్లలు పని చెయ్యడానికి వారు సమ్మతించరు. ఎవరింట్లోనైనా ఒకరిలా కలిసిపోయి ఉంటే ఇబ్బంది ఉండదు. నేను ఒక పెద్ద కాలనీలో నాలుగిళ్ళలో పనిచేస్తాను. ఎవరైనా మంచి కుటుంబం వాళ్ళకి అవసరముందేమో కనుక్కొని కుదురుస్తాలే! మా అన్నకూతురు పెళ్లికోసమని మూడు రోజులు సెలవు తీసుకొని మీ ఊరువైపు వచ్చాము. రేపట్నుంచీ పనులకు పోకపోతే అందరూ రంకెలు వేస్తారు! రేపు ఉదయమే నాతో కూడా రా, చూద్దువుగాని." అంది.

"అంకుల్.......... ?"రుద్ర ప్రశ్నార్థకంగా ఆగి పోయింది.

"ఆయన పేరు సోమరాజు. అంకుల్ డ్యూటీకి వెళ్లారు కదా? రాత్రికి వస్తారు. అప్పటికి నువ్వు మెలుకువగా ఉంటే పలకరిద్దువుగాని."

రాత్రి పదింటికి సోమరాజు తిరిగివచ్చాడు. మనిషి గుండ్రంగా, నున్నగా ఉన్నాడు. రుద్రని దగ్గరగా తీసుకొని పలకరించాడు. రుద్ర ఇంటికి వెళ్లడానికి ఇష్టపడటల్లేదని మణి చెప్పింది.

"సరేలే! ఎప్పుడు బెంగ పెట్టుకొంటే అప్పుడే తీసుకు వెళ్ళి దిగపెట్టేస్తాను," అంటూ సోమరాజు పక్క గదిలోకి పోయాడు.

రుద్ర మర్నాడు ఉదయమే లేచి, మణి వెంట సిటీ బస్సులో కాలనీకి పోయింది. మహానగరం సినిమాల్లో చూపించినట్లుగానే ఉంది. రుద్ర మణితో బాటు కాలనీలో నలుగురిళ్ళకి వెళ్ళి ఇంటిపనుల్లో సాయం చేసింది. మొదటి ఇంటావిడ టీ ఇచ్చింది. ఇతరులు ఏవో ఫలహారాలు పెట్టారు. మణి ఫలహారాల్ని, ఇద్దరిచ్చిన అన్నాన్ని ఓ మూడు ప్లాస్టిక్ డబ్బాల్లో ఉంచి సంచిలో భద్రపరిచింది. మణి రుద్రని తన పెత్తల్లి మనవరాలిగా చెప్పి, ఎవరింట్లోనైనా పనికి చెప్పమని అందర్నీ అడిగింది. కనుక్కొని చెబ్తామన్నారు.

మూడో యింట్లోని నందిని, "రామాయగూడలో రామలింగం గారని ఓ రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసరుగారి ఫ్లాట్ కి నిన్ను అయిదారు నెలలక్రితం తీసుకు వెళ్ళాను గుర్తుందా? ఆరోజున అమెరికానుంచి వచ్చిన మనవరాలి పుట్టిన రోజు పండగలో నువ్వు పని సహాయం చేశావు. ఆయనకీ, ఆవిడకీ వయసు అరవై అయిదులు దాటాయ్. తమతో కూడా సహాయంగా ఉండే పిల్ల నెవర్నైనా చూడమంటున్నారు. నేను వాళ్ళకి ఫోన్ చేస్తాను. వెళ్ళి వెంటనే కలుసుకో! యిల్లు గుర్తుందిగా? అడ్రసూ, ఫోన్ నెంబరూ రాసిస్తాను," అంది.

కాగల కార్యం గంధర్వులే చేస్తారన్నట్టుగా మణి సంతోషంతో రుద్రని ఆ సాయంత్రమే రామాయగూడలోని రామలింగం గారింటికి తీసుకుపోయింది. ఆ దంపతులిద్దరూ


చైతన్యం సంకల్ప బలం

రుద్రని చూసి మొదటి చూపులోనే ఆకర్షితులైపోయారు. రుద్ర కూడా ఆ దంపతుల్ని చూసి ముచ్చటపడిపోయింది. ఇద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారు. ఫ్లాట్ చాలా అధునాతనంగా ఉంది. "నువ్వు మాతోనే ఉండిపోవాలి. చిన్న చిన్న పనులు చేస్తూ, మాతో కబుర్లు చెప్తూ ఉండాలి. సరేనా?" అన్నారు.

రుద్ర తలూపింది.

"జీతమెంత కావాలి?" ఆయన ప్రశ్నించారు.

"మీతోనే ఉండిపోయే పిల్ల. ఎంతివ్వాలని తోస్తే అంతే యివ్వండి. నా కోసం కాదు. పేదరికంలో ఉండే ఆమె తల్లిదండ్రుల కోసం," అంది మణి.

"ఎప్పట్నుంచి వస్తుంది?"

"యింటికి తీసుకుపోయి ఓ రెండు జతల బట్టలు తీసుకొని, రేపు ఉదయమే తీసుకువస్తాను. ఇక్కడదింపి నా పనులకు పోతాను." అంది మణి.

మర్నాడుదయమే మణి రుద్రని రామలింగంగారింట్లో దిగబెట్టి వెళ్లిపోయింది.

రుద్ర రామలింగం దంపతుల కుటుంబంతో తాతయ్యగారూ, అమ్మమ్మగారూ అంటూ ఇట్టే కలిసిపోయింది. వాళ్ళు తనకి ముందుగా భోజనం పెట్టి తర్వాత తాము తింటున్నారు. ఒక చిన్న గదిలో పక్క ఏర్పాటు చేశారు. రామలింగంగారు సులభగ్రాహ్యంగా ఉండే కొన్ని తెలుగు పుస్తకాలు చదువుకోమని ఇచ్చారు. వాటిలో కాశీమజిలీ కథలు, అపూర్వచింతామణి కథలు, జానపద కథల పుస్తకాలున్నాయి. ఏవైనా అర్థం కాకపోతే తమని అడిగి తెలుసుకోమన్నారు.

నాలుగోరోజుకల్లా రుద్ర కొంత అన్యమనస్కంగా కనబడింది. "పిల్ల బెంగపెట్టుకొన్నట్టుగా ఉంది. పంపించేస్తే బావుంటుందేమో? ఇంత చిన్నదాన్ని తల్లిదండ్రులకు దూరంగా, వేరేఊరులో పనికి పెట్టుకోవడం మంచిది కాదేమో? అయినా ఆ తల్లి దండ్రులకు బుద్ధి ఉండాలి!" అన్నారు రామలింగం గారు.

"అలాగైతే మనం ఆ పిల్లకోసం బెంగ పెంచుకోకుండా వెంటనే పంపించేయండి. అనుబంధాలు పెరిగితే తర్వాత మనకీ కష్టమైపోతుంది. రుద్రని అడిగి చూస్తాను," అంది రామలింగంగారి భార్య సీతమ్మ.

సీతమ్మ విషయం కదపడంతోనే రుద్ర ఏడుపు మొహం పెట్టింది. బుజ్జగించడంతో జరిగిన సంగతి చెప్పి, ఆ తర్వాత అంది. "మా ఊరెల్లడం నాకిష్టం లేదు. నా కొత్తమ్మ నన్ను చదువుకోనివ్వక బాధలు పెట్టేస్తుంది. మానాన్న ఏమీ చేయలేడు. గుడి బయట ప్రసాదం తిన్న తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు. నేను బస్సులో దొరికానని అంటే నమ్మినట్టు నటించాను. మీ యింట్లో పనికి కుదిర్చినప్పుడు వెంటనే సంబరపడిపోయాను. నన్నిక్కడ దిగబెట్టిన రోజుకి ముందు రాత్రి నాకిచ్చిన రెండు జతల బట్టలూ నావే! అప్పుడు నా కొత్తమ్మే నన్ను వీరికి అమ్మేసినట్టు అనిపించింది. అయితే ఆ బట్టలు నావేనన్నట్టుగా నేను బయట పడలేదు. మణి ఆంటీ, సోమరాజు అంకుల్ ఎన్నో జాగ్రత్తలు చెప్పారు. మీ అలవాట్లను గమనించమన్నారు. ఇంట్లో ఎక్కడి సామాన్లు అక్కడే ఉండేటట్లు చూడమన్నారు. బీరువాల తాళాలూ అవీ ఎక్కడ పెట్తారో తెలిసికొని వాటి జోలికి పొరపాటున కూడా పోవద్దని హెచ్చరించారు. వాళ్ళు చెప్పిన తీరు చూస్తే నా ద్వారా మీ సంగతులు తెలుసుకోవాలన్న ఇది కనిపించింది. వచ్చే ఆదివారం తను వచ్చి, తనతోకూడా తీసుకు వెళ్ళి సాయంత్రానికల్లా దిగబెట్టేస్తానంది. నా కెందుకో భయంగా ఉంది. నేనెక్కడికీ వెళ్ళను. మీతోనే ఉంటాను."

రామలింగం ఆలోచనలో పడి తన స్నేహితుడు సీతాపతికి ఫోన్ చేశాడు. అతను పోలీసు శాఖలో పనిచేసి రిటైరయ్యాడు. ఓ గంట తర్వాత సీతాపతి వచ్చాడు. రుద్ర తన కథని మరోసారి వినిపించింది. సీతాపతి రుద్రకి తన సెల్ తో ఫోటో తీసి, ఆ ఇలాకా పోలీసు స్టేషన్ కి వెళ్ళి సంగతి చెప్పాడు. వాళ్ళ వెబ్ లో కృష్ణపట్నం నుంచి వచ్చిన రుద్ర స్కెచ్ కనబడింది. సీతాపతి రుద్ర చెప్పిన సంగతి వాస్తవమేనని రామలింగానికి తెలియజేశాడు. సీతాపతి కొన్ని ఏర్పాట్లు చేశాడు.

ఆదివారం ఉదయం మణి రామలింగం యింటికి వచ్చింది. రామలింగం దంపతుల్ని పలక-

రించి, రుద్రని తీసుకొనిపోయి సాయంత్రానికి తీసుకు వచ్చేస్తానంది.
పక్క గదిలోంచి ఇలాకా పోలీసు ఆఫీసరు వచ్చి మణికి బేడీలు వేశాడు. తీగ లాగితే డొంకంతా కదిలింది. సోమరాజు నివాసంలో కొన్ని చోరీ నగలూ, డబ్బూ దస్కం కనిపించాయి. పిల్లల్ని ఇళ్ళలో పనిలో కుదిర్చి, ఆనుపానులు తెలుసుకొని దొంగతనాలు చేసే ముఠా సభ్యులు వారు. ఓ దళారిద్వారా చంద్రన్న భార్య రుద్రని తమకి అమ్మేసిందని ఇద్దరూ ఒప్పుకొన్నారు. అక్కడ కృష్ణపట్నంలో పోలీసులు చంద్రన్న భార్యని కస్టడీలోకి తీసుకొన్నారు.

చంద్రన్నని ఓ కృష్ణపట్నం పోలీసు దగ్గరుండి నగరంలోని రామలింగంగారింటికి తీసుకు వచ్చాడు. చంద్రన్న కూతుర్ని కావలించుకొని మళ్ళీ పెళ్లిచేసుకోవడం తప్పయి పోయిందని ఏడ్చాడు. "నీ అదృష్ట బావుండి నీ కూతురు దొంగల ముఠాబారిన పడింది కానీ, పడుపువృత్తిని కొనసాగించే నరరూప రాక్షసుల బారిన పడి ఉంటే ఏమయ్యేదో ఆలోచించుకో! ఇకనైనా కూతుర్ని జాగ్రత్తగా చూసుకో," అని సీతాపతీ, ఇలాకా పోలిసాఫీసారూ గట్టిగా మందలించారు.

రుద్ర తండ్రితో వెళ్లడానికి ఒప్పుకోలేదు. సీతమ్మగారికేసి ఆశగా చూసింది.

"సరేలే, అలానే ఉండువుకాని. పనిపిల్లగా మట్టుకు కాదు! మా మనవరాలిగానే ఉండు. దగ్గర్లోనే మంచి స్కూలుంది. చేర్పిస్తాను. చక్కగా చదువుకొని పైకి రా!" అంది సీతమ్మ.

"నా మనసులోని మాట నువ్వే అనేశావు! సంతోషం!" అన్నాడు రామలింగం.

చంద్రన్న, "సర్! మీ లాంటివారి నీడలో ఆశ్రయం కలిగిస్తున్నారంటే రుద్ర చాలా అదృష్టవంతురాలు. మధ్యమధ్యలో ఒకసారి వచ్చి, చూసి పోయేటందుకు అనుమతించండి!" అని సెలవు తీసుకొన్నాడు.

"రుద్రా! రామలింగం దంపతులు నిన్ను పనిలో పెట్టుకోవడం ఒక విధంగా నేరమే అయినా, రెండిందాల మంచి జరిగింది. ఒకటి, ఓ నేరస్థుల ముఠా పట్టుబడింది. రెండు నీ భవిష్యత్ కి పునాది పడింది. నువ్వు పోలీసు శాఖలో ఉండదగిన దానివి. నీ చదువైన తర్వాత పోలీసు శాఖలో ప్రవేశించే శిక్షణా కార్యక్రమాల గురించి నేను చెబ్తాను," అన్నాడు సీతాపతి! ఆయన మాటల్లో తనంతవరకూ జీవిస్తానన్న నమ్మకం ఉంది.

విదేశాలకి వలస పోయిన కుటుంబ సభ్యులు లేని కొరత రామలింగం దంపతులకు రుద్ర తీర్చింది, 'రుద్ర, ఐ పి ఎస్' మా మనవరాలని వయోవృద్ధులైన రామలింగం దంపతులు గర్వంగా చెప్పుకొంటారు.

అవిటి కూతుర్ని చెల్లి వరహాలు పెద్దకొడుకు సింహాద్రికి మొహమాటం పెట్టేసి పెళ్ళిచేసిన చంద్రన్న మేనమామ స్వార్థంనుంచి మొదలై, రుద్ర ఐ.పి.ఎస్ అయ్యేవరకూ మధ్యగల పరిణామాల్ని పరిశీలిస్తే- రుద్ర జీవితాన్ని తల్లి పిడుగుపాటు మరణం ఒక మలుపు తిప్పిందని అనుకోవచ్చు. అటుపైన సవతితల్లి వేధింపులు, అపహరణ, రుద్ర ఆత్మస్థైర్యం, రామలింగం దంపతుల ఒంటరితనం రుద్ర జీవితాన్ని నడిపించిన కారణాలని నిర్ద్వంద్వంగా చెప్పుకోవచ్చు. అయితే అదృష్టరీత్యా ఆలోచిస్తే-'చెడుజరగడం కూడా మంచిదేనా?- అంతా మనమంచికేనా? అన్న సంధిగ్ధావస్థ తలెత్తుతుంది! ప్రపంచంలోని కోట్ల జనాభాలో ప్రతి వ్యక్తికి ఓ చరిత్ర ఉంటుంది. కొందరి జీవితాలు మట్టిలో కలిసిపోతాయి. మరికొందరి జీవితాలు కొంతకాలం పుస్తకాల పేజీల్లో దర్శనమిచ్చి ఆ తర్వాత అదృశ్యమైపోతాయి.

రుద్ర తన అర్హతలతో సమాజానికి ఏ విధంగా ఉపయుక్తమౌతుందో రాబోయే కాలమే చెబ్తుంది. మలుపులు లేని జీవితాలూ, తత్కారణంగా మార్పులు పొందని సమాజాలూ ఉండవు

## రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంపవలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు

# నీరు-విలువ




## చిలకమర్తి దుర్గా ప్రసాదరావు


### 2. నీరు- స్వరూప స్వభావాలు

సహజవనరులన్నిటిలో గాలి తరువాత నీటికి ఎంతో ప్రాముఖ్యం ఉంది .

సంస్కృతభాషలో నీటికి అనేక పదాలున్నాయి. అవన్నీ సార్థకాలే.

నీటిని (1) ఆప: అంటారు. ‘ఆప్నోతి ఇతి ఆప: ’. అంతటా వ్యాపించేది అని అర్థం. ఇక నీటిని (2) వారి అని కూడ పిలుస్తారు. ‘ అపవారయతి నిమ్నొన్నతం ఇతి వారి ’ అనే అర్థాన్ని బట్టి ఇది ఎత్తు పల్లాలను తొలగిస్తుంది. అలాగే ప్రవహించే స్వభావం కలిగి ఉండడం వలన దీనికి (3) సలిలం అనిపేరు (సరతి ఇతి సలిలం ). అలాగే దాహంతో బాధపడేవారు కోరుకునేది కాబ ట్టి (కామ్యతే తృషార్తై:) నీటికి (4) కమలం అని కూడ పేరు. ఘనరుపంలో కూడ ఉంటుంది కాబట్టి (జడతి - జడీ భవతి ఇతి జలం) నీటికి (5) జలం అని పేరు. పీయతే ఇతి పయ: అనే వ్యుత్పత్తిని బట్టి నీటిని (6) పయ: అంటారు. ఇది అందరి చేత త్రాగబడుతుందని అర్థం . అగ్నిని చల్లారుస్తుంది కాబట్టి నీటికి (7) కీలాలమని పేరు (కీలాన్జ్వాలాన్ అలతి వారయతీతి కీలాలం). నీటికి (8)అమృతం అనే పేరు కూడ ఉంది. న మ్రియతే అనేన ఇత్యమృతం అనే వ్యుత్పత్తిని బట్టి ఇది ప్రాణాలు కాపాడుతుంది అని అర్థం. ఇది త్రాగే ప్రతి ఒకరిని జీవింప జేస్తుంది కాబట్టి దీనికి (9) జీవనం అని పేరు జీవంత్యనేన ఇతి జీవనం. ఇది ప్రయోజనాలు నెరవేరుస్తుంది కాబట్టి నీటిని (10) భువనం అని పిలుస్తారు.

(భవతి సర్వం అనేన ఇతి ఇతి భువనం). నీటిని (10) వనం అని కూడ అంటారు. (వన్యతే యాచ్యతే ఇతి వనం ) ఐది ప్రతి వ్యక్తి చేత కోరబడే ది. అందరికి కావలసినది. నీటిని (11) కబంధం ( కం బధ్నాతి) అని కూడ పిలుస్తారు. ఎందుకంటే ఇది శరీరాన్ని ఒకే విధంగా బంధించి ఏకంగా ఉంచుతుంది. ఉనక్తి ఇతి ఉదకం అని చెప్పడం వల్ల ఇది ద్రవస్థితిలో ఉంటుంది కాబట్టి (12) ఉదకమని పిలుస్తారు. పాతి భూతాని ఇతి పాథ: అనే అర్థంలో ఇది అన్ని జీవులను రక్షిస్తుంది కాబట్టి (13) పాథ: అని పిలవబడుతోంది. అలాగే ఇది ప్రతిజీవిని పోషించడం వల్ల (14) పుష్కరం ( పోషయతి ఇతి పుష్కరం) అయింది . ఇది (సర్వతో ముఖాని అస్య) ఘన, ద్రవ, వాయు అనే మూడు రూపాల్లోనూ ఉంటుంది కాబట్టి (15) సర్వతో ముఖం అయింది. ఇది ప్రవహించే స్వభావం కలిగి ఉండడం వల్ల(అమతి గచ్ఛతి ఇతి) (16) అంభస్సు అయింది. ఇది శరీరానికి కావలసిన పోషకపదార్థాలను అందించి రక్షిస్తుంది కాబట్టి (తన్యతే పాలయతి ఇతి) (17) తోయం అని పిలుస్తారు. త్రాగుటకు యోగ్యమైనది కావడం వల్ల (పాతుం యోగ్యం ) (18) పానీయం అయింది . అందరికి సుఖాన్ని, ఆనందాన్ని ఇస్తుంది కాబట్టి

( నయతి సుఖం ) (19) నీరం అయింది. ఆవిరై నశిస్తుంది

అంటే బాష్పీభవనానికి లోనవుతుంది కాబట్టి (20) క్షీరం (క్షీయతే ఇతి ) అని పిలుస్తారు. ప్రవహిస్తూ ధ్వని చేస్తుంది కాబట్టి (అంబతే ఇతి) ఇది (21) అంబు అయ్యింది . శం సుఖం వృణోతి అనే అర్ధంలో అందరికి సుఖాన్ని, ఆనందాన్ని కలిగించడం చేత (22) శంవరం అయింది. ఈ విధంగా నీటికి ఉన్న అన్ని మాటలు అర్థవంతంగా ఉండి నీటి యొక్క వివిధలక్షణాల్ని, ఉపయోగాల్ని వివరిస్తున్నాయి.

## 3. నీటి కాలుష్యం- కారణాలు:

విచక్షణారహితంగా రసాయనద్రవ్యాల వినియోగం, మురికినీటిని, వివిధ కర్మాగారాలనుండి బయటకు విడిచిపెట్టిన కలుషమైన నీటిని నదులలోకి, కాలువలలోకి వదిలేయడం, అశాస్త్రీయమైన జలనిర్వహణవిధానాలు, అవాంఛిత మైన, ప్రమాదకరమైన వస్తువులను నీటిలో పారవేయడం మొ|| నీటి కాలుష్యానికి దోహదం చేస్తున్నాయి. ఈ ప్రపంచంలోని సమస్తజీవుల మనుగడకు కారణమైన నీటిని మనం పరిశుభ్రంగా ఉంచాలి. మన పూర్వీకులు దాని స్వచ్ఛతను కాపాడడానికి ఏ ఏ విధానాలు ఆసరించారో అర్థం చేసుకోవాలి. నీటి ప్రాముఖ్యాన్ని గుర్తించాలి. పిల్లలకు, పెద్దలకు అందరికి తెలియజెప్పాలి.

## 4. నీటి ప్రాముఖ్యం:

ఋగ్వేదంలో నాసదీయసూక్తం (10/129) ప్రకారం సృష్టి ముందు నీరు మాత్రమే ఉంది. హిందూధర్మం, పురాణాలు నీటిని విష్ణువు యొక్క నివాసంగా వర్ణిస్తున్నాయి. నారా: ఆప: అయనం స్థానం యస్య స: నారాయణ: అని నీరే నివాసస్థానం గలవానిగా స్తుతించాయి. నీరు మానవజీవితంలో చాల ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. ప్రాణిజీవనానికి అడుగడుగునా నీటి అవసరం ఉంది. ఏ వైదికకార్యకలాపమైన నీటిని ఉపయోగించకుండ నిర్వహించడం సాధ్యం కాదు. నీటి ప్రాధాన్యాన్ని చెప్పే వేదమంత్రాలు వందలకు పైగా ఉన్నాయి. సంస్కృతంలో నీటిని జీవనం అంటారు. ఇది అమరత్వాన్ని ప్రసాదించే ఒక పానీయం. మన దేశం వ్యవసాయప్రధానమైన దేశం. వ్యవసాయం నీటి మీద ఆధారపడి ఉంటుంది. నీటిని ఒక దివ్య ఔషధం గాను (6/1) అలాగే తల్లిగాను కూడ(6/2) పరిగణిస్తారు. మన ప్రాచీనవైద్యవిధానం ద్వారా (6/3) మానస గంగోత్రి నుండి వెలువడిన నీటిని క్రిమినాశకజలం(distilled-water)గా ఉపయోగించేవారని తెలుస్తోంది. అందుకే మన ప్రాచీనులు, నీటి ప్రాముఖ్యం గుర్తింఛి నీటితో మమైక్యం చెందారు.

మన సంస్కృతిలో మానవులకు నీటితో సంబంధబాంధవ్యా-

లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఎంతో మంది గొప్ప వ్యక్తులు నదులను వివాహం చేసుకున్నారు. ఉదాహరణకు: - శంతనుడు గంగను, పురుకుత్సుడు నర్మదను, శ్రీరాముని కుమారుడైన కుశుడు కుముద్వతిని వివాహం చేసుకున్నారు. నదుల చరిత్రలను వివరించే ఎంతో సాహిత్యం మనకుంది. మనుషులకు, వాహనాలకు, కట్టడాలకు నదుల పేర్లు పెట్టుకోవడం మన సాంప్రదాయం. నదులలో స్నానం చెయ్యడం కూడ ఒక పవిత్ర కార్యక్రమంగా భావిస్తాం. ఇక గంగానదిని కేవలం చూస్తేనే ముక్తి లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. (8)

ఈ సందర్భంలో ఒక విషయం ప్రస్తావించడం అసందర్భం కాదు. ఇటీవల పరమపదించిన సన్నాయి వాద్యకళాకారుడు శ్రీ బిస్మిల్లా ఖాన్ గార్ని అమెరికా దేశీయులు తమదేశానికి ఆహ్వానిస్తూ – అయ్యా! మీరు శాశ్వతంగా మా దేశానికొచ్చెయ్యండి మీకు ఏ లోటు రానివ్వం, కోరిన ధనం ఇస్తాం, సకల సౌఖ్యాలు ఏర్పాటు చేస్తాం అన్నారు . సరే నేను వస్తాను మరి నాకు గంగమ్మ తల్లిని అక్కడ ఏర్పాటు చేయగలరా? అని అడిగారు. వారు సారీ సార్ అన్నారు. ఈయన సమాధానంగా వెరీ సారీ, నేను ఈ పవిత్రగంగాతీరం కాశీని విడిచిపెట్టి అక్కడికి రాలేను అని చెప్పేశారు. కాబట్టి మనకు నీరంటే కేవలం $H_2O$ కాదు, అంతకంటే అతీతమైన దైవ స్వరూపం .

## 5. నీటికాలుష్యం—మహాపాపం:

వేదం జలకాలుష్యాన్ని తీవ్రంగా నిరశించింది. ఏ పరిస్థితిలోను నీటిని కలుషితం చెయ్యకూడదని హెచ్చరించింది. (9) నీటిని కలుషితం చెయ్యడం నేరంగా పరిగణిం చింది. కృష్ణుడు విషసర్పమైన కాళియుని శిక్షిస్తూ -- ఓ కాళియా! నువ్వు పవిత్రమన నదీజలాలను కలుషితం చేశావు, అందుకే నిన్ను దండించాను. ఇప్పుడు క్షమిస్తున్నాను. కానీ నువ్వు ఇక్కడ ఏ మాత్రం ఉండకూడదు. తిరిగి సముద్రానికి వెళ్లి మీ వాళ్ళతో సుఖంగా బ్రతుకు. నది మానవుల ఉపయోగం కోసం ఉద్దేశించబడింది. వారి జీవితాలు నదిపై ఆధారపడి ఉన్నాయి . నువ్వు నీ విషంతో కలుషితం చెయ్యడం శిక్షించదగిన నేరం అంటాడు (భాగవతం) . రామాయణం త్రాగునీటిని కలుషితం చెయ్యడం ఒక గొప్ప పాపంగా పరిగణిం చింది. రాముని తల్లి కౌసల్య భరతుని రాకను తెలుసుకుని, అతన్ని చేరి, రాముని అడవికి పంపించినందుకు తీవ్రంగా నిందించింది. అప్పుడు భరతుడు ఆమెతో అమ్మా! నేను నిజంగా రాముని అడవులకు పంపించాలనే చెడ్డ ఉద్దేశం కలవాణ్ణే అయితే త్రాగు నీటిని కలుషితం చేసేవాడు ఏ నరకానికి పోతాడో నేను కూడ ఆ నరకానికి పోతాను అని అంటాడు (10). దీన్ని బట్టి నీరు కలుషితం చెయ్యడం ఎంత నేరమో తెలుస్తోంది. ఎందుకంటే జలకాలుష్యం వల్లనే మనం అనేక వ్యాధులతో బాధపడుతున్నాం. సుజలాం సుఫలాం అని పిలవబడే మనదేశంలో మంచినీరు కూడ డబ్బుతో కొనుక్కుని త్రాగవలసిన దౌర్భాగ్యస్థితిలో ఉన్నాం. మనిషికి ప్రకృతికి మధ్య గల బంధం ప్రాచీనకాలం నుండి చాల బలంగా ఉంది. అందువల్ల మనం ప్రకృతితో మితిమీరినజోక్యం విడిచిపెట్టి దాని సమతౌల్యాన్ని కాపాడవలసిన గురుతరమైన బాధ్యత మన మీద ఉంది. ప్రసిద్ధ అమెరికన్ నవలా రచయిత ఎర్నెస్ట్ హెమింగ్వే అన్నట్లు "Mending nature is ending nature".

ప్రకృతిని అణచి పెట్టడమంటే ప్రకృతిని నాశనం చెయ్యడమే.

## 6. అనుసరించ వలసిన పద్ధతులు:

1. నీటిని పవిత్రమైన, విలువైన వస్తువుగా భావించాలి. వ్యర్థం కాకుండా చూడాలి.

2. ఇప్పటికే నదీజలాలు చాల వరకు కలుషితమై పోయాయి. ఇప్పటికైనా తగిన చర్యలు చేపడితే తీవ్రనష్టం కలగకుండ జాగ్రత్తపడొచ్చు.

3. జలనాణ్యతానిర్వహణపద్ధతులు సమర్థవంతంగా చేపడితే రాబోయే నష్టాన్ని నివారించొచ్చు. నివారణచర్యలు సమయం తీసుకుంటాయి. కాబట్టి prevention is better than cure అన్నట్లు మనం చిత్తశుద్ధితో మన ప్రాచీనులు అనుసరించిన మార్గాన్ననుసరించి మసలుకుంటే జలకాలుష్యానికి తావే ఉండదు.

ఒక అమెరికన్ సామెత ఇలా చెబుతోంది. ఇదైన మన మనస్సులో కొన్ని మార్పులు తేవాలి.

"ఆఖరి చెట్టును నరికిన తరువాతనే
ఆఖరి చేపను పట్టుకున్న తరువాతనే
ఆఖరి నదిని కలుషితం చేసిన తర్వాతనే
డబ్బు తినడానికి పనికి రాదని నువ్వు గ్రహిస్తావు"

Only after the last tree has been cut down,
Only after the last fish has been caught,
Only after the last river has been poisoned,
Only then will you realize that money cannot be eaten"

---

Native American Saying----

యజుర్వేదంలోని ఈ శాంతి మంత్రంతో వ్యాసం ముగుస్తుంది.

द्यौः शान्तिः | अरन्तरिक्ष शान्तिः
| पृथिवी शान्तिः आपः शान्तिः |
ओषधयः शान्तिः | वनस्पतयः शान्तिः
| विश्वे देवाः शान्तिः | ब्रह्म शान्तिः |
सर्वं शान्तिः | शान्तिरेव शान्तिः | सा मा
शान्तिरेधि ||

Save water --- Save the world.

References:

(1) अग्निर्देवता वातो देवता सूर्यो देवता चन्द्रमा देवता वसवो देवता रुद्रा देवता ss दित्या देवता मरुतो देवता विश्वेदेवा देवता

### రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంప వలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు

చైతన్యం సంకల్ప బలం

### చందా రేట్లు

| | |
|---|---|
| విడిప్రతి | రూ. 20.00 |
| సంవత్సరానికి | రూ. 200.00 |
| పోస్ట్ ద్వారా | రూ. 230.00 |

Please deposit your subscription in favour of
CHAITANYAM SANKALPABALAM
A/c No. 1626201002070 - Canara Bank
Kundanbagh Branch, Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:
చైతన్యం
సామాజిక విలువల మాస పత్రిక
ప్లాట్ నంబర్ 45058
జనప్రియ ఉటోపియా
హైదర్ గూడ, అత్తాపూర్
హైదరాబాద్ - 500 048
Email: teega51@gmail.com
Visit: www.chaitanyam.net

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

**ఆధారాలు : 1) ణ = అసలు అక్షరం 'త'; 2) ప = అసలు అక్షరం 'క'**

**కాడకాటులా పృవ్నా**
**కముపు ణేదె మొముపు దడుమ**
**లాడమాటులా లుపుంత లదరు ణీసహా**
**య్మృణి మశాతుమద్ది బేస్బి**
**శణుము దిద్దు లతిది ణమబె**
**రతలమగృతశా దిద్దు**
**రద్దుణింబు చసదాలలు**

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

అగాధమౌ జలనిధిలోనే
ఆణిముత్యమున్నటులే
శోకాల మడుగున దాగి
సుఖమున్నదిలే
ఏదీ తనంత తానై నీదరికి రాదు
శోధించి సాధించాలి అదియే ధీరగుణం

అక్టోబర్ నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు: శ్రీ కాశీసోమయాజుల మధు, హ్యూస్టన్
శ్రీ Kan K



అన్నవరం సత్యనారాయణస్వామి వారు

RNI No. TELTEL/2011/39497 NOVEMBER2019 Postal No. HSE/1043/2017-19
Date of Publishing 1st November Date of Posting 8th November



Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001